సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 132

బుధవారం 2-8-2017

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



‘బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి’



పాక్ పీఎంగా అబ్బాసీ ప్రమాణం

ఆయన్ను ప్రధానిగా ఎన్నుకున్న పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీ -11లో



గ్యాస్ ‘సబ్సిడీ ఎత్తివేత’పై భగ్గు

పార్లమెంట్‌లో విపక్షాల నిరసన. నాటి యూపీఏ నిర్ణయమేనన్న ప్రభుత్వం -11లో



పీఎం భార్గవ కన్నుమూత

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో తుదిశ్వాస
- సీసీఎంబీ వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఎనలేని సేవలు
- ప్రముఖుల సంతాపం
- రేపు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు

2లో

పనగడియా బై.. బై!!



- నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ పదవి నుంచి వైదొలగనున్నట్లు అరవింద్ పనగడియా ప్రకటించారు. ఆగస్టు 31న బాధ్యతల నుంచి తప్పుకొని తిరిగి కొలంబియా వర్సిటీకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఇండో–అమెరికన్ అయిన అరవింద్ పనగడియా 2015 జనవరిలో నీతి ఆయోగ్ తొలి వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

వివరాలు 14లో

డిగ్గీ రాజా ఔట్.. కుంతియా ఇన్





- దిగ్విజయ్ స్థానంలో రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమించిన సోనియా
- రెండో ఇన్‌చార్జిగా కర్ణాటకకు చెందిన సతీశ్ జర్కిహోలి

- వివరాలు 6లో

సీట్ల పెంపు సాధ్యం కాదు

లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం

- తెలంగాణ, ఏపీల్లో అసెంబ్లీ స్థానాల పెంపు ఇప్పట్లో సాధ్యం కాదన్న కేంద్రమంత్రి హన్స్‌రాజ్
- ఈ అంశంపై న్యాయశాఖతో సంప్రదింపులు జరిపామని వెల్లడి

2లో



పరీక్షలేనా..? భర్తీ లేదా.. బ్రదర్!



ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగుల ఎదురుచూపులు

- నోటిఫికేషన్లు జారీ అవుతున్నా ముందుకు సాగని భర్తీ ప్రక్రియ
- అర్హతలు, నియామక పరీక్షల్లో వరుస తప్పిదాలు
- విపరీత నిబంధనలతో గందరగోళం
- అభ్యర్థుల వ్యతిరేకత, కోర్టు కేసులతో నిలిచిపోతున్న వైనం
- గ్రూప్-2 ఉద్యోగాలకు వైట్‌నర్ దెబ్బ
- విపరీత నిబంధనలతో గురుకుల పోస్టులకు గండం
- మార్గదర్శకాలు పాటించక లక్ష మంది ‘టెట్’కు దూరం



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ అవుతున్నా భర్తీ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో లక్షలాది మంది నిరుద్యోగులు ఆందోళనలో కూరుకుపోతున్నారు. అర్హతలు, నిబంధనలు మొదలుకుని సిబ్బంది తప్పిదాలు, కోర్టు కేసుల దాకా ఎన్నో అడ్డంకులతో పోస్టుల భర్తీ జరగక ఆవేదన చెందుతున్నారు. గ్రూప్–2, గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు ఏడాదిన్నర కిందటే నోటిఫికేషన్లు జారీ అయినా ఇప్పట్లో ఉద్యోగ నియామకాలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో నిబంధనలతో దాదాపు లక్ష మంది పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయారు. వైద్యారోగ్య శాఖలో పోస్టుల భర్తీకి అనుమతినిచ్చి ఏడాది దాటుతున్నా.. మార్గదర్శకాల్లో అస్పష్టత కారణంగా పోస్టుల భర్తీ ప్రక్రియ ముందుకు కదలడం లేదు. పలు శాఖలు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే

మిగతా 2వ పేజీలో ▶

ఎన్నో నోటిఫికేషన్లు..

జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) మార్గదర్శకాల ప్రకారం అన్ని అర్హతలు ఉన్నా కూడా.. విద్యా శాఖ పెట్టిన నిబంధనలతో దాదాపు లక్ష మంది అభ్యర్థులు టెట్‌కు దూరమయ్యారు.

4.97 లక్షల మంది హాజరైన గ్రూప్–2 పరీక్షలో వైట్‌నర్ వ్యవహారం కొత్త సమస్యను లేవనెత్తింది. ఈ విషయంగా టీఎస్‌పీఎస్సీ తీసుకున్న నిర్ణయాలతో పోస్టుల భర్తీ ఆగిపోయింది.

ఎన్‌సీటీఈ పేర్కొనని నిబంధనలు విధించడంతో.. 2.5 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న గురుకుల టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను వివాదాలు చుట్టుముట్టాయి.

వైద్యారోగ్య శాఖలోని 2,118 పోస్టుల భర్తీ కోసం గతేడాది జూలై 13న ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ అర్హతలు, నిబంధనలు, ఇతర మార్గదర్శకాల్లో స్పష్టత లేక ఏడాదిగా ప్రక్రియ ముందుకు సాగలేదు.



స్కెచ్ విక్రమ్‌దే!

- తనపై కాల్పులకు పథకం రచించింది విక్రమ్‌గౌడే
- అమలులో పెట్టేందుకు సహకరించిన సన్నిహితుడు
- విక్రమ్‌ను నిందితునిగా చేర్చిన పోలీసులు.. అదుపులో నలుగురు
- తుపాకీ కొత్తచెరువులో పారేసినట్లు అనుమానాలు

- వివరాలు 6లో

పెళ్లికి జీఎస్టీ ‘బ్యాండ్’!



జీఎస్టీతో 20 శాతం వరకు పెరిగిన వ్యయం

శ్రావణంలో భారీ వివాహ వ్యయాలపై ఐటీ కన్ను

శ్రావణ మాసం వచ్చింది. ఎప్పటిలాగే పెళ్లిళ్ల సీజన్ తెచ్చింది. వస్తూ వస్తూ ఈసారి జీఎస్టీని మోసుకొచ్చింది. ఇంకేముంది.. పెళ్లి ఖర్చు 15 నుంచి 20 శాతం వరకు పెరిగింది. దుస్తుల దగ్గర నుంచి ఆభరణాలు, ఫర్నిచర్, అలంకరణ, ఫొటోగ్రఫీ.. ఇలా వివాహానికి కావాల్సిన అన్నింటిపైనా జీఎస్టీ తన ప్రభావం చూపిస్తోంది. అంతే కాకుండా గోరుచుట్టుపై రోకలిపోటులా వివాహానికి పెట్టే ఖర్చులపై ఐటీ శాఖ కూడా కన్నేసింది. దీంతో అన్ని వర్గాలవారు ఆడంబరాలకు దూరంగా పెళ్లిళ్లు జరిపించేస్తున్నారని ఈవెంట్ మేనేజర్లు అంటున్నారు.

- వివరాలు 10లో

ముగిసిన ‘డ్రగ్స్’ విచారణ

చివరి రోజు నందును ప్రశ్నించిన సిట్

- కెల్విన్‌తో సంబంధాలపై ప్రశ్నలు
- ఈవెంట్ మేనేజర్‌గానే తెలుసునన్న నటుడు
- చార్జిషీట్ వేసే యత్నాల్లో అధికారులు



మంగళవారం విచారణకు హాజరైన నందు

సాక్షి, హైదరాబాద్

డ్రగ్స్ కేసులో తొలి జాబితాలో ఉన్న సినీ ప్రముఖుల విచారణ ఎట్టకేలకు ముగిసింది. మంగళవారం వర్ధమాన నటుడు ఆనంద్ కృష్ణ అలియాస్ నందు సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని తన ఇంటి నుంచి తండ్రి, మేనమామతో కలసి బయలుదేరిన నందు.. అక్కడి సాయిబాబా ఆలయంలో పూజలు చేసి ఉదయం 10 గంటల సమయంలో ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం ఆవరణలో ఉన్న బాలాత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారికి మొక్కుకొని విచారణ కోసం లోనికి వెళ్లారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన విచారణ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముగిసింది.

కెల్విన్‌తో సంబంధమేంటి?

కెల్విన్ ఫోన్ కాల్‌డేటాలో నందు నంబర్ ఉండటంపై సిట్ అధికారులు ఆయన్ను ప్రశ్నించినట్టు తెలిసింది. వీకెండ్ పార్టీలకు ఎక్కువగా వెళ్తుంటారా? అని సిట్ ప్రశ్నించగా తనకు అలవాటు లేదని, కెల్విన్ కాల్‌డేటాలో నంబర్ ఎలా వచ్చిందో కూడా తెలియదని అధికారులకు వివరించినట్టు సమాచారం. వాట్సాప్‌లో కెల్విన్‌తో చాటింగ్‌పై ప్రశ్నించగా.. ఈవెంట్ మేనేజర్ కావడం వల్ల తన నంబర్ ఇచ్చి ఉంటానని, అంతకు మించి డ్రగ్స్ వ్యవహారంలో అతడితో ఎలాంటి సంబంధం లేదని చెప్పినట్టు తెలిసింది. కావాలంటే తన రక్త నమూనాలు, వెంట్రుకలు, గోర్ల శాంపిల్స్ తీసుకొని పరీక్షలు చేయాలని నందు కోరినట్టు సిట్ వర్గాలు తెలిపాయి. అయితే ప్రస్తుతం శాంపిల్స్ అవసరం లేదని అధికారులు పేర్కొన్నట్టు తెలిసింది. సినీ ఇండస్ట్రీలో ఎవరెవరు డ్రగ్స్ వాడతారో తెలుసా అని అడగ్గా.. ‘నేను ఇప్పుడిప్పుడే పెద్దపెద్ద బ్యానర్లలో నటిస్తున్నా. అలాంటి వివరాలేవీ నాకు తెలియదు’ అని నందు చెప్పినట్టు సమాచారం.

తదుపరి చర్యలేంటి?

డ్రగ్స్ కేసులో 12 మంది సినీ ప్రముఖుల విచారణను సిట్ మంగళవారంతో ముగించింది. తర్వాత చర్యలేంటి? ఇంకెవరికైనా నోటీసులిస్తారా? సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను విచారిస్తారా అన్న ప్రశ్నలకు సిట్ అధికారులు సమాధానం

మిగతా 2వ పేజీలో ▶


లష్కరే టాప్ కమాండర్ దుజానా హతం

ఎన్‌కౌంటర్‌లో దుజానాతో పాటు మరో ఉగ్రవాది దార్ మృతి

పుల్వామా జిల్లాలో ఇంట్లో నక్కిన ఉగ్రవాదుల్ని మట్టుబెట్టిన బలగాలు

కశ్మీర్ లోయలో అప్రమత్తత.. మొబైల్, ఇంటర్నెట్ సేవలు బంద్

11లో



ఉద్యాన పోస్టుల భర్తీకి సర్కారు నో

- 402 పోస్టుల భర్తీ ప్రతిపాదనలను తిరస్కరించిన ఆర్థికశాఖ.. వ్యవసాయశాఖ పంపిన ఫైల్ వెనక్కి
- పోస్టుల భర్తీ కోసం నెలరోజులుగా ఉద్యాన విద్యార్థుల సమ్మె

16లో



ఇదండీ సంగతి



ఎన్నాళ్లీ వర్ష విరామం!

రెండు వారాలైనా జాడ లేని చినుకు..

- మరో 15 రోజులపాటు వర్షాభావ పరిస్థితులు: స్కైమెట్ అంచనా
- అదే జరిగితే ఖరీఫ్ పంటలపై తీవ్ర ప్రభావం
- సీజన్‌లో వరుసగా నెలపాటు వర్షాల్లేకపోవడం చాలా అరుదు: శాస్త్రవేత్తలు
- ఆగస్టు 15 తర్వాత వర్షాలకు అనుకూల వాతావరణమని వెల్లడి



సాక్షి నాలెడ్జ్ సెంటర్

వారమైంది.. రెండు వారాలైంది.. చినుకమ్మ జాడే లేదు.. విత్తు వేసిన రైతు ఆశగా నింగివైపు చూస్తున్నా వరుణుడు కనికరించడం లేదు! జూలై రెండో వారం వరకు మురిపించిన వర్షాలు ఆ తర్వాత నుంచి ముఖం చాటేశాయి. మరో రెండు వారాల పాటు ఇదే పరిస్థితి ఉండొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అదే జరిగితే ఖరీఫ్‌పై తీవ్ర ప్రభావం తప్పకపోవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రుతుపవనాల సీజన్ మధ్యలో కొంత విరామం రావడం సహజమే అయినా ఇప్పటివరకూ అది గరిష్టంగా ఏడెనిమిది రోజులు మాత్రమే ఉండేదని.. దాదాపు నెలరోజుల పాటు వర్షాల్లేకపోవడం చాలా అరుదని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్‌కు చెందిన శాస్త్రవేత్త మహేశ్ పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే మరో రెండు వారాల పాటు.. అంటే ఆగస్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశముందని ఆయన తెలిపారు. ‘‘2009లో రుతుపవనాలకు కొంత విరామం వచ్చి.. ఆ తర్వాత పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. ఈ ఏడాది అలాంటి పరిస్థితి లేదు. ఆగస్టు 15 తర్వాత బంగాళాఖాతంలో అల్పపీడనం వంటి వాతావరణ వ్యవస్థలు ఏర్పడేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. హిమాలయ పర్వత సానువుల వద్ద స్తంభించిపోయిన రుతుపవన మేఘాలకు పశ్చిమ దిక్కు నుంచి వీచే గాలుల మద్దతు లభిస్తున్నా

మిగతా 2వ పేజీలో ▶

పరశురాములుకు తొలి ‘పాయింట్’

హెల్మెట్ లేనందుకు విధించిన ట్రాఫిక్ పోలీసులు

గ్రేటర్‌లో అమలులోకి ‘ట్రాఫిక్’పాయింట్ల విధానం

తొలి రోజు కేసులు..	తొలిరోజు పాయింట్లు
1,324	1,493



సాక్షి, హైదరాబాద్: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనులకు పెనాల్టీ పాయింట్లు విధించే విధానం మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసులు తమ తమ పరిధుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ.. చలాన్ టికెట్ జారీ చేయడంతో పాటు పాయింట్లు వడ్డించారు. క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును సంయుక్త పోలీసు కమిషనర్ వి.రవీందర్ స్వయంగా పర్యవేక్షించారు. నగరానికి

మిగతా 2వ పేజీలో ▶

సీట్ల పెంపు సాధ్యం కాదు

లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాల పెంపు ఇప్పట్లో సాధ్యం కాదని కేంద్రం స్పష్టం చేసింది. మంగళవారం లోక్‌సభలో టీడీపీ ఎంపీ ఎం.మురళీమోహన్, టీఆర్‌ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఈ అంశంపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26(1) ప్రకారం కేంద్రం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపును పరిశీలిస్తోందా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 170ని సవరించేందుకు బిల్లు తెస్తోందా? సీట్ల పెంపులో ఉన్న ఇబ్బందులేమిటి? తదితర ప్రశ్నలను సభ్యులు కేంద్రం ముందుంచారు. దీనికి హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ సమాధానమిస్తూ.. ఈ అంశంపై న్యాయ శాఖతో సంప్రదింపులు జరిపామని తెలిపారు. అయితే ఆర్టికల్ 170(3) ప్రకారం 2026 తరువాత వచ్చే జనగణన ప్రచురితమయ్యేంతవరకు అసెంబ్లీ సీట్ల సర్దుబాటు చేయలేమని అటార్నీ జనరల్ తన అభిప్రాయాన్ని వెల్లడించినట్లు న్యాయశాఖ తెలిపిందని మంత్రి వివరించారు. ఈ నేపథ్యంలో ఆర్టికల్ 170ని సవరించేంతవరకు సీట్ల సంఖ్యను పెంచలేమని ఆయన స్పష్టం చేశారు.

✦ 10తో ముగియనున్న ఎల్పీయూ అడ్మిషన్లు

జలంధర్: లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్పీయూ)లోని వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 10తో ముగియనుంది. ఈ విద్యాసంవత్సరానికి గానూ ఇప్పటికే 50 దేశాలు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. యూకే, చైనా, కొలంబియా వంటి పలు దేశాల విద్యార్థులు అడ్మిషన్లు పొందిన వారిలో ఉన్నారు. ఎల్పీయూలో చేరడానికి విద్యార్థుల నుంచి వస్తున్న స్పందన పట్ల యూనివర్సిటీ చాన్స్‌లర్ అశోక్ మిట్టల్ హర్షం వ్యక్తం చేశారు. అడ్మిషన్లకు సంబంధించి ఏదైనా సమాచారం కోసం www.lpu.com వెబ్‌సైట్‌ను గానీ, 01824-404408, 1800 102 4431 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అలాగే admissions@lpu.co.inకు మెయిల్ చేయవచ్చని సూచించారు.

✦ రాజీవ్ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

హైదరాబాద్: బ్యుటీషియన్ శిరీష ఆత్మహత్య కేసులో రిమాండ్‌లో ఉన్న ఏ2 నిందితుడు వల్లభనేని రాజీవ్ బెయిల్ పిటిషన్‌ను కోర్టు మంగళవారం తిరస్కరించింది. బెయిల్ కోసం రాజీవ్ రెండోసారి దరఖాస్తు చేసుకోగా, పిటి షన్‌ను సెషన్ జడ్జి కొట్టివేశారు. శిరీష ఆత్మహత్య చేసుకున్న ఘటనలో నింది తుడు రాజీవ్‌ను జూన్ 16న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఏ1 నిందితుడు శ్రావణ్‌కు 2 రోజుల క్రితం బెయిల్ మంజూరైన విషయం తెలిసిందే.

సెన్సార్‌బోర్డుకు నూతన సభ్యులు

సాక్షి, హైదరాబాద్: ప్రాంతీయ సెన్సార్ బోర్డు సభ్యుడిగా వరంగల్ జిల్లాకు చెందిన జర్నలిస్టు దొంతు రమేశ్ నియమితులయ్యారు. రమేశ్ రెండు దశాబ్దాలుగా వివిధ మాధ్యమాల్లో పనిచేస్తున్నారు. రమేశ్‌తో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన టి.రాంరెడ్డి, పి.వెంకటేశ్వరరెడ్డి, నరహరి తిరుపతి, నర్వ ప్రకాశ్‌రావు, పైడి రాజు, జి.చిట్టిబాబు, బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, మేడపాటి రవీంద్ర కూడా సెన్సార్ బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు.

ముగిసిన 'డ్రగ్స్' విచారణ

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పడం లేదు. ప్రస్తుతానికి ఇంతటితో విచారణ ముగిసిందని, చార్జిషీట్ దాఖలు చేసే సన్నాహాల్లో ఉన్నామని సిట్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

మీడియా పాయింట్ ఎత్తివేత

డ్రగ్స్ కేసు ప్రారంభమైన నాటి నుంచి ఉదయం 8 నుంచి రాత్రి 12 గంటల వరకు ఎక్సైజ్ కార్యాలయం వద్ద మీడియా హడావుడి ఉండేది. మంగళవారం చివరిరోజు విచారణ ముగిసిన వెంటనే ఎక్సైజ్ అధికారులు మీడియా పాయింట్‌ను ఎత్తేశారు. మీడియా ఎంట్రీ ఉన్న గేటుకు తాళం వేశారు.

ఎన్నాళ్లీ వర్ష విరామం!

▶ మొదటి పేజీ తరువాయి

బంగాళాఖాతం నుంచి తేమను మోసుకొచ్చే వ్యవస్థలు లేక వెనక్కు మళ్లలేకపోతున్నాయి. అయితే స్థానిక పరిస్థితులను బట్టి అక్కడక్కడా చెదురుమదురుగా జల్లులు పడేందుకు అవకాశం ఉంది''అని మహేశ్ వివరించారు. గతేడాది ఎల్‌నినో పరిస్థితి కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఏడాది అలాంటి ఇబ్బందులేవీ ఉండవని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. జూన్ 1న కేరళ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు ఆ తర్వాత కొంత స్తబ్దుగా ఉండిపోయాయి. ఆ తర్వాత కాస్త ఆలస్యంగా దేశమంతా విస్తరించాయి. తొలి నెలలో చెప్పుకోదగ్గ వర్షాలే కురిశాయి. జూలై రెండో వారం వరకూ ఈ అనుకూల వాతావరణం కొనసాగినా.. ఆ తర్వాత అనూహ్యంగా పరిస్థితులు మారిపోయాయి. 15 రోజుల నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో విత్తునాటిన రైతులు, నాట్లకు సిద్ధమైన రైతులు ఆందోళనలో మునిగిపోయారు.

వావ్ ఫ్యాక్టర్





● సమీప భవిష్యత్తులో మార్కెట్‌లోకి రానున్న ఇటలీ మోటార్ బైక్ 'ఊనో బోల్ట్' ఒకే చక్రం ఉండే ఈ బైక్‌ను పడిపోకుండా నడపవచ్చు. రివర్స్ కూడా తీసుకోవచ్చు!

ఏక చక్రం.. వాలు వేగం

ఫోటో చూసి.. ఇదేదో సర్కస్ ఫీట్ ఏమో అని అనుకునేరు. కానే కాదు. ఇది అక్షరాల మన రోడ్లమీద పరుగెత్తగల మోటర్‌సైకిల్! పేరు ఊనోబోల్ట్. బోలెడన్ని విశేషాలున్నాయి దీంట్లో. అన్నింటి కంటే ముందుగా చెప్పుకోవాల్సింది దీని ఒంటి కాలి గురించి! సర్కస్‌లో ఒంటిచక్రం సైకిళ్లను పోలినప్పటికీ పడిపోకుండా దీనిని నడపాలంటే మనం పెద్దగా కష్టపడనవసరం లేదు. దీంట్లో ఉండే జైరోస్కోపులు.. సెన్సర్లు ఎప్పటికప్పుడు మోటార్‌సైకిల్ ఎలా ఉందన్న విషయాన్ని గమనిస్తూ.. బరువును అటుఇటూ మారుస్తూ నిలకడగా, నిటారుగా ఉంచుతాయి. రెండో విశేషం.. మీరు అనుకుంటున్నట్లే.. ఇది పూర్తిగా విద్యుత్‌తో మాత్రమే పనిచేసే మోటార్‌సైకిల్. ఒకసారి చార్జ్ చేస్తే 4.4 ఆంపియర్ అవర్స్ బ్యాటరీ సాయంతో దాదాపు 40 కిలోమీటర్ల దూరం వరకూ వెళ్లవచ్చు. ఛార్జ్ చేసేందుకు పట్టే సమయం దాదాపు 45 నిమిషాలు మాత్రమే. అరవై వోల్టుల, వెయ్యి వాట్ల విద్యుత్ మోటర్ చక్రం మధ్యలోనే ఉంటుంది. కేవలం ఇరవై కేజీల బరువు మాత్రమే ఉన్నప్పటికీ దీనిపై దాదాపు 127 కిలోల బరువున్న వాళ్లు సులువుగా ప్రయాణించవచ్చు. కొన్నేళ్ల క్రితం వచ్చిన సెగ్వే పర్సనల్ ట్రాన్స్‌పోర్ట్ వాహనం మాదిరిగానే దీంట్లో ప్రత్యేకంగా యాక్సలరేటర్ లాంటిదేమీ ఉండదు. హ్యాండిల్ బార్‌ను పట్టుకుని మనం కాస్త ముందుకు వాలితే చాలు ముందుకు కదులుతుంది. వెనక్కు వాలితే నెమ్మదిస్తుంది. బ్రేకును నొక్కితే ఆగిపోతుంది. పక్కలకు తిరగాలంటే.. ఆ వైపునకు కొంచెం వాలితే సరిపోతుంది. ఇంకో విషయం.. ఈ మోటార్‌సైకిల్‌లో రివర్స్ గేర్ కూడా ఉందండోయ్! ఊనోబోల్ట్ పేరుతోనే కంపెనీ ఏర్పాటు చేసిన కొంతమంది ఔత్సాహికవేత్తలు ప్రస్తుతం ఈ ఒంటికాలి మోటార్‌సైకిల్‌ను వాణిజ్యస్థాయిలో ఉత్పత్తి చేసేందుకు కిక్‌స్టార్టర్ వెబ్‌సైట్ ద్వారా నిధులు సేకరిస్తున్నారు. ప్రచారం మొదలుపెట్టి కొన్ని రోజులు కూడా కాలేదుగానీ.. ఇప్పటికే వారు లక్ష్యానికి మించి డబ్బులు సేకరించగలిగారు. అన్నీ సవ్యంగా సాగితే.. ఈ ఏడాది డిసెంబర్‌కల్లా ఊనోబోల్ట్‌లు రోడ్లపైకి వస్తాయని అంటున్నారు ఈ ఇటలీ కంపెనీ సీఈవో సీన్ ఖాన్! **- సాక్షి నాలెడ్జ్ సెంటర్**

భర్తీ లేదా.. బ్రదర్!



▶ మొదటి పేజీ తరువాయి

ఈ పరిస్థితికి కారణమని విమర్శలు వస్తున్నాయి.

గ్రూప్-2కు వైట్‌నర్ దెబ్బ

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 1,032 గ్రూప్-2 పోస్టుల భర్తీకి 2015 డిసెంబర్, 2016 మార్చిలో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ పోస్టులకు 7,89,437 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2016 నవంబర్ 11, 13 తేదీల్లో రాతపరీక్షలు నిర్వహించగా.. 4,97,961 మంది హాజరయ్యారు. అయితే పరీక్ష నిర్వహణ సమయంలో దాదాపు 50 వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ జవాబు పత్రాలు మారిపోయాయి. కాసేపటికి ఈ తప్పును గుర్తించిన పరీక్షల సిబ్బంది.. ఎవరి జవాబు పత్రాలను వారికి ఇచ్చారు. అయితే అప్పటికే నష్టం జరిగిపోయింది. కొందరు అభ్యర్థులు ఓఎంఆర్ జవాబు పత్రాల్లో తమ వివరాలను రాసేశారు. మరికొందరు జవాబులు కూడా రాశారు (బబ్లింగ్ చేశారు). దీంతో పరీక్షల సిబ్బంది వైట్‌నర్ పెట్టి పరీక్ష రాయాలని సూచించగా.. అభ్యర్థులు అలాగే రాశారు. వాస్తవానికి టీఎస్‌పీఎస్సీ నిబంధనలు, గ్రూప్-2 నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం.. వైట్‌నర్ ఉపయోగిస్తే ఆ జవాబు పత్రాలను మూల్యాంకనం చేయరు. ఈ నిబంధన తెలిసిన కొందరు అభ్యర్థులు పరీక్షల సిబ్బంది తప్పిదం కారణంగా వైట్‌నర్ ఉపయోగించామని, తమను పరిగణనలోకి తీసుకోవాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. అయితే నిబంధనల ప్రకారం అది వీలుకాదని టీఎస్‌పీఎస్సీ కోర్టుకు వివరించింది. కోర్టు కూడా అభ్యర్థుల వాదనను తోసిపుచ్చింది. కానీ ఆ తర్వాత టీఎస్‌పీఎస్సీ మాట మార్చింది. అంతర్గత పరిశీలనలో 50 వేల మందికిపైగా అభ్యర్థులు వైట్‌నర్ ఉపయోగించినట్లు గుర్తించింది. ఓ కమిటీ వేసి.. ఆ కమిటీ సిఫారసు అంటూ వైట్‌నర్ ఉపయోగించిన వారిని కూడా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఎంపిక చేసింది. దీంతో మిగతా నిరుద్యోగులు కోర్టును ఆశ్రయించగా.. పోస్టుల భర్తీ ప్రక్రియ ఆగిపోయింది.

టెట్‌కు నిబంధనల కష్టం

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో విపరీత నిబంధనల కారణంగా లక్షమంది వరకు అభ్యర్థులు పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. 2010లో అమల్లోకి వచ్చిన ఎన్‌సీటీఈ మార్గదర్శకాల ప్రకారం ఇంటర్, డిగ్రీలలో 50 శాతం మార్కులుండి, ఉపాధ్యాయ విద్యా కోర్సులు పూర్తి చేసిన వారు టెట్ రాసేందుకు అర్హులు. అయితే ఈ నిబంధనలు అమల్లోకి వచ్చే నాటి కంటే ముందే ఇంటర్, డిగ్రీ పూర్తిచేసుకున్న వారికి మాత్రం 45 శాతం మార్కులు వచ్చినా అర్హులేననే మినహాయింపు ఉంది. కానీ విద్యా శాఖ మొత్తంగా 50 శాతం మార్కుల నిబంధనను అమలు చేయడంతో.. వేలాది మంది టెట్ రాసే అవకాశం కోల్పోయారు. ఇక డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్) పూర్తిచేసి, తర్వాత డిగ్రీ (డీఎడ్+డిగ్రీ) చేసిన వారు టెట్ పేపర్-2 రాసేందుకు అర్హులని ఎన్‌సీటీఈ మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో నాలుగు సార్లు నిర్వహించిన టెట్‌లలోనూ వారికి అవకాశం కల్పించారు. కానీ టెట్-2017లో విద్యా శాఖ వారికి అవకాశం కల్పించకపోవడంతో చాలా మంది అభ్యర్థులు నష్టపోయారు. ఇక విద్యా హక్కు చట్టం ప్రకారం.. ప్రైవేటు పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకూ టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. కానీ ఇంటర్, డిగ్రీల్లో 50 శాతం మార్కులు లేవంటూ టెట్‌కు దూరం చేయడంతో... చాలా మంది అభ్యర్థులు ప్రైవేటు స్కూళ్లలో పనిచేసుకునే అవకాశాన్ని పోగొట్టుకున్నారు.

గురుకుల పోస్టులకు 'అర్హత'గండం

దాదాపు 2.5 లక్షల మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న గురుకుల పోస్టుల భర్తీ కూడా గందరగోళంగా మారింది. గురుకుల స్కూళ్లలో ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ), పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) తదితర 7,306 పోస్టుల భర్తీకి గతేడాది ఫిబ్రవరిలో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో పీజీటీ, టీజీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే.. డిగ్రీ, పీజీలలో 60 శాతం మార్కులు సాధించి ఉండాలని సంక్షేమ శాఖలు నిబంధనలు విధించాయి. వాస్తవానికి ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం... ఈ పోస్టులకు 2010 ఆగస్టు తర్వాత డిగ్రీ, పీజీలు పూర్తి చేసుకున్న వారికి 50 శాతం మార్కులు.. అంతకుముందు ఉత్తీర్ణులైన వారికి 45 శాతం మార్కులు ఉంటే చాలు. కానీ సంక్షేమ శాఖలు 60 శాతం మార్కుల నిబంధన విధించడంపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. దీంతో సీఎం కేసీఆర్ స్వయంగా కల్పించుకుని ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేయించారు. ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారమే అర్హత నిర్ణయించాలని ఆదేశించారు. అయినా పరిస్థితి మారలేదు. విద్యార్హతలను ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారమే నిర్ణయించినా.. రిజర్వేషన్ విషయంలో తప్పిదం చేశారు. అత్యధిక పోస్టులను మహిళా అభ్యర్థులకు కేటాయించారు. జూన్ 1న 2,437 పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌లోనూ ఇదే తరహాలో వ్యవహరించారు. మహిళా కాలేజీల్లో పోస్టులను మహిళలతోనే భర్తీ చేయాలన్న నిబంధన ఎక్కడా లేకున్నా... డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పోస్టులను 100 శాతం మహిళా అభ్యర్థులకే రిజర్వు చేశారు. దీనిపై అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో.. ఈ పరీక్షలు కూడా ఆగిపోయాయి.

వైద్యపోస్టుల భర్తీలో దిద్దుబాట

వైద్యారోగ్య శాఖ పరిధిలో 2,118 పోస్టుల భర్తీ ప్రక్రియ అంతులేకుండా సాగుతూనే ఉంది. ఈ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం గతేడాది జూలై 13న అనుమతి ఇచ్చింది. టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో పోస్టులు భర్తీ చేయాలని.. అర్హతలు, నిబంధనలను వైద్య శాఖ రూపొందించాలని పేర్కొంది. దీనిపై వైద్యారోగ్య శాఖ దాదాపు ఏడాది పాటు జాప్యం చేసింది. చివరికి ఈ ఏడాది మేలో మార్గదర్శకాలను విడుదల చేసింది. కానీ వాటిలో స్పష్టత లేకపోవడంతో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయలేదు. స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలంటూ పలుసార్లు వైద్య శాఖకు సూచించింది. జూలై 5న టీఎస్‌పీఎస్సీ, ప్రభుత్వానికి లేఖలు సైతం రాసింది. ట్యూటర్ పోస్టుల భర్తీలో భారత వైద్య మండలి నిబంధనలు, రిజర్వేషన్ల వర్తింపు అంశాలపై స్పష్టత కోరింది. వైద్యవిద్య డైరెక్టరేట్ పరిధిలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, లెక్చరర్, రేడియోలాజికల్, ఫిజిక్స్, ఫిజిసిస్ట్ పోస్టులకు... వైద్య విధాన పరిషత్ పరిధిలోని సివిల్ అసిస్టెంట్ సర్జన్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీలో పాటించే నిబంధనలపై స్పష్టత కోరింది. దీంతో చివరికి వైద్యారోగ్య శాఖ స్పందించి ఎంసీఐ మార్గదర్శకాల ప్రకారం పలు అంశాలపై స్పష్టతనిస్తూ మంగళవారమే టీఎస్‌పీఎస్సీకి, ప్రభుత్వానికి వివరాలు పంపింది. ఇప్పటికైనా భర్తీ ప్రక్రియ ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలని అభ్యర్థులు కోరుతున్నారు.


పరశురాములుకు తొలి 'పాయింట్'

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించి తొలి పాయింట్‌ను నల్లకుంట పోలీసులు విధించారు. మంగళవారం ఉదయం 10.49 గంటల ప్రాంతంలో హెల్మెట్ లేకుండా టీఎస్07ఎఫ్‌డీ3298 రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన వాహనంపై వస్తున్న ద్విచక్ర వాహనచోదకుడు పరశురాములును సబ్-ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ నల్లకుంట ప్రాంతంలో ఆపారు. ఆయనకు చలాన్ జారీ చేయడంతో పాటు ఒక పెనాల్టీ పాయింట్ విధించారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకు సిటీ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 1,324 మంది వాహన చోదకులకు 1,493 పెనాల్టీ పాయింట్లు విధించారు. కనిష్టంగా 1 నుంచి గరిష్టంగా 4 వరకు ఈ పాయింట్లు పడ్డాయి. వీటిలో అత్యధికంగా ద్విచక్ర వాహన చోదకులకు, హెల్మెట్ ధరించని ఉల్లంఘనపై విధించారు. సాంకేతిక కారణాల నేపథ్యంలో రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో మధ్యాహ్నం, సైబరాబాద్‌లో సాయంత్రం పాయింట్ల విధింపు ప్రక్రియ ప్రారంభమైంది. మూడు కమిషనరేట్లలోనూ క్షేత్రస్థాయిలో ఉండే అధికారులు తమ వద్ద ఉన్న పీడీఏ మిషన్ల ద్వారా పెనాల్టీ పాయింట్లను వాహనచోదకుడి డ్రైవింగ్ లైసెన్స్ నంబర్ ఆధారంగా నమోదు చేశారు. తొలి పాయింట్ పడిన నాటి నుంచి 24 నెలల్లో 12 పాయింట్లు వస్తే సదరు వాహనచోదకుడి డ్రైవింగ్ లైసెన్స్ ఏడాది పాటు సస్పెండ్ అవుతుంది.



మంగళవారం నాంపల్లి వద్ద ఓ వాహనదారుడికి విధించిన పాయింట్‌ను చూపుతున్న దృశ్యం



ఓ వాహనంపై ఒకే కేసు నమోదు చేసినా.. ఉల్లంఘనను బట్టి ఒకటి కంటే ఎక్కువ పాయింట్లు విధించే ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో కేసుల సంఖ్య కంటే పాయింట్ల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

బాలునికి అస్వస్థత.. విమానం వెనక్కి

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన విమానంలో ప్రయాణిస్తున్న ఓ బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆ విమానాన్ని అత్యవసరంగా వెనక్కి మళ్లించారు. స్పైస్ జెట్ విమానం విశాఖ నుంచి మంగళవారం రాత్రి 8.40 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరింది. కొద్దిసేపటికే విమానంలో ప్రయాణిస్తున్న ఎనిమిదేళ్ల బాలుడు తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. ఊపిరందక విలవిల్లాడిపోయాడు. బాలుడి తల్లి ఆందోళనకు గురికావడంతో విమానాన్ని తిరిగి విశాఖకు తీసుకొచ్చారు. ఈలోగా విమానాశ్రయంలో అప్రమత్తమైన వైద్య బృందాలు బాలుడికి ప్రాథమిక వైద్యమందించాయి. ఆస్తమా కారణంగా బాలుడు ఇబ్బంది పడినట్టు వైద్యులు తేల్చారు. దీంతో తల్లీకొడుకులు ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. దీంతో విమానం విశాఖ నుంచి రాత్రి 10.15 గంటలకు తిరిగి బయల్దేరింది.

ప్రొఫెసర్ పీఎం భార్గవ కన్నుమూత

- తీవ్ర అనారోగ్యంతో స్వగృహంలో తుదిశ్వాస
- సీసీఎంబీ వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఎనలేని సేవలు
- భార్గవ మృతికి శాస్త్రవేత్తలు, ప్రముఖుల సంతాపం
- రేపు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు



పీఎం భార్గవ పార్థివదేహం



రాజీవ్‌గాంధీతో భార్గవ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: ప్రఖ్యాత శాస్త్రవేత్త, సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ) వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్పమిత్ర భార్గవ (89) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. వయోభారం, తీవ్ర అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం 5.45 గంటలకు ఉప్పల్ ప్రశాంత్‌నగర్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన కొడుకు మోహిత్ భార్గవ కెనడాలో ఉంటున్నారు. కూతురు వినీత గుంటూరులో ఒక స్వచ్ఛంద సంస్థలో పని చేస్తున్నారు. కొడుకు మోహిత్ వచ్చిన తర్వాత 3న జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో భార్గవ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు శాస్త్రవేత్తలు, ప్రముఖులు సంతాపం తెలిపారు. సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా, మాజీ డైరెక్టర్లు మోహన్‌రావు, లాల్జీసింగ్, సీనియర్ సైంటిస్టులు శివాజీ, జ్యోత్స్న ధావన్, ఇమ్రాన్ సిద్ధిఖీ ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జ్యోతిష్య శాస్త్రం కోర్సుపై సుప్రీంకు: ఆధునిక జీవశాస్త్రానికి ఆర్కిటెక్ట్‌గా ప్రశంసలందుకున్న భార్గవ.. సీసీఎంబీ వ్యవస్థాపక డైరెక్టర్‌గా 13 ఏళ్ల పాటు విశేష సేవలందించారు. 2006లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం 220 విశ్వవిద్యాలయాల్లో జ్యోతిష్య శాస్త్రాన్ని కోర్సుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేసినప్పుడు నిర్ద్వంద్వంగా వ్యతిరేకించి సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు, సైన్స్ టెంపర్ పెంచేందుకు 500కు పైగా వ్యాసాలు రాశారు. నేషనల్ నాలెడ్జ్ సెంటర్ వైస్ చైర్మన్‌గా పని చేశారు.

చేప మందుకు వ్యతిరేకంగా..

హైదరాబాద్‌లో బత్తిన సోదరులు పంపిణీ చేసే చేప మందు శాస్త్రీయతను సవాల్ చేస్తూ 2008 నుంచి జన విజ్ఞాన వేదిక చేపట్టిన అన్ని ఆందోళన కార్యక్రమాల్లో భార్గవ పాల్గొన్నారు. హైకోర్టుకు వెళ్లారు. చివరకు దాన్ని చేప మందుగా పరిగణించరాదని, చేప ప్రసాదంగానే భావించాలని కోర్టు పేర్కొంది. చేప మందే కాకుండా హోమియో వైద్యమూ మూఢ నమ్మకమేనని భార్గవ కొట్టిపారేశారు. శాస్త్రవేత్తగా ఆయన కృషికి 1986లో ప్రభుత్వం పద్మభూషణ్‌తో సత్కరించింది. కానీ గతేడాది దేశవ్యాప్తంగా రచయితలు, మేధావి వర్గంపై జరిగిన దాడులు, అసహనానికి వ్యతిరేకంగా అవార్డు తిరిగిచ్చేశారు.

'హెడిల్‌బర్గర్' వ్యవస్థాపకుల్లో ఒకరు..

1928 ఫిబ్రవరి 22న రాజస్తాన్‌లోని అజ్మీర్‌లో భార్గవ జన్మించారు. ఆయన తండ్రి రామచంద్ర భార్గవ, తల్లి గాయత్రీ భార్గవ. వారణాసి బీసెంట్ థియోసాఫికల్ స్కూల్‌లో ప్రాథమిక విద్య అభ్యసించిన భార్గవ.. లక్నో విశ్వవిద్యాలయం నుంచి 1946లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ పట్టా పొందారు. 21వ ఏటనే సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ అంశంపై పీహెచ్‌డీ పరి శోధన చేశారు. 1950 నుంచి 1953 వరకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)లో, అదే సమయంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగంలో లెక్చరర్‌గా విధులు నిర్వహించారు. 1953 నుంచి 1956 వరకు అమెరికాలోని విస్కాన్సన్ వర్సిటీలో పని చేశారు. అక్కడే హెడిల్‌బర్గర్ లేబొరేటరీ వ్యవస్థాపకుల్లో ఒకరుగా నిలిచారు.

వైఎస్ జగన్ సంతాపం

సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ మాజీ అధిపతి, ప్రముఖ శాస్త్రవేత్త పి.ఎం. భార్గవ మృతికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సంతాపాన్ని తెలియజేశారు. విజ్ఞానశాస్త్ర రంగంలో భార్గవ చేసిన సేవలను వైఎస్ జగన్ కొనియాడుతూ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.


జాంబీ ఎనర్జీ.. ఇంకెన్నాళ్లు!

బ్రస్సెల్స్‌కు హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అలయెన్స్(హీల్) అనే స్వచ్ఛంద సంస్థ ఇటీవల విడుదల చేసిన నివేదికలో వెల్లడించిన అంశాలివీ. ప్రభుత్వ సబ్సిడీల వల్ల ప్రజారోగ్యానికి జరుగుతున్న నష్టం గురించి ఈ నివేదిక విశ్లేషించింది. శిలాజ ఇంధనాల ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్‌నే పరిశోధకులు 'జాంబీ ఎనర్జీ' అంటుంటారు. కోల్, ఆయిల్, గ్యాస్ పరిశ్రమలకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలతో ప్రజారోగ్యానికి నష్టం కలుగుతుండటమే దీనికి కారణం. 2012లో ఇండోర్, అవుట్‌డోర్ ఎయిర్ పొల్యూషన్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా సంభవించిన మరణాల సంఖ్య 65 లక్షలు. మొత్తం మరణాల్లో ఇది 11.6 శాతం. *- సాక్షి, తెలంగాణ డెస్క్*

రూ. 1.08 లక్షల కోట్లు శిలాజ ఇంధనాల విద్యుత్ ఉత్పత్తికి ఏటా సబ్సిడీలు

రూ. 9.02 లక్షల కోట్లు ఉద్గారాల వల్ల ప్రజారోగ్యానికి కలుగుతున్న నష్టం

64.5% సబ్సిడీలు రద్దు చేస్తే వాయు కాలుష్య అకాల మరణాల్లో తగ్గుదల



సబ్సిడీల ఎత్తివేతపై స్పష్టత లేదు..

2014లో జీ20 దేశాలు శిలాజ ఇంధన కంపెనీలకు సబ్సిడీల కోసం వెచ్చించిన మొత్తం రూ.28.47 లక్షల కోట్లు. ఇదే సమయంలో శిలాజ ఇంధనాల వల్ల తలెత్తుతున్న ఆరోగ్య ఖర్చులు రూ.176.93 లక్షల కోట్లు. సబ్సిడీలకు ఇది ఆరు రెట్లు ఎక్కువ. వాయు కాలుష్యం వల్ల జీ20 దేశాల్లో సంభవిస్తున్న అకాల మరణాలు 32 లక్షలకు పైనే. 2009లో జీ20 దేశాలు శిలాజ ఇంధన సబ్సిడీలను దశలవారీగా తగ్గిస్తామని ప్రకటించాయి. 2016 నాటికి అంటే ఏడేళ్ల తర్వాత కూడా దశలవారీగా సబ్సిడీల ఎత్తివేతపై స్పష్టత రాలేదు. ఇప్పటికీ జీ20 దేశాలు 2013–2015 మధ్య ఏటా రూ.4.60 లక్షల కోట్లను సబ్సిడీలుగా చెల్లిస్తున్నాయి.

75 శాతం విద్యుత్ బొగ్గు నుంచే..

2014 నాటికి 75 శాతం దేశ విద్యుత్ అవసరాలను తీర్చేది థర్మల్ పవర్ ప్లాంట్లే. 2016 నాటికి ప్రపంచంలో రెండో అతి పెద్ద థర్మల్ పవర్ ఉత్పత్తిదారు, వినియోగదారు భారతే. ఈ విషయంలో చైనా మొదటి స్థానంలో ఉంది. బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల వల్ల వెలువడే ఉద్గారాల్లో నలుసు పదార్థం(పర్టిక్యులేట్ మ్యాటర్–పీఎం), సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్ కీలకం. తలవెంట్రుక కంటే 30 రెట్లు చిన్నగా ఉండే నలుసు పదార్థం(పీఎం 2.5) పీల్చడం వల్ల శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయి. 2015లో పీఎం 2.5 వల్లే భారత్, చైనాలో 50% మరణాలు సంభవించాయి. చైనాలో 11,08,100 మంది పీఎం 2.5 వల్ల మృత్యువాత పడ్డారు.

- 2013-2014లో శిలాజ ఇంధనాల (ఫాసిల్ ఫ్యూయెల్స్) ద్వారా విద్యుత్ ఉత్పత్తి కోసం భారతదేశం సబ్సిడీగా చెల్లించిన మొత్తం రూ. 1.08 లక్షల కోట్లు/ఒక ఏడాదికి.
- ఇదే సమయంలో శిలాజ ఇంధనాలను కరిగించడం వల్ల ఆరోగ్య పరంగా ఏటా జరుగుతున్న నష్టం రూ. 9.02 లక్షల కోట్లు. సబ్సిడీల కంటే ఇది 8 రెట్లు ఎక్కువ.
- రూ.1.08 లక్షల కోట్లతో 37.5 కోట్ల గృహాలకు సోలార్ బల్బులను ఇవ్వవచ్చు. 32 వేల మంది వైద్యులకు ఎయిమ్స్‌లో శిక్షణ ఇవ్వవచ్చు. శిలాజ ఇంధన సబ్సిడీలను రద్దు చేసి.. ఆయిల్, బొగ్గు, గ్యాస్‌పై పన్నులను సవరిస్తే.. వాయు కాలుష్యం వల్ల ఏటా సంభవిస్తున్న 14 లక్షల అకాల మరణాల్లో 64.5 శాతాన్ని తగ్గించవచ్చట.

కెనడాలో హైదరాబాద్ వాసి మృతి



సాజిద్ (ఫైల్)

హైదరాబాద్: కెనడాలోని ఓ జలపాతం వద్ద సరదాగా గడుపుతున్న ఓ కుటుంబంలోని వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. నగరంలోని అంబర్‌పేటకు చెందిన మహమ్మద్ జబ్బార్ కుమారుడు మహమ్మద్ ఖదీర్ అలియాస్ సాజిద్ (33) ఐదేళ్ల క్రితం ఉద్యోగ రీత్యా కెనడా వెళ్లి స్థిరపడ్డాడు. సాజిద్‌కు ఇటీవల బాబు జన్మించడంతో అతని తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు కెనడా వెళ్లారు. గత నెల 29న సాయంత్రం కెనడాలోని కననాస్కిస్ నగరంలో ఉన్న ఎల్బో జలపాతం వద్ద కుటుంబం మొత్తం సరదాగా గడుపుతున్నారు. ఆ సమయంలో కుటుంబంలోని ఓ వ్యక్తి జలపాతంలోకి జారి పడబోతుండగా, అతన్ని కాపాడే ప్రయత్నంలో సాజిద్ పడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని వెలికితీశారు. కుటుంబం మొత్తం అక్కడే ఉండటంతో మంగళవారం కెనడాలోనే మృతదేహాన్ని ఖననం చేసినట్లు అంబర్‌పేటకు చెందిన సాజిద్ చిన్ననాటి స్నేహితుడు ఫీర్‌జాబేర్ మున్నీర్ తెలిపారు.

రైల్వే భూమి బదలాయింపు వేగిరం చేయండి

కేంద్ర మంత్రి సురేశ్ ప్రభును కోరిన దత్తాత్రేయ, టీఆర్‌ఎస్ నేతలు

- వెంటనే దక్షిణ మధ్య రైల్వే జీఎంతో మాట్లాడిన ప్రభు
- త్వరితగతిన రైల్వే భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశం




మంగళవారం కేంద్రమంత్రి సురేశ్ ప్రభును కలసిన దత్తాత్రేయ, మంత్రి పద్మారావు. చిత్రంలో మల్లారెడ్డి, కవిత, వినోద్‌కుమార్, రాంచంద్రు, సీతారాం నాయక్, విశ్వేశ్వరరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: సికింద్రాబాద్ పరిధిలోని లాలాపేట్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి అవసరమైన 12.6 ఎకరాల రైల్వే భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాల్సిన ప్రక్రియను వేగవంతం చేయాలని రైల్వే మంత్రి సురేశ్ ప్రభును కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, టీఆర్‌ఎస్ నేతలు కోరారు. రాష్ట్ర మంత్రి పద్మారావు, టీఆర్‌ఎస్ ఎంపీలు వినోద్‌కుమార్, కొండా విశ్వేశ్వరరెడ్డి, కె.కవిత, సీతారాంనాయక్, మల్లారెడ్డి తదితరులు మంగళవారం ప్రభును పార్లమెంటులో కలిశారు. ఈ సందర్భంగా భూమి బదలాయింపు ప్రక్రియ పురోగతిపై చర్చించారు. గతంలో సికింద్రాబాద్ పరిధిలో రైల్వే భూమిని బదలాయించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన విజ్ఞప్తిపై సురేశ్ ప్రభు సానుకూలంగా స్పందించారు. అయితే భూమి బదలాయింపు ప్రక్రియలో ప్రతిష్టంభన నెలకొంది. ఈ నేపథ్యంలో సంబంధిత ప్రాంతంలో పేదలకు 4 వేల వరకు ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ప్రభుకు టీఆర్‌ఎస్ నేతలు వివరించారు. రైల్వే భూమికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం మరోచోట భూమి ఇచ్చేందుకు, లేదా డబ్బు చెల్లించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. స్పందించిన ప్రభు.. దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్‌తో ఫోన్‌లో మాట్లాడి భూమి బదలాయింపు ప్రక్రియకు సంబంధించిన నివేదికను త్వరితగతిన తయారు చేయాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా రైల్వే భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి అప్ప గించాలని సూచించారు. దీనిపై టీఆర్‌ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశం సందర్భంగా ఎంపీలు తమ నియోజకవర్గాల్లోని రైల్వే సమస్యలను ప్రభు దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే జీఎం అధ్యక్షతన ఎంపీలు హైదరాబాద్‌లో సమావేశం కానున్నారు.

గెజిట్ నోటిఫికేషన్లను కోర్టు ముందుంచండి

భూసేకరణ చట్టం సవరణలపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కేంద్ర భూసేకరణ చట్టం 2013కు సవరణలు చేస్తూ తెలంగాణ రాష్ట్ర భూసేకరణ నిబంధనలను తీసుకొచ్చే ముందు గెజిట్‌లో ముసాయిదా నిబంధనలను ప్రచురించారో లేదో తెలియచేయాలని హైకోర్టు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ విషయంలో స్పష్టత కోసం గెజిట్ నోటిఫికేషన్లను తమ ముందుంచాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. విచారణను ఆగస్టు 8కి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్‌రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిల ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర భూసేకరణ చట్ట నిబంధనల తుది నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

అభ్యంతరాలు స్వీకరించలేదు...

పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. చట్ట ప్రకారం ముందు ముసాయిదా నిబంధనలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, వారి అభ్యంతరాలను తెలుసుకున్న తర్వాతనే తుదిరూపు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ అభ్యంతరాలు స్వీకరించకుండానే ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చేసిందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం... భూ సేకరణపై అభ్యంతరాలు పెండింగ్‌లో ఉండగా జిల్లా కలెక్టర్ ఆయా భూముల యజమానులతో సేకరణకు ఒప్పందం కుదుర్చుకోవచ్చా.. లేదా.. అన్న విషయంపై లోతుగా విచారణ జరుపుతామని తెలిపింది. విచారణను ఆగస్టు 17కి వాయిదా వేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో నిర్మించతలపెట్టిన కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ కోసం సిద్దిపేట జిల్లా తానేదార్‌పల్లి, తానేదార్‌పల్లి తాండా, మామిడ్యాల, భైలాంపూర్ గ్రామాల్లో రైతుల అభ్యంతరాలను పట్టించుకోకుండా భూసేకరణ చేయడంపై మామిడ్యాలకి చెందిన టి.శ్రీనివాస్ మరో ఐదుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఎయిర్‌పోర్టులో డ్రగ్స్ పట్టివేత..!

శంషాబాద్ (రాజేంద్రనగర్): ఓ వైపు డ్రగ్స్ కేసు దర్యాప్తు జరుగుతున్న తరుణంలో ముంబై నుంచి హైదరాబాద్‌కు మాదకద్రవ్యాలు తీసుకొస్తూ దక్షిణాఫ్రికాకు చెందిన అలెక్స్ విక్టర్ అనే వ్యక్తి పట్టుబడినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం అలెక్స్ నుంచి పది గ్రాముల కొకైన్‌తో పాటు ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అలెక్స్ ప్రస్తుతం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. కేసు దర్యాప్తు చేస్తుండటంతో విమానాశ్రయ అధికారులు ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు.

సాక్షి
బుధవారం, ఆగస్టు, 2


ఆరోగ్యశ్రీ చుట్టూ ఆంక్షలు

ఆపత్కాలంలో అమ్మ గుర్తుకొచ్చినట్టే తెలుగు రాష్ట్రాల్లో జబ్బుపడ్డ నిరుపేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీ స్ఫురణకొస్తుంది. పదేళ్లక్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ పథకం ప్రారంభించినప్పుడు అందుకవసరమైన నిధులెలా అని సంశయించలేదు. జనావసరాలనే చూశారు తప్ప ఖజానా గురించి ఆలోచించలేదు. నిరుపేద రోగులను ఆపత్కాలంలో ఆదుకునేందుకు, వారికి కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు రూపొందించిన ఈ పథకం లక్షలాది కుటుంబాలకు వరమైంది. ప్రాణాంతక వ్యాధుల బారిన పడిన నిరుపేదలకు పైసా ఖర్చు లేకుండా ఖరీదైన కార్పొరేట్ వైద్యం అందుబాటులోకొచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకొచ్చాక మిగిలిన ప్రజోపయోగ పథకాలను నీరుగార్చిన తరహాలోనే ఆరోగ్యశ్రీని కూడా అటకెక్కించే ప్రయత్నం మొదలుపెట్టింది. హైదరాబాద్‌లో వైద్య సేవలు పొందాలనుకునే రోగులకు ఆరోగ్యశ్రీ వర్తించబోదంటూ ఇటీవల తీసుకున్న నిర్ణయమే అందుకు తాజా ఉదాహరణ. ఒక్క కేన్సర్ చికిత్సకు మాత్రం దీన్నుంచి మినహాయింపునిచ్చారు. టీడీపీ ఏలుబడి మొదలయ్యాక ఈ పథకానికి అప్పటివరకూ ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరును ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీగా మార్చారు. పేరు ఏదైనా పథకం అమలైతే అదే పదివేలని అందరూ అనుకుంటున్న తరుణంలో తనకలవాటైన రీతిలో ఆ పథకానికి బాబు తూట్లు పొడుస్తున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయాక ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కొరత బాగా ఉంది. ముఖ్యంగా వైద్య రంగంలో అది మరీ ఎక్కువ. ప్రభుత్వాసుపత్రుల్లో లభించే సేవలు అంతంతమాత్రం. రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ పడకేసిందని సాక్షాత్తూ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) వారం రోజులక్రితం దుయ్యబట్టింది. ప్రభుత్వాసుపత్రులు మొదలుకొని ఉప ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల వరకూ ఎక్కడా రోగులకు మెరుగైన సేవలు లభించడం లేదని కాగ్ గణాంకాలతో సహా వెల్లడించింది. జాతీయ హెల్త్ మిషన్ కింద కేంద్రం నుంచి గ్రాంటుగా అందుతున్న నిధుల్లో సగం కూడా రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేయలేకపోయిందని తెలిపింది. జాతీయ గ్రామీణ హెల్త్ మిషన్ నిధులను దారి మళ్లించిందని స్పష్టం చేసింది. ఇన్ని పోకడలకు పోతూ, ప్రజారోగ్య వ్యవస్థను భ్రష్టు పట్టించిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో చికిత్స చేయించుకుంటే తప్ప ఆరోగ్యశ్రీ పథకం వర్తించబోదంటూ చెప్పడం ఎంత దుస్సాహసం? అవసరమైన కేటాయింపులు లేకపోవడం, చేసిన కేటాయింపుల్లో అధికభాగం పాత బకాయిలకిందకు జమ కావడం తదితర కారణాలవల్ల ఆరోగ్యశ్రీ అసలే అంతంతమాత్రంగా నడుస్తోంది. ఇప్పుడీ నిబంధన పర్యవసానంగా అది పేద ప్రజలకు మరింత దూరమవుతుంది. వ్యాధికి ఎక్కడ చికిత్స తీసుకోవాలో నిర్ణయించుకునే ముందు రోగులు అనేక విధాల ఆలోచిస్తారు. ఆసుపత్రిలో ఉండే సౌకర్యాలనూ, అక్కడ చికిత్సనందించే వైద్యుల గురించి వాకబు చేస్తారు. సురక్షితమైన, మెరుగైన వైద్యం లభిస్తుందన్న విశ్వాసం ఏర్పడిన ఆసుపత్రిలోనే చేరతారు. పైగా రాష్ట్ర విభజన జరిగినప్పుడు పదేళ్లపాటు హైదరాబాద్‌ను రాజధానిగా ఉపయోగించుకోవచ్చునని హామీ ఇచ్చారు. 'ఓటుకు కోట్లు' కేసు తాకిడితో అర్థాంతరంగా చంద్రబాబు ప్రభుత్వ విభాగాలనైతే తరలించుకున్నారు. కానీ మంచి వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండేలా చూడగలిగారా? పైగా విభజన జరిగి మూడేళ్లు దాటుతున్నా ఉపాధి కోసం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చాలామంది ఇప్పటికీ హైదరాబాద్ చుట్టుపక్కల ఉంటున్నారు. స్వస్థలాల్లో ఉండే తమవారిని హైదరాబాద్ రప్పించుకుని తగిన చికిత్స ఇప్పించాలని ఆశించేవారికి తాజా నిబంధన ప్రతిబంధకంగా మారుతుంది.

పేద జనం అన్నా, వారి ప్రాణాలన్నా ఉండే నిర్లక్ష్యం నుంచే ఇలాంటి ఆలోచనలు పుట్టుకొస్తాయి. వైఎస్ ఈ పథకం ప్రారంభించినప్పుడు దీని పరిధిలోకొచ్చే వ్యాధుల సంఖ్య 135 వరకూ ఉండేది. ప్రజల ఆరోగ్యావసరాలను ఎప్పటికప్పుడు పరిగణనలోకి తీసుకుని ఈ పథకాన్ని ఆయన విస్తృతపరుచుకుంటూ వెళ్లారు. ఫలితంగా ఈ పథకం కింద అర్హమైన చికిత్సల సంఖ్య దాదాపు వేయికి చేరుకుంది. ఆయన కనుమరుగయ్యాక వచ్చిన ప్రభుత్వాలు దీనికి గ్రహణం పట్టించడం మొదలుపెట్టాయి. దాని పరిధిలో ఉన్న జబ్బులను కూడా కుదించడం ప్రారంభించాయి. కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక 133 రకాల జబ్బులకు ప్రభుత్వాసుపత్రుల్లో మాత్రమే చికిత్స చేయించుకోవాలన్న నిబంధన విధించారు. బధిర, మూగ లోపాలున్న పిల్లలకు జరిపే కాక్లియర్ ఇంప్లాంటు చికిత్సకున్న వయో పరిమితిని తగ్గించారు. వైఎస్ ప్రభుత్వం మొదట్లో ఉన్న వయో పరిమితి ఆరేళ్లను 12 సంవత్సరాలకు మారిస్తే... కిరణ్ సర్కారు దాన్ని కాస్తా రెండేళ్ల వయసుకు కుదించింది. ఆ వయసులో పిల్లలకున్న మూగ, చెవుడు లోపాన్ని గుర్తించడం కష్టమని ఎవరెంతగా ప్రాథేయపడినా ప్రయోజనం లేకపోయింది. బాబు సర్కారు ఇలాంటి సమస్యలను సరిదిద్దకపోగా దాన్ని మరింత భ్రష్టు పట్టించాలని చూస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలు ఎలా అఘోరిస్తున్నాయో కాగ్ నివేదిక తేటతెల్లం చేసింది. అక్కడ డాక్టర్లు, నర్సుల కొరత ఎక్కువని తెలిపింది. జ్వరానికి వాడే పారాసిటమల్‌తోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గైనకాలజీ కిట్లు, గర్భనిరోధక మాత్రలు అందుబాటులో లేవని చెప్పింది. కాలం చెల్లిన మందుల్ని రోగులకిస్తున్నారని, వాటి నాణ్యతను తనిఖీ చేయడం లేదని వివరించింది. ప్రజారోగ్య వ్యవస్థను ఇంతగా ధ్వంసం చేసింది చాలక వేరేచోట్ల వైద్యం చేయించుకుంటే ఆరోగ్యశ్రీ వర్తించబోదని అనడంలోని ఆంతర్యమేమిటి? ఇలాంటి ఎత్తుగడలకు చంద్రబాబు సర్కారు స్వస్తి పలకాలి. ఆ పథకానికి తగినన్ని నిధులు కేటాయించకపోతే, దాన్ని నీరుగారిస్తే ప్రజలు క్షమించరు.



అన్ని రకాల అసమానతలలోకి, వైద్యసేవలలో అసమానత అనే అన్యాయమే అత్యంత దిగ్భ్రాంతికరం, అమానుషం.

– మార్టిన్ లూథర్ కింగ్
అమెరికా హక్కుల ఉద్యమ నేత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి శు.దశమి ప.2.28 వరకు, తదుపరి ఏకాదశి నక్షత్రం అనూరాధ సా.4.32 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం రా.10.40 నుంచి 12.26 వరకు, దుర్ముహూర్తం ప.11.41 నుంచి 12.33 వరకు అమృతఘడియలు ఉ.5.58 నుంచి 6.54 వరకు.


సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.30
రాహుకాలం : ప 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

నమాజ్ వేళలు



ఫజర్ : 4.38
జొహర్ : 12.22
అసర్ : 4.50
మగ్రీబ్ : 6.49
ఇషా : 8.07

'దక్షిణం' కోసం ప్రదక్షిణాలు



దేవులపల్లి అమర్

తనను తీవ్రంగా వ్యతిరేకించి, అవమానకరంగా వ్యవహరించిన నితీశ్‌నే అక్కున చేర్చుకున్న మోదీ చంద్రబాబు ఆనాడు చేసిన అవమానాన్ని తమ రాజకీయ ప్రయోజనం కంటే ఎక్కువ సీరియస్‌గా తీసుకుంటారా? అదేమైనా మనసులో ఉన్నా అసలు కారణాలు వేరే ఉన్నాయి. పెద్ద ఎత్తున అవినీతి కుంభకోణాలు, అన్ని వర్గాలనూ దూరం చేసుకున్న పరిస్థితిలో మునుగుతున్న పడవలో ప్రయాణం చెయ్యాలని ఎవరనుకుంటారు? ఈ ఆగస్టులో ఏపీ రాజకీయాలు ఆసక్తికరమైన మలుపులు తిరిగే అవకాశాలు చాలా కనిపిస్తున్నాయి.

డేట్‌లైన్ హైదరాబాద్



తెలుగు రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ ఏం చేయాలని అనుకుంటున్నది? తెలంగాణలో అధికారపక్షాన్ని తన దారికి తెచ్చుకుని, ఆంధ్రప్రదేశ్‌లో అధికారపక్షంతో తెగతెంపులు చేసుకోవాలని అనుకుంటున్నదా? మిత్రపక్షాలైనా సరే, భారంగా మారతాయనిపిస్తున్న పార్టీలను వదిలించుకుని కొత్త స్నేహాల కోసం బీజేపీ చేయి చాస్తున్నట్టు ఇటీవలి పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఇదేదో రెండు తెలుగురాష్ట్రాలలో తన వ్యూహంగా మాత్రమే బీజేపీ చేస్తున్నట్టు లేదు. 2019 సార్వత్రిక ఎన్నికలలో కేంద్రంలో బీజేపీకి గతంలో కంటే ఎక్కువ స్థానాలను సాధించుకోవడంతో బాటు, రాష్ట్రాల్లో కూడా తమ ప్రభుత్వం లేదా తమ మిత్రుల ప్రభుత్వాలు అధికారంలో ఉండేటట్టు చూసుకోవడం నరేంద్ర మోదీ, అమిత్ షా తాజా వ్యూహం. తద్వారా లోక్‌సభతో బాటు రాజ్యసభలో కూడా తమ మాట నెగ్గేటట్టు చేసుకుంటే ఇక అడ్డు ఉండదన్నది ఆ నాయకద్వయం ఆలోచన.

సంపూర్ణ అధికారమే లక్ష్యంగా ముందుకు పోతున్న ఈ నాయకులు ఇద్దరికీ తెలుగు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీల మీద ప్రత్యేకమైన ప్రేమ కానీ, ద్వేషం కానీ లేవు. రాజకీయాలలో శాశ్వత మిత్రులు శాశ్వత శత్రువులు ఉండరన్న మాటను నూటికి నూరుపాళ్లు నిజం చేస్తూ మొన్ననే బిహార్‌లో నితీశ్‌కుమార్ మోదీ శిబిరంలో చేరిపోవడం, మోదీని మించిన నాయకుడు ఈ దేశంలోనే లేరు అనేంత దాకా వెళ్లడం చూశాం. ఇంకెవరయినా ఈ మాటలు మాట్లాడితే ఆశ్చర్యపోనక్కర లేదు. నితీశ్ బీజేపీతో జత కట్టడాన్ని ఘర్‌వాపసీ అంటున్న వాళ్లంతా మోదీ నాయకత్వాన్ని అంగీకరించేందుకు ససేమిరా అనే నితీశ్ ఎన్డీఏ కూటమిని వీడిన విషయం, ఒక దశలో బీజేపీయేతర పార్టీలన్నిటికీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ముందుకొచ్చిన విషయం మరిచిపోయినట్టున్నారు. ఇటీవలే జరిగిన బిహార్ ఎన్నికల్లో బీజేపీ, జేడీ(యు) మధ్య జరిగిన మాటల యుద్ధం కూడా గుర్తు చేసుకోవాలి వాళ్లు. నైతికమా అనైతికమా, న్యాయమా అన్యాయమా, చట్ట విరుద్ధమా రాజ్యాంగ బద్ధమా అన్న చర్చ చేయడానికి కేంద్రంలోఅధికారంలో ఉన్న మోదీ షా జోడీ ఆలోచించేందుకు సిద్ధంగా లేదు. దేశాన్నంతటినీ తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం లక్ష్యంగా ముందుకు పోతున్నారు. తమిళనాడు పరిణామాలను గమనిస్తూనే ఉన్నాం కదా! ద్రవిడ రాజకీయాలకు పెట్టింది పేరైన తమిళనాడు ఇక బీజేపీ అదుపులోకి వచ్చినట్టే. బిహార్ బీజేపీ బుట్టలో పడనే పడింది. దీంతో 15 రాష్ట్రాలు బీజేపీ పాలనలోకి వచ్చేసినట్టే.

నియోజకవర్గాల పెంపు లేకపోతే...

తమిళనాడులో ఏఐడీఎంకే గ్రూపులు దారికి రాకపోతే రాష్ట్రపతి పాలన విధించి 2018లో మరికొన్ని రాష్ట్రాలతో బాటు ఎన్నికలు నిర్వహించవచ్చు. దక్షిణాదిలో కూడా అధికారంలోకి రావాలన్న బీజేపీ వ్యూహకర్తల లక్ష్యంలో భాగంగా తమిళనాడును దారికి తెచ్చుకునే పనిలోపడ్డట్టున్నారు. కర్ణాటకలో గతంలో అధికారం అనుభవించిన బీజేపీ మళ్లీ అధికారం లోకి వచ్చే అవకాశాల పట్ల ఆశతోనే ఉంది. కేరళ కొరకరాని కొయ్య. ఇక పోతే దక్షిణాదిలో మిగిలింది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్–రెండు తెలుగు రాష్ట్రాలు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాలలో మోదీ షా జోడీ ఏం చేయబోతున్నదో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలలోనూ అధికార పక్షాలు విభజన చట్టంలో పొందుపరిచిన అంశాల్లో మిగతా వాటి సంగతి ఎలా ఉన్నా శాసనసభ నియోజకవర్గాల సంఖ్యను మాత్రం కచ్చితంగా పెంచేందుకు కేంద్రాన్ని ఒప్పించగలమన్న ధీమాతో ఎడా పెడా ప్రతిపక్షాల నుంచి శాసనసభ్యులను చేర్చుకుని కూర్చున్నారు. తెలంగాణలో 25 మంది, ఆంధ్రప్రదేశ్‌లో మరో 21 మంది శాసనసభ్యులు, కొంతమంది లోక్‌సభ సభ్యులు అధికార పక్షానికి వలసపోయారు.

ఇద్దరికీ మిత్రుడిగా, తమ ప్రయోజనాల పరిరక్షకుడిగా చంద్రశేఖర్ రావు, చంద్రబాబునాయుడు భావించిన వెంకయ్యానాయుడును ఉప రాష్ట్రపతి పదవికి పంపించడం, ఆ వెంటనే, నియోజకవర్గాల పెంపు ఇప్పట్లో లేదని స్పష్టం చెయ్యడంతో ఇద్దరు నేతలూ దిక్కు తోచని స్థితిలో పడ్డారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఇద్దరు ముఖ్యమంత్రులూ ప్రధానమంత్రిని కలసి నియోజకవర్గాల పెంపు విషయంలో స్పష్టమయిన ప్రకటన చేయించుకు రావాలని గట్టి ఆలోచనతో వెళ్లారు. చంద్రబాబునాయుడుకు యథావిధిగానే ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ దొరకలేదు. అయితే ప్రధానితో సమావేశం కోసం వేచి ఉండకుండా తొందర పనులు ఉన్నందున చంద్రబాబే విజయవాడకు వెళ్లిపోయారని ఆయన అనుయాయులు నమ్మించే ప్రయత్నం చేశారనుకోండి! ఇక ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ పొంది మరునాడు ఆయనను కలసిన తెలంగాణ ముఖ్యమంత్రి ఆ అంశం మరిచిపోవచ్చునని మీడియా మిత్రులకు చెప్పారు. నియోజకవర్గాల సంఖ్య పెరగకపోయినా మాకేం 'ఫరక్' పడదు అని ఆయన గాంభీర్యం ప్రదర్శించినా కొంచెం స్వరం మారడం గమనించవచ్చు. గత సంవత్సరం మోదీ ప్రభుత్వం పెద్ద నోట్లు రద్దు చేసిన వెంటనే తీవ్రంగా స్పందించి, తెలివి తక్కువ చర్యగా వర్ణించిన చంద్రశేఖర్‌రావు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి ఉపదేశం విన్నాక కనువిప్పు కలిగి అదొక విప్లవాత్మక నిర్ణయం అని కొనియాడారు. ఏం మతలబు జరిగిందో ఆయనకే తెలియాలి. ఇంతమాట ఎందుకు అనాల్సి వచ్చిందంటే మొన్న ప్రధానిని కలసి బయటికొచ్చాక అదే చంద్రశేఖర్‌రావు పెద్ద నోట్ల రద్దు సత్ఫలితాలు ఏమీ కనిపించలేదని మీడియాకు చెప్పారు.

సొంతంగా ఎదిగేందుకు బీజేపీ కృషి

ఈ మధ్యకాలంలో ఒకపక్క తెలంగాణ బీజేపీ నాయకులు తెలంగాణ ప్రభుత్వం మీద విమర్శల బాణాలు విసురుతూనే ఉన్నా స్నేహబంధం కుదిరిపోయిందనీ, ఈ పార్లమెంట్ సమావేశాల తరువాత టీఆర్ఎస్ కేంద్ర ప్రభుత్వంలో చేరనుందనీ వార్తలు వచ్చాయి. కేసీఆర్ కూడా అమిత్ షాను విమర్శించినా కేంద్ర ప్రభుత్వం మీద, మోదీ మీద ఈగ వాలనివ్వక పోవడం ఆ ప్రచారానికి ఆస్కారం కల్పించింది. అంతెందుకు, కాంగ్రెస్ రాష్ట్రపతి అభ్యర్థి మీరాకుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ వచ్చి మర్యాదపూర్వకంగా కలుస్తానన్నా కనీసం ఫోన్‌లో కూడా ఆమెతో మాట్లాడటానికి సిద్ధపడక పోవడం బీజేపీ మెప్పు కోసమే అన్న విమర్శ అయితే ఉంది. సొంతంగానే పోటీ చేస్తాం అని శ్రేణుల్లో ఉత్సాహం కలిగించడం కోసం మాట్లాడుతున్నా టీఆర్ఎస్ అధినేతకు పరిస్థితులు బాగా తెలుసు, వచ్చే ఎన్నికలలో గెలుపు నల్లేరు మీద నడక కాదని. నియోజకవర్గాల పెంపు లేకపోతే అందరినీ సంతృప్తి పరచడం అసాధ్యం. ఆ విధంగా తెలంగాణ లో అధికార పక్షం తమతో పొత్తుకు ముందుకు రాక తప్పని పరిస్థితి కల్పిస్తూనే సొంతంగా ఎదిగే ప్రయత్నంలో బీజేపీ పడ్డట్టుంది. మోదీ అమిత్ షా ఎత్తుగడలను తట్టుకుని టీఆర్ఎస్ సొంతంగానే నిలబడుతుందా, సర్దుకుపోతుందా చూడాలి.

టీడీపీతో బెడిసిన సంబంధాలు

ఇక ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ, టీడీపీ మధ్య సంబంధాలు పూర్తిగా చెడిపోయాయి. వాజ్‌పేయి, అద్వానీల కాలం నాటి ఎన్డీఏ కాదనీ మోదీ, అమిత్ షాల కాలమనీ గుర్తించడానికి చంద్రబాబునాయుడుకు ఎక్కువ కాలం పట్టలేదు. రాష్ట్రపతి ప్రమాణ స్వీకారోత్సవంలో చంద్రబాబునాయుడుకు ముందు వరుసలో స్థానం కేటాయించారని అనుకూల మీడియాలో రాయించుకోవడం కేవలం ఢిల్లీలో ఇంకా తమకు సముచిత గౌరవం ఉందని చెప్పుకోవడానికే. ఈ మూడేళ్లకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వం నడుస్తున్న తీరు తెలియనంత అజ్ఞానంలో బీజేపీ నాయకత్వం ఉండదు కదా! కేంద్రం విడుదల చేసిన నిధులను ఖర్చు చేస్తున్న తీరు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని పెద్దల వ్యవహార శైలి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న కేంద్ర నాయకత్వం ఇక్కడ కూడా సొంతంగా పార్టీని బలోపేతం చేసే ఆలోచనతో బాటు, ప్రత్యామ్నాయ మిత్రులను వెతుక్కోవడం సహజంగానే జరుగుతున్నది. ఇక్కడొక విషయం మాట్లాడుకోవాలి.

దేశమంతా ఇంతకాలం బీజేపీకి దూరంగా ఉన్న పలు పార్టీలు దగ్గరై ఎన్డీఏలో చేరడానికి సిద్ధపడుతుంటే, పాత భాగస్వామి తెలుగుదేశం ఎందుకు దూరమవుతున్నది అన్నదే ఆ విషయం. రాజకీయ దురంధరుడినని తనకు తానే కితాబు ఇచ్చుకునే చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్‌కు ప్రాణవాయువు వంటి ప్రత్యేక హోదా మొదలైన అన్ని హామీలను గాలికి వదిలేసి అణిగి మణిగి ఉన్నా ఎందుకు బెడిసింది? కాంగ్రెస్‌ను పూర్తిగా బలహీనపరిచే క్రమంలో వీలైనన్ని పార్టీలను తమ కూటమిలో చేర్చుకోజూస్తున్న బీజేపీ ఆయనను ఎందుకు దూరం పెడుతున్నది?

నెలకు ఒరిగిపోతున్న చంద్రబాబు రాజకీయ ప్రతిష్ట వెన్నుకు వెదురు బద్దలు కట్టి నిటారుగా నిలబెట్టే ప్రయత్నంలో తలమునకలవుతున్న ఆయన మిత్ర మీడియా చెప్పినట్టు వాజ్‌పేయి హయాంలో ఎన్డీఏ కన్వీనర్‌గా అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి మోదీని పదవి నుంచి తొలగించాలని పట్టుపట్టి ఢిల్లీ ఆంధ్రభవన్‌లో మూడు గంటలు ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా అవమానించినందుకే ఇప్పుడు మోదీ చంద్రబాబును దూరం పెడుతున్నారా? తనను తీవ్రంగా వ్యతిరేకించి, అవమానకరంగా వ్యవహరించిన నితీశ్‌నే అక్కున చేర్చుకున్న మోదీ చంద్రబాబు ఆనాడు చేసిన అవమానాన్ని తమ రాజకీయ ప్రయోజనం కంటే ఎక్కువ సీరియస్‌గా తీసుకుంటారా? అదేమైనా మనసులో ఉన్నా అసలు కారణాలు వేరే ఉన్నాయి. పెద్ద ఎత్తున అవినీతి కుంభకోణాలు, అన్ని వర్గాలనూ దూరం చేసుకున్న పరిస్థితిలో మునుగుతున్న పడవలో ప్రయాణం చెయ్యాలని ఎవరనుకుంటారు? ఇక ఎవరి సర్వేలు వాళ్లకు ఉంటాయికదా! హనీమూన్ ఇక ముగిసినట్టే. ఈ ఆగస్టు మాసంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఆసక్తి కరమైన మలుపులు తిరిగే అవకాశాలు చాలా కనిపిస్తున్నాయి.

నంద్యాల ఉప ఎన్నిక ఇదే నెలలో జరుగుతున్నది, అక్కడ జరుగుతున్న అధికారదుర్వినియోగం, ధన ప్రవాహం అధికార పక్షం ఎంత దిక్కు తోచని స్థితిలో కూరుకుపోయిందో స్పష్టం చేస్తున్నది.

datelinehyderabad@gmail.com

నేరమయ పాలనకు మారుపేరు

కొమ్మినేని శ్రీనివాసరావుతో నట, దర్శకుడు పోసాని కృష్ణమురళి

ప్రభుత్వాన్ని ఎవరైనా నడపవచ్చు. ముఖ్యమంత్రి సీటులో ఎవరైనా కూర్చోవచ్చు.. కానీ ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం చేస్తున్నన్ని తప్పులను ఎవరూ చేయకూడదని ప్రముఖ సినీ రచయిత, నట దర్శకుడు పోసాని కృష్ణ మురళి చెప్పారు. భూకబ్జాలు, లంచాలు, కమీషన్లు, తప్పుల్ని నిలదీసిన అధికారులను కొట్టడం, నిలదీసిన ప్రజలను లారీల్తో గుద్దేయడం. ప్రతిపక్ష నేతలపై ఎస్సీ, ఎస్టీ వేధింపు కేసులను పెట్టి బలవంతంగా ఫిరాయింపులకు గురిచేయడం.. ఒక్కమాటలో చెప్పాలంటే ఏపీలో ప్రస్తుత పాలకులు లెక్కలేని నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పవర్‌ఫుల్ ఆయుధాన్ని మాకిచ్చారు. అదే ఓటు. మేం దాంతో చెబుతాం సమాధానం అని ఏపీలో జనం ఘోషిస్తున్నారంటున్న పోసాని అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...



మీకు రచన అంటే ఇష్టమా పాత్ర పోషణ అంటే ఇష్టమా?

నాకు రైటరంటేనే ఇష్టం. ఎందుకంటే దానివల్లే బతికాను కదా. అదే నాకు అన్నం పెట్టింది. ఎంఏ తెలుగు అనే నా క్వాలిఫికేషనే నన్ను కాపాడింది. ఆ సర్టిఫికెట్ చూసే పరుచూరి గోపాలకృష్ణ నన్ను వాళ్ల అన్నయ్యకు పరిచయం చేసి ఈ కుర్రాడిని మనం పెట్టుకుందాం అని చెప్పి తీసుకున్నారు.

మీకు సినిమాల్లో మొదట్లో రాసే అవకాశం ఎలా ఇచ్చారు?

గుంటూరు బస్టాండు నుంచి కనిపించిన బస్సు పట్టుకుని మద్రాసుకు వెళ్లి పరుచూరి బ్రదర్స్‌ని కలిస్తే ఎంఏ తెలుగు కదా... కొటేషన్లు నీకు నచ్చినవి రాయి అన్నారు. వారు భోజనం చేసి వచ్చేలోపు పేకాట ముక్కలపై 70 కొటేషన్లు రాసి చూపించాను. బాగా రాశావే. నువ్వు రైటర్ అవుతావు. మాలాగా కష్టపడు అన్నారు. మేనేజర్ని పిలిచి నాలుగు జతల బట్టలు కొనిచ్చారు. బుద్ధిగా ఉండు. బుద్ధిగా పనిచేసుకోపో అన్నారు. అలా నాలుగున్నర ఏళ్లు వారివద్ద ఉన్నాను. 50 సినిమాలకు కథలు రాశాను. మౌనపోరాటం, కర్తవ్యం వంటి సినిమాలకు రాశాను. పీపుల్స్ ఎన్‌కౌంటర్ సినిమాకు కథ రాస్తే అవార్డు వచ్చింది.

మీరు రాసిన ఏదైనా మంచి డైలాగు చెబుతారా?

పీపుల్స్ ఎన్‌కౌంటర్ సినిమాలో పోలీసు అధికారి ఒక నక్సలైటు లీడర్ని పట్టుకుని ఇంటరాగేషన్ చేస్తాడు. నెలరోజులలోపు మీ జిల్లాలో నక్సలైట్లను ఏరిపారేస్తానంటాడు. అప్పుడా నక్సలైట్ అంటాడు. ఏరిపారేయడానికి బియ్యంలో రాళ్లు కాదు బిడ్డా నక్సలైట్లు అంటే, తూర్పునుంచి పడమరకు.. పడమరనుంచి తూర్పుకు మార్చింగ్ చేస్తూ ప్రపంచానికే పహారా కాస్తున్న వాడే నక్సలైట్ అంటాడు. ఇలాంటి పంచ్ డైలాగులు ఎన్ని రాశానో లెక్క లేదు.

పెద్ద కష్టం లేకుండానే మీరు వారి ఆదరణ సంపాదించారు కదా?

ఇద్దరు పెద్దమనుషుల మధ్య పెరిగాను నేను. ఏ చెడు అలవాటూ లేని మనుషుల మధ్య పెరిగాను. అదే వ్యసనాలు ఉన్నవారి వద్ద పని చేసి ఉంటే సాయంత్రం ఆరు గంటలకు మందు బాటిల్, ఏడు గంటలకు మరొకటి, పది గంటలకు మరొకటి ఇలా ఎంత గబ్బు పట్టాలో అంత గబ్బుపట్టిపోయి ఉండేవాడిని.

డ్రగ్స్ కేసులో సినిమావాళ్లు ఇంతమందా?

దేశంలో ప్రతి వ్యవస్థలోనూ లోపాలున్నాయి. విద్యా వ్యవస్థ పాడైపోయింది. అన్నిరకాలుగా ప్రజాస్వామ్యాన్ని రేప్ చేసి మరీ గెలుస్తున్నారు కాబట్టి రాజకీయ వ్యవస్థా పాడైపోయింది. అలాగే మీడియా, ప్రభుత్వోద్యోగులు, పోలీసు వ్యవస్థ అన్నింటిలోనూ లోపాలున్నాయి. అలాగే సినిమా వాళ్లలోనూ ఉన్నాయి కాదనను. కానీ సినిమా రంగాన్ని మాత్రమే ఎత్తి చూపవద్దు?

> ప్రజారాజ్యాన్ని చిరంజీవి కాంగ్రెస్‌లో కలిపేసినప్పుడే నాకు రాజకీయాలపై విరక్తి కలిగింది. ఇక జీవితంలో నేను ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పోటీ చేయను. కానీ ఎన్నికల్లో మాత్రం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సపోర్టు చేస్తా, ఓటేస్తా అని నిర్ణయించుకున్నాను. గతంలో వైఎస్ జగన్ ఎంపీగా, విజయమ్మ ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు కడపలో క్యాంపెయిన్‌లో పాల్గొని ప్రచారం చేసివచ్చాను. నాకు వైఎస్సార్ అంటే ఇష్టం. జగన్‌లో ఆయన పోలికలున్నాయి. నడవడిక ఉంది.

పెద్ద పెద్ద నటులూ డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు కదా.. మానసిక సమస్యలా?

ప్రభుత్వ వైఫల్యం కాబట్టే భారీ మొత్తంలో డ్రగ్స్ దేశంలోకి వచ్చి పడుతున్నాయి. డ్రగ్స్ మాత్రమే ఎందుకు ఆపాలనుకుంటున్నారు? సిగరెట్లు, బీడీలు, గుట్కా ఇంకా ఎన్నో వ్యసనాలు ఉంటున్నాయి. వాటినెందుకు ఆపరు? ప్రజలను మత్తులో, వ్యసనాల్లో ముంచే ఎన్నో అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోంది కదా? డ్రగ్స్ ఎంత ప్రమాదకరమో సిగరెట్లు, మందు, గుట్కాలు, పాన్ పరాగ్‌లు కూడా అంతే ప్రమాదకరం. కానీ వాటిని మాత్రం షాపుల్లో పెట్టి అమ్మిస్తారు. మనుషులను గబ్బుపట్టించే అన్నింటినీ మీరు ఓపెన్‌లో పెడతారు. కానీ డ్రగ్స్ మాత్రం మీకు దెయ్యంలాగ కనబడుతోంది.

డ్రగ్స్ చాలా ప్రమాదకరం అని ప్రభుత్వం చర్యలు చేపట్టింది మరి?

ప్రభుత్వం యాడ్ ఇచ్చింది. నా పేరు మహేష్. పొగ తాగాను, కేన్సర్ వచ్చింది అంటూ జలదరింపజేసే బొమ్మలతో ప్రచారం చేస్తోంది. ప్రభుత్వం పొగాకును, చుట్టలను ఎందుకు నిషేధించలేదు? పొగ తాగుట హానికరం అని యాడ్ వేసి కూడా మళ్లీ షాపుల్లో అమ్మడానికి ఎందుకు అనుమతిస్తున్నారు? డ్రగ్స్‌ని నిషేధించినవారికి వాటిని నిషేధించడం చేతకాదా?

ఇంతకూ డ్రగ్స్ వాడుతున్న నటీనటులను మీరు సమర్థిస్తున్నారా?

నేనొకటే చెబుతాను. డ్రగ్స్ ప్రమాదకరమని ఇంతగా చెబుతున్నారే.. మందు తాగి ఎంతమంది చావడంలేదు? పొగ తాగి ఎంతమందికి కేన్సర్ రాలేదు? కాబట్టి డ్రగ్స్‌తో పాటు వీటిని కూడా బ్యాన్ చేసి తర్వాత మాట్లాడండి.

సినిమా పరిశ్రమను అధికారులు టార్గెట్ చేస్తున్నారని మీ అభిప్రాయమా?

సిట్ వాళ్లు ముందే చెప్పారు. మాకు కొన్ని ఆధారాలు దొరికాయి. వాటిని ధ్రువపర్చుకునేందుకు అనుమానం కలిగినవారిని పిలిచి విచారిస్తున్నాం. అంతే కానీ మేం నోటీసులిచ్చామంటే వారిని అరెస్టు చేస్తామని కాదు అని వారు చాలా స్పష్టంగా చెప్పారు.

నోటీసులకే ఈ పరిస్థితి వస్తే రేపు నిజంగా ఏదయినా జరిగితే?

డ్రగ్స్ వాడుతున్నానని నాకు నోటీసులిచ్చారనుకోండి. నేను కోర్టులకు వెళ్లను. మీమీద అనుమానం ఉంది. కెల్విన్ పక్కన మీరు ఉన్నట్లు ఫొటో ఉంది మీరు విచారణకు రావాలి అని సిట్ వాళ్లు చెబితే ఒకపౌరుడిగా నేను వెళ్లాలి. నేను ఈ దేశానికి జవాబుదారిని. నా ఇంటికి మాత్రమే కాదు. అకుల్ సబర్వాలే కాదు.. ఎవరు పిలిచినా సరే వస్తానని చెప్పి మరీ వెళ్లి వారి ముందు కూర్చుంటాను. ఇంకా అనుమానం ఉంటే లై డిటెక్టర్ పరీక్ష చేసుకోండి. దొరికితే జైల్లో పెట్టండి, నన్ను క్షమించవద్దు అంటాను. సమాజాన్ని క్లీన్‌గా పెట్టడానికి వాళ్లు ప్రయత్నిస్తున్నారు. అందుకే అర్ధరాత్రి వారు ఫోన్ చేసి రమ్మన్నా నేను వెళతాను.

చంద్రబాబు పాలనపై మీ అభిప్రాయం?

చంద్రబాబు పెద్ద లీడర్. అందులో సందేహమే లేదు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు తెలుగు దేశం పార్టీని అడ్వాంటేజీగా తీసుకుని చాలామంది చాలా తప్పులు చేస్తున్నారు. కులరాజకీయాలు చేస్తున్నారు. మంత్రి మా కమ్మోడు.. మేం ఏమయినా చేస్తాం అంటున్నారు. నేను దీన్ని కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. 'ప్రజాస్వామ్యంలో మాకు పవర్‌ఫుల్ ఆయుధం ఇచ్చారు. అదే ఓటు. మేం దాంతో చెబుతాం సమాధానం'. ఇదే జనం అభిప్రాయం. ప్రభుత్వం ఏదైనా కావచ్చు. సీఎం సీటులో ఎవరయినా కూర్చోవచ్చు. కానీ ఇన్ని తప్పులు చేయకూడదు. భూ కబ్జాలు, లంచాలు, వనజాక్షిని కొట్టడం, జనాలను లారీతో గుద్దిచంపడం, భూమానాగిరెడ్డిపై ఎస్సీఎస్టీ కేసు పెట్టి మరీ, తనను పార్టీలోకి లాక్కోవడం... ఇవన్నీ వైరుధ్యాలంటామా, వైషమ్యాలంటామా, స్వప్రయోజనమంటామా? ఒక్కమాటలో చెప్పాలంటే ఏపీలో లెక్కలేని నేరాలకు పాలకులు పాల్పడుతున్నారు.

అమరావతి రాజధానిపై మీ అభిప్రాయం?

రాళ్లలో బియ్యముంటే పక్కన పెడతాం. బియ్యంలో రాళ్లుంటే పక్కన బెడతాం. కాని రాళ్లే బియ్యమైతే దేన్ని పక్కన బెట్టగలం. నేను నిజాలు ఇలాగే చెబుతాను కాబట్టి నన్ను కూడా రేపు ఆ పార్టీవాళ్లు వచ్చి కొట్టినా కొట్టవచ్చు. గతంలోనే నన్ను బెదిరించారు. అదిచేస్తాం ఇది చేస్తాం అన్నారు. ఎవరికీ భయపడేదే లేదు.

(పోసాని కృష్ణమురళితో ఇంటర్వ్యూ పూర్తి పాఠం కింది లింకుల్లో చూడండి)
https://goo.gl/yhaRAA
https://goo.gl/qt6rGT

ఆధ్యాత్మికత అంటే...



"నేను ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నాను, ఇతర విషయాలు నాకు అక్కరలేదు" అని బాధ్యతలను విదిలించుకోటం ఆధ్యాత్మికత అనుకుంటారు ఎక్కువమంది. ఇంటిపనులు, బాధ్యతలు వదలిపెట్టి ఏమీ పట్టించుకోకుండా ఏదో కొద్దిసేపు యోగాసనాలు, పూజ, పుస్తకాలు చదవటం, ప్రవచనాలకి వెళ్లటం ఆధ్యాత్మికత అనే అభిప్రాయం ఉంది చాలామందిలో. ఇవన్నీ ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్లించేవే కానీ, అవే పరమార్థం కావు. నిజానికి అది తెలిసినవారు తక్కువ అనే చెప్పాలి. అన్నీ వదిలేశాను, నాకేమీ అక్కరలేదు అన్నప్పుడు భోజనం ఎందుకు? కాఫీలు, టీలు, ఫలహారాలు, పళ్లరసాలు ఎందుకు? ఫ్యానులు, ఏసీలు, పరుపులు ఎందుకు? అరణ్యాలకి వెళ్లటానికి భయం అనుకుంటే ముక్కు మూసుకుని ఒక చోట కూర్చోవచ్చుగా.

అన్నీ కావాలి. ఏ సుఖానికి తక్కువ కాకూడదు. ఎవరైనా సహాయం చెయ్యమంటే ఆధ్యాత్మిక సాధనకి ఇబ్బంది అని తప్పించుకుంటూ ఉంటారు. ఇలా చేసే వాళ్లు చెడ్డవాళ్లు, దుర్మార్గులు అనలేము. వాళ్లకి తెలియదు అనే అనుకోవాలి. ఎంతో మంది తాము అనుసరిస్తున్న మతసంప్రదాయాలను తు. చ. తప్పకుండా ఆచరిస్తూ అదే ఆధ్యాత్మికత అని భ్రమపడుతూ ఉంటారు. అట్లా ఉండటం వల్ల ఒక గొప్ప హిందువుగానో, మహమ్మదీయుడుగానో, క్రైస్తవుడుగానో, బౌద్ధుడుగానో, జైనుడుగానో మాత్రమే తయారవుతారు. మతం, చేరవలసిన గమ్యానికి వెళ్లే ఒక దారి మాత్రమే అని తెలిసిన వారు అక్కడితో ఆగిపోరు. దారి ప్రాధాన్యం గమ్యానికి చేర్చటం వరకే. పగలంతా ఎన్నో పనులతో ఎక్కడెక్కడో తిరిగిన తర్వాత మనం ఎంచుకునే దారి త్వరగా ఇంటికి చేర్చేదిగా ఉండటం ప్రధానం అనుకుంటామా, లేదా? దారి బాగుందని దాన్నే పట్టుకుని పాకులాడం కదా! ఇల్లు చేరగానే దారిని మరచిపోతాం. ముఖ్యం మనం చేరవలసిన మన ఇల్లు.

జ్యోతిర్మయం

అయితే, దారి బాగుంటే ప్రయాణపు అలసట తెలియదు. పరిసరాలు అందంగా ఉంటే నడక ఆహ్లాదంగా ఉంటుంది. కష్టపడమని భగవంతుడు చెప్పలేదు. చెప్పడు. కనుక ప్రయాణాన్ని సుఖంగా ఉండేట్టు చేసుకోవటం తప్పు కాదు. సుఖానికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తే ఆధ్యాత్మిక జీవనం అనిపించుకోదు. సుఖపడటానికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడు దారి బాగుందని అక్కడే ఉండిపోయినట్టవుతుంది.

ఆధ్యాత్మికత, మనిషిని ప్రపంచం నుండి వేరుచేయదు. కంటికి కనపడే ఈ ప్రపంచం అంతా భగవంతుని వ్యక్త స్వరూపంగా దర్శించి, దానిని కూడా ఆరాధించటం నేర్పుతుంది. చేస్తున్న ప్రతి పని దైవారాధనగా ఉంటుంది. సాధనకి కొద్దిసమయం కేటాయించటం ఉండదు. సమయమంతా సాధనే. జీవించటమే యోగంగా పరిణమిస్తుంది. దానిని యోగ జీవనము అంటారు. అట్లా జీవితాన్ని గడిపే వాళ్లు లౌకిక జీవనం నుండి పారిపోరు. మతం వారికి మార్గం మాత్రమే.

– డాక్టర్ ఎన్. అనంతలక్ష్మి

తరచుగా అడిగే ప్రశ్నలు

వస్తు, సేవల పన్ను

నేషన్ ట్యాక్స్ మార్కెట్

GST : ఎగుమతిపై తరచుగా అడిగే ప్రశ్నలు (FAQs)

ప్రశ్న 1 GST చట్టం క్రింద ఎగుమతులను ఏ విధంగా పరిగణిస్తారు?

జవాబు GST చట్టం క్రింద వస్తువులు లేదా సేవల ఎగుమతిని దిగువ విధంగా పరిగణించవలెను.

- IGST చట్టం క్రింద కవరు చేయబడిన, అంతర్‌రాష్ట్ర సరఫరా
- జీరో రేటెడ్ సరఫరా అంటే ఎగుమతి చేసిన వస్తువులు లేదా సేవలు ఇన్‌పుట్ స్టేజ్ లేదా తుది ఉత్పత్తి దశలో వారికి విధించబడిన GST నుంచి ఉపశమనం లభిస్తుంది.

ప్రశ్న 2 వస్తువుల ఎగుమతి జీరో రేటింగ్‌పై GST ప్రభావం ఏవిధంగా ఉంటుంది?

జవాబు ఇది అంతర్జాతీయ మార్కెట్లో భారతీయ ఎగుమతులను పోటీపడేలా చేస్తుంది.

ప్రశ్న 3 GST విధానంలో తయారీదారు ఎగుమతిదార్లచే ఎగుమతికి సంబంధించిన విధానాలు సరళీకృతం చేయబడినవా?

జవాబు అవును. ఎగుమతులు వివిధ దశలలో పేపర్ వర్క్ మరియు డిపార్ట్‌మెంట్ ప్రమేయం లేకుండా ఉండే విధంగా ఎగుమతికి సంబంధించి న విధానాలు సరళీకృతం చేయబడినవి. GST విధానం క్రింద ఎగుమతి పథకం ముఖ్యాంశాలు దిగువ విధంగా ఉన్నాయి.

- IGST చెల్లింపులపై వస్తువులు మరియు సేవలను ఎగుమతి చేయవచ్చును. IGST చెల్లించకుండా వస్తువులు ఎగుమతి చేసిన తర్వాత లేదా బాండ్ క్రింద లేదా లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ క్లెయిమ్ చేయవచ్చును.
- బాండ్ లేదా LUT క్రింద ఎగుమతి చేసుకున్న వస్తువులు మరియు సేవల విషయంలో, ఎగుమతిదారు ఎగుమతి విషయంలో జమ అయిన ITC వాపసును క్లెయిమ్ చేయవచ్చును.
- వస్తువుల విషయంలో షిప్పింగ్ బిల్ మాత్రమే ఎగుమతులు చేసేందుకు కస్టమ్స్ వద్ద దాఖలు చేయాల్సిన డాక్యుమెంట్. ARE1/ARE2 దాఖలు చేయనవసరం లేదు.
- శాఖ అధికారి ప్రమేయం ఏదీ లేకుండా సెల్ఫ్‌సీలింగ్ మరియు సెల్ఫ్ సర్టిఫికేషన్ క్రింద ఎగుమతికోసం సరఫరాలు చేయాలి.
- కస్టమ్స్ వద్ద దాఖలు చేసిన షిప్పింగ్ బిల్లు IGST వాపసు కోసం దరఖాస్తుగా పరిగణించవలెను మరియు ఎక్స్‌పోర్ట్ జనరల్ దాఖలు తర్వాత దాఖలు చేసినట్లుగా భావించబడును మరియు దరఖాస్తుదారుచే ఫారం IGSR-3లో చెల్లుబాటగు రిటర్న్ దాఖలు చేయాలి.

ప్రశ్న 4 ఎగుమతి వ్యాపారస్తులకు GST విధానం క్రింద ఎగుమతి విధానంలో ఏదైనా మార్పు ఉందా?

జవాబు వ్యాపారస్తుడు లేదా తయారీదారు ఎగుమతిదారు అనే భావన GST విధానం క్రింద సంబంధం లేని అంశమా. ఎగుమతి కోసం సరఫరాలకు సంబంధించిన విధానం ఎగుమతి వ్యాపారస్తుడు మరియు తయారీదారు ఎగుమతిదారుకు ఇరువురికీ ఒకే విధంగా ఉంటుంది.

ప్రశ్న 5 SEZ యూనిట్‌కు లేదా SEZ సరఫరాదారుకు చేసే సరఫరాలు GST చట్టంలో జీరో రేటెడ్ సరఫరాలుగా పరిగణించబడతాయి. DTA యూనిట్ నుంచి SEZ యూనిట్‌కు లేదా SEZ డెవలప్‌మెంట్‌కు సరఫరాల విషయంలో పన్ను విధించకపోవుట గురించి GST చట్టంలో ఎందుకు నిర్దిష్టంగా పేర్కొనలేదు?

జవాబు అవును. SEZ యూనిట్ లేదా SEZ డెవలపర్‌కు చేసిన సరఫరాలకు రేటు లేదు. SEZ యూనిట్‌కు లేదా SEZ డెవలప్‌మెంట్‌కు చేసిన సరఫరాలను ఎగుమతికోసం చేసిన సరఫరాలుగా అదే విధంగా చేయాలి.

- రిఫండ్ క్లెయిమ్‌ల క్రింద IGST చెల్లింపుపై లేదా ఎటువంటి IGST చెల్లించకుండా బాండ్ లేదా LUT క్రింద.

ప్రశ్న 6 నమోదుకాని సరఫరాదారు నుంచి ఏవేని వస్తువులు లేదా సేవలకు SEZ యూనిట్ లేదా SEZ డెవలపర్ తీసుకున్నప్పుడు, SEZ యూనిట్ లేదా SEZ డెవలపర్ రివర్స్‌చార్జ్ క్రింద IGST చెల్లించవలసి ఉంటుందా లేదా. ఇవి జీరో రేటెడ్ సరఫరాలుగా ఉంటాయా?

జవాబు SEZ యూనిట్ లేదా SEZ డెవలపర్‌కు చేసిన సరఫరాలకు IGST చట్టం క్రింద అంతర్‌రాష్ట్ర సరఫరా హోదా ఇవ్వబడింది. GST చట్టం క్రింద ఏ సరఫరాదారు అయినా అంతర్‌రాష్ట్ర సరఫరాలుగా చేసినట్లయితే GST క్రింద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. SEZ యూనిట్‌కు లేదా SEZ డెవలపర్‌కు ఎవరైనా సరఫరా చేస్తే తప్పనిసరిగా GST నమోదు పొందవలసి ఉంటుంది.

ప్రశ్న 7 GST విధానంలో వస్తువులు లేదా సేవల ఎగుమతి విషయంలో ఎంత త్వరగా రిఫండ్ మంజూరు చేయబడును?

జవాబు (ఎ) ఎగుమతులలో ఉపయోగించిన ఇన్‌పుట్స్‌పై పన్ను రిఫండ్ విషయంలో

- రిఫండ్ దరఖాస్తు అందిన ఏడు రోజులలోగా 90% రిఫండ్ తాత్కాలికంగా మంజూరు చేయబడును.
- అన్ని విధాలా పూర్తి చేసిన దరఖాస్తు అందిన తేదీ నుండి గరిష్టంగా 60 రోజుల కాలంలోగా మిగిలిన 10% చెల్లించబడుతుంది.
- 60 రోజులలోగా పూర్తి రిఫండ్ మంజూరు కానట్లయితే 6% వంతున వడ్డీ ఇవ్వబడును.

(బి) ఎగుమతులపై చెల్లించిన IGST రిఫండ్ విషయంలో : కామన్ పోర్టల్ నుంచి ఎగుమతిదారుచే ఫారం GSTR-3లో చెల్లుబాటు అయ్యే రిటర్న్ దాఖలుకు సంబంధించిన సమాచారం అందిన మీదట రిఫండ్ కోసం క్లెయిమ్‌ను కస్టమ్స్ ప్రాసెస్ చేస్తుంది మరియు ప్రతీ షిప్పింగ్ బిల్లుకు సంబంధించి చెల్లించిన IGSTకి సమానమైన మొత్తం ఎగుమతిదారు బ్యాంక్ ఖాతాకు జమచేయబడుతుంది.

ప్రశ్న 8 నేపాల్ మరియు భూటాన్‌కు చేసిన ఎగుమతులు జీరో రేటెడ్‌గా పరిగణించబడతాయా మరియు దరిమిలా GST విధానం క్రింద జీరో రేటెడ్ సరఫరాలకు లభించే అన్ని ప్రయోజనాలకు అర్హత కలిగి ఉంటాయా?

జవాబు నేపాల్ లేదా భూటాన్‌కు వస్తువుల ఎగుమతి భారతదేశంకు విలువల వస్తువుల తీసుకువెళ్ళడానికి సంబంధించిన GST చట్టం నింబంధనను నెరవేరుస్తుంది. అందువలన, నేపాల్ మరియు భూటాన్‌కు వస్తువుల ఎగుమతి జీరోరేటెడ్‌గా పరిగణించబడుతుంది, తత్ఫలితంగా GST విధానం క్రింద జీరోరేటెడ్ సరఫరాలకు లభించే అన్ని ప్రయోజనాలకు అర్హమవుతుంది. అయితే, GST చట్టంలో 'సేవల ఎగుమతి' నిర్వచనం ప్రకారం అట్టి సర్వీసుల కోసం చెల్లింపును వినిమయ విదేశీ మారకద్రవ్యంలో గౌరవ సరఫరాదారుడు స్వీకరించి ఉండాలి.

ప్రశ్న 9 GST చట్టం క్రింద ఎగుమతి అంటే ఏమిటి? ఏదేని సరఫరాను ప్రభుత్వం భావించిన ఎగుమతిగా శ్రేణీకరించిందా?

జవాబు CGST చట్టం 2017లోని సెక్షను 2(39) క్రింద భావించిన ఎగుమతిని వస్తువుల సరఫరాలుగా నిర్వచించింది. అది సదరు చట్టంలోని సెక్షను 147 క్రింద ప్రకటించబడవచ్చును. సెక్షను 147 క్రింద కౌన్సిల్ సరఫరాలపై ప్రభుత్వం భారతదేశంలో తయారైన వస్తువులు కొన్ని సరఫరాలను, సరఫరా చేసిన వస్తువులు భారతదేశం వదిలి వెళ్ళకపోతే, అట్టి సరఫరాల కోసం చెల్లింపు భారతీయ రూపాయలలో లేదా వినిమయ విదేశీ అందిన సందర్భంలో భావించిన ఎగుమతులుగా ప్రకటించవచ్చును. అయితే, ఈరోజు వరకు ఏ సరఫరాను భావించిన ఎగుమతిగా ప్రభుత్వం ప్రకటించలేదు.

ప్రశ్న 10 GST విధానంలో EOU పథకం నిర్వహణ కొనసాగుతుందా మరియు EOUకు GST చట్టం క్రింద నమోదు చేసుకోవలసి ఉంటుందా?

జవాబు GST క్రింద EOU ఎవరేని ఇతర సరఫరాదారుగా ఉంటుంది మరియు GST చట్టం అన్ని నిబంధనలు వర్తిస్తాయి. అయితే దిగుమతులపై మౌలిక కస్టమ్స్ సుంకం మినహాయింపు ప్రయోజనం కొనసాగుతుంది.

ప్రశ్న 11 GST విధానంలో EOU పథకానికి ఎటువంటి పన్ను ప్రయోజనాలు లభిస్తాయి?

జవాబు GST విధానం క్రింద సుంకం రహిత దిగుమతులు మౌలిక కస్టమ్స్ సుంకానికి పరిమితం చేయబడతాయి. కస్టమ్స్ అదనపు సుంకాల నుంచి మినహాయింపు ఏదైనా ఉంటే కస్టమ్స్ టారిఫ్ చట్టం 1975లోని సెక్షను 3(1), 3(3) మరియు 3(5) క్రింద ఉంటుంది మరియు సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ నుంచి మినహాయింపు సెంట్రల్ ఎక్సైజ్ చట్టంకు నాలుగవ షెడ్యూలు క్రింద పేర్కొనబడిన వస్తువులకు లభించును. IGST లేదా CGST ప్లస్ SGST EOUకు సరఫరాలు చేసే సరఫరాదార్లచే చెల్లించబడుతుంది. దాని సరఫరాదార్లచే చెల్లించిన సదరు GST యొక్క ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకోవడానికి ఏ ఇతర నమోదిత వ్యక్తి వలెనే EOU కూడా అర్హత కలిగి ఉంటుంది.

ప్రశ్న 12 EOUకు లేదా నుంచి సరఫరాలు GST నుంచి మినహాయించబడినవా?

జవాబు లేదు.

- GST చట్టం క్రింద IGST లేదా CGST ప్లస్ SGST EOUకు సరఫరాలు చేసే సరఫరాదార్లచే చెల్లించబడును. దాని సరఫరాదార్లచే చెల్లించిన సదరు GST యొక్క ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకోవడానికి EOUకు అర్హత ఉంటుంది.
- IGST చట్టంలోని సెక్షను 16 క్రింద నిర్వచించిన జీరో రేటెడ్ సరఫరాల విషయంలో అంటే అధీకృత కార్యకలాపాల కోసం SEZ యూనిట్‌కు లేదా SEZ డెవలపర్‌కు భౌతికంగా ఎగుమతి లేదా సరఫరాల రూపంలో EOU చేసిన సరఫరాలు మినహా EOU నుంచి సరఫరాలు GST నుంచి మినహాయించబడవు.

ప్రశ్న 13 GST విధానంలో కస్టమ్స్ సుంకం చెల్లింపు లేకుండా దిగుమతి వస్తువులకు EOU ఎటువంటి విధానాన్ని పాటించాలి?

జవాబు అట్టి దిగుమతి ప్రయోజనాలు వినియోగించుకోడానికి, కస్టమ్స్ (సుంకం రాయితీ రేటులో వస్తువుల దిగుమతి) నిబంధనలు 2017 క్రింద తెలిపిన విధానాన్ని EOUలు పాటించాలి.

ప్రశ్న 14 EOU మరో EOUకు సరుకులను (అంతర్ యూనిట్ బదిలీ) పంపవచ్చునా? అట్టి వస్తువులపై జాబ్‌వర్క్ నిర్వహణకు EOU వస్తువులను పంపవచ్చునా? అట్టి సందర్భాలలో ఏ విధంగా పన్ను చెల్లింపు బాధ్యత విడుదల చేయబడుతుంది?

జవాబు ఒక EOU నుంచి మరో EOUకు వస్తువుల సరఫరా GST చట్టం క్రింద మరో సరఫరాగా పరిగణించబడుతుంది. CGST చట్టం, 2017లోని సెక్షను 143 మరియు CGST నిబంధనలు, 2017లోని రూల్ 45 ప్రకారం EOU జాబ్‌వర్క్ కోసం వస్తువులను పంపవచ్చును మరియు ఆ మేరకు పన్ను చెల్లింపు బాధ్యత విడుదల చేయబడుతుంది.

ప్రశ్న 15 మెసర్స్ XYZ వస్తువుల ఎగుమతిలో నిమగ్నమై ఉంది. సుమారు 5 కోట్ల ఎగుమతులు కలిగి ఉంది మరియు స్వదేశీ వినియోగానికి క్లియరెన్సులు ప్రభావం చూపించలేదు. మెసర్స్ XYZ సెంట్రల్ ఎక్సైజ్ క్రింద నమోదు చేసుకోవలసిన లేదు. మెసర్స్ XYZ GST క్రింద తనంతటతానుగా నమోదు చేసుకోవలసి ఉంటుందా?

జవాబు అవును, ఎందుకంటే ఎగుమతులు IGST చట్టం క్రింద అంతర్‌రాష్ట్ర సరఫరాలుగా పరిగణించబడతాయి.

ప్రశ్న 16 మేము ఎగుమతి కోసం మినహాయించిన ఎక్జిబిషన్ వస్తువుల తయారీదారులుగా ఉన్నాము. మేము ఎగుమతి వస్తువుల తయారీలో ఉపయోగించిన ఇన్‌పుట్ స్టేజ్ రిబేటును వినియోగించుకున్నాము. మా సరఫరా మినహాయించిన సరఫరాగా ఉంటే GST చట్టం క్రింద మా కేసును ఎలా పరిగణించాలి?

జవాబు IGST చట్టం క్రింద వస్తువుల ఎగుమతిలో నిమగ్నమై ఉన్న వ్యక్తి అది మినహాయించిన సరఫరా అయితే జీరో రేటెడ్ సరఫరాల కోసం ఇన్‌పుట్ స్టేజ్ క్రెడిట్ వినియోగించుకోవడానికి అర్హులవుతారు. ఒకసారి వస్తువుల ఎగుమతి చేయబడితే వినియోగించుకున్న క్రెడిట్ రిఫండ్ IGST చట్టం 2017లోని సెక్షను 16(3)(ఎ) మరియు CGST చట్టం 2017లోని సెక్షను 54 క్రింద మరియు అందులోని నిబంధనల క్రింద వినియోగించుకుంటారు.

ప్రశ్న 17 మేము వివిధ ప్రాడక్ట్స్‌లో వ్యాపారం నిర్వహించే ఎగుమతి వ్యాపారులం. (ప్రస్తుత విధానం ప్రకారం CT1/ARE1పై నిర్దిష్టమైన ఫ్యాక్టరీ నుంచి మేము వస్తువులను కొనుగోలు చేశాము. అందువలన మాకు ఎక్సైజ్ విధించబడలేదు. వస్తువుల ఎగుమతి తర్వాత సంబంధిత ఫ్యాక్టరీకి మేము ఎగుమతి రుజువు మరియు ఫారం H (అమ్మకం పన్ను మినహాయింపుకోసం) ఇచ్చాము. మాపై GST ప్రభావం ఎలా ఉంటుంది మరియు ఇప్పుడు చేయవలసిన ప్రక్రియ ఏమిటి?

జవాబు GST విధానంలో పన్ను విధించతగిన అంశం వస్తువుల సరఫరా. ఎగుమతులు అంతర్‌రాష్ట్ర సరఫరా అయిన సందర్భంలో, మీరు GST నమోదు చేయించుకోవలసి ఉంటుంది. తయారీదారు వర్తించు విధంగా CGST మరియు SGST/UT GST చెల్లింపుపై మీకు వస్తువులను సరఫరా చేస్తారు. మీరు వస్తువులు మరియు సేవలపై చెల్లించిన పన్ను ఇన్‌పుట్ స్టేజ్ క్రెడిట్‌ను వినియోగించు కోవచ్చును మరియు బాండ్/ LUT క్రింద వస్తువులను ఎగుమతి చేయవచ్చును. వినియోగించిన క్రెడిట్‌ను రిఫండ్‌గా వినియోగించుకోవచ్చును. ప్రత్యామ్నాయంగా సమీకృత పన్ను చెల్లింపుపై మీరు వస్తువులను ఎగుమతి చేయవచ్చును మరియు సమీకృత పన్ను రిఫండ్ మీకు లభిస్తుంది.

ప్రశ్న 18 GST అమలులోకి వచ్చిన తేదీన నా వద్ద ఇన్‌పుట్స్, సెమీఫినిష్డ్ గూడ్స్ మరియు ఫినిష్డ్ గూడ్స్ స్టాక్స్ ఉన్నాయి. అయితే నా వద్ద సుంకం చెల్లించే దాఖలు/మెంట్లు లేవు. GST కి ముందు సదరు ఇన్‌పుట్స్, సెమీఫినిష్డ్ మరియు ఫినిష్డ్ గూడ్స్ పైన చెల్లించిన పన్నుల కొరకు GST అమలుచేసిన తర్వాత చేసిన ఎగుమతుల కోసం నాకు పరిహారం ఏ విధంగా అందజేస్తారు?.

జవాబు లోటు వినియోగించుకునేందుకు మూడు నెలల మార్పు కాలం ఇవ్వబడింది. ఈ కాలంలో ఎగుమతుల కోసం హెచ్చురేటు గల డ్యూటీ డ్రాబ్యాక్ (కాంపోజిట్ AIR) క్లెయిమ్ చేసిన CGST, GST యొక్క ITC లేని నిబంధనలకు లోబడి క్లెయిమ్ చేసిన ఎగుమతి వస్తువులపైన చెల్లించిన IGST రిఫండ్ ఇవ్వబడదు మరియు CENVAT క్రెడిట్ ముందుకు తీసుకెళ్లబడదు.

ప్రశ్న 19 నేను SEZ యూనిట్లు మరియు డెవలపర్స్‌కు ఎగుమతి వస్తువుల సరఫరా చేస్తాను. అట్టి సరఫరాల కోసం స్వీకర్తకు లేదా నాకు (స్వీకర్త ఒకవేళ డిస్‌క్లైమర్ ఇస్తే) ప్రస్తుతం డ్రాబ్యాక్ అందుబాటులో ఉంది. GST విధానం క్రింద అట్టి డ్రాబ్యాక్ స్థితి ఏంటి?

జవాబు DTA సరఫరాదారుచే డ్రాబ్యాక్ క్లెయిమ్ చేసే విజానికి మార్పు ఏది ఉండదు. జ్యూరిస్‌డిక్షనల్ కస్టమ్స్ అథారిటీల వద్ద క్లెయిమ్ దాఖలు చేయాలి.

ప్రశ్న 20 DTA లో EOU వస్తువులను విడిపిస్తుందా?

జవాబు అవును. విదేశీ వ్యాపార విధానంలో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా DTA లో EOU వస్తువులను విడిపించుకోవచ్చును.

ప్రశ్న 21 నమోదుకాని వ్యక్తులు (నమోదుకాని జాబ్ వర్కర్స్‌తో సహా) నుండి సేకరించిన వస్తువుల విషయంలో ఎగుమతిదారు GST చెల్లించవలసి ఉంటుందా?

జవాబు నమోదుకాని వ్యక్తిచే (నమోదుకాని జాబ్ వర్కర్స్‌తో సహా) సరఫరా ఉన్నట్లయితే నమోదిత వ్యక్తి అంటే ఎగుమతిదారు రివర్స్ చార్జ్ మెకానిజం క్రింద GST చెల్లించుటకు బాధ్యులౌవుతారు. అయితే ఎగుమతిదారు చెల్లించిన అట్టి GSTలో ITCని వినియోగించుకోవచ్చును మరియు ITC ఉపయోగించుకోవచ్చును లేదా దాని రిఫండ్ క్లెయిమ్ చేయవచ్చును.

ప్రశ్న 22 విదేశీ కొనుగోలుదార్ల ఏజెంట్లు కొనుగోలు చేసిన ఆర్జనలపై ఏజెన్సీ కమీషన్‌పై GST చెల్లించాలా?

జవాబు అవును. భారతదేశంలోని ఏజెంట్లు ద్వారా కమీషన్ పొందుతున్నందున మరియు సర్వీసు సరఫరా ప్రదేశం భారతదేశంలో ఉన్నందున GST చెల్లించాలి.

GST అమలుపై ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ స్కీమ్ మార్పు

ప్రశ్న 1 GST విధానం క్రింద డ్యూటీ డ్రాబ్యాక్ స్కీమ్ కొనసాగించబడునా? అవును. అయితే డ్రాబ్యాక్ రేట్లు ఎంత?

జవాబు అవును. GST విధానం క్రింద కొన్ని మార్పులతో డ్యూటీ డ్రాబ్యాక్ స్కీమ్ కొనసాగించబడును. సదరు పథకం క్రింద మార్పులు దిగువ విధంగా ఉంటాయి:

- క్యాప్టివ్ పవర్ జనరేషన్ కోసం ఇంధనం లేదా ఇన్‌పుట్స్‌గా ఉపయోగించబడి సెంట్రల్ ఎక్సైజ్ చట్టం 1944 (నిర్దిష్టమైన పెట్రోలియం ఉత్పత్తులు, టుబాకో మొ॥) కు నాలుగు షెడ్యూల్‌లో పేర్కొన్న ఐటంలపై సెంట్రల్ ఎక్సైజ్ సుంకం మరియు దిగుమతి చేసుకున్న ఇన్‌పుట్స్‌పై కస్టమ్స్ సుంకాలు మాత్రమే డ్రాబ్యాక్ కోసం లభిస్తాయి.
- ఎగుమతి సౌకర్య చర్యగా మూడు నెలల మార్పు కోసం జూలై నుండి సెప్టెంబర్ 2017 వరకు అధిక కాంపోజిట్ రేట్ల వంతున డ్రాబ్యాక్ మంజూరు కోసం కొనసాగించబడుతుంది. అది కొన్ని పరిరక్షణలకు లోబడి ఉంటుంది. అంటే డ్రాబ్యాక్ అత్యధిక రేటు క్లెయిమ్ చేసేందుకు ఎగుమతిదారు క్లెయిమ్ చేసిన CGST/IGST యొక్క ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ITC) లేదని, క్లెయిమ్ చేసిన ఎగుమతి వస్తువులపై IGST రిఫండ్ చెల్లించలేదని మరియు CENVAT క్రెడిట్ ముందుకు తీసుకెళ్లలేదని డిక్లరేషన్ ఇవ్వాలి.
- అట్టి డిక్లరేషన్ లేకపోతే డ్రాబ్యాక్ యొక్క కస్టమ్స్ స్థితికి డ్రాబ్యాక్ పరిమితి చేయబడును.

ప్రశ్న 2 GST పైన ఎగుమతిదారు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వినియోగించుకోకపోయినా లేదా ఎగుమతిచేసిన వస్తువులపై చెల్లించిన IGST రిఫండ్ పొందకపోయినా అధిక ఆల్ ఇండస్ట్రీ రేట్ (AIR) వంతున డ్రాబ్యాక్ వర్తిస్తుందా?

జవాబు లేదు. 30 సెప్టెంబర్, 2017 తర్వాత ఎగుమతి కోసం సరఫరా చేసే వస్తువుల కోసం దిగుమతిచేసుకున్న వస్తువులపై చెల్లించిన కస్టమ్స్ సుంకాలపై ఆధారపడి అతితక్కువ రేటు వంతున మాత్రమే అనుమతించబడే డ్రాబ్యాక్ నిర్ణయించబడును.

ప్రశ్న 3 GST కి ముందుకాలం నుండి ఇన్‌పుట్స్ మరియు GST చెల్లించిన ఇన్‌పుట్స్ స్టాక్ ఎగుమతిదారు కలిగిఉన్న మరియు ఎగుమతి చేసే వస్తువులలో రెండు లాట్ల నుండి ఇన్‌పుట్స్ వినియోగించుకున్న అట్టి ఎగుమతులపై డ్రాబ్యాక్ ఎంత?

జవాబు 30 సెప్టెంబర్, 2017 వరకు గల మార్పు కాలంలో క్లెయిమ్ చేసిన CGST/IGST లో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ITC) లేదని, ఎగుమతిచేసిన వస్తువులపై చెల్లించిన IGST రిఫండ్ క్లెయిమ్ చేయలేదని మరియు CENVAT క్రెడిట్ ముందుకు తీసుకెళ్లలేదని తెలిపే నిబంధనలకు లోబడి అత్యధిక రేటు వంతున డ్రాబ్యాక్ వినియోగించుకోవచ్చును.

ప్రశ్న 4 GST అమలుకాకముందు చేసిన ఎగుమతులకు సంబంధించి సెంట్రల్ ఎక్సైజ్ సుంకం మరియు సర్వీసు ట్యాక్స్ కోసం డ్రాబ్యాక్ బ్రాండ్ రేటు వర్తిస్తుందా అందుకుగాను 1 జూలై, 2017 తర్వాత దరఖాస్తు దాఖలు చేయాలా?

జవాబు 1 జూలై, 2017కు ముందు చేసిన ఎగుమతుల కోసం ఇంతకుముందరి చట్టం ((CGST) చట్టం 2017లోని సెక్షన్ 2 (48)లో "ప్రస్తుతం ఉన్న చట్టంగా నిర్వహించబడింది") క్రింద డ్రాబ్యాక్ స్కీమ్ ప్రకారం బ్రాండ్ రేటు నిర్ణయించడానికి దరఖాస్తును 1 జూలై, 2017 తర్వాత కూడా దాఖలు చేయవచ్చును.

ప్రశ్న 5 ఎగుమతి చేయబడే వస్తువులు తయారుచేసే ఫ్యాక్టరీ ఉన్న అధికార పరిధిలో సెంట్రల్ ఎక్సైజ్ జ్యూరీష్‌డిక్షనల్ కమిషనర్ వద్ద ఉపయోగించిన బ్రాండ్ నిర్ణయించడానికి దరఖాస్తులు చేయాలా. GST విధానం క్రింద బ్రాండ్ రేటు నిర్ణయించడానికి దరఖాస్తు దాఖలు చేయడానికి సంబంధించి ఏదైనా మార్పు ఉందా?

జవాబు 1 జూలై, 2017 నుండి వర్తింపుతో బ్రాండ్ రేటు నిర్ణయించడానికి దరఖాస్తులను వస్తువుల ఎగుమతి ప్రదేశం పైన జ్యూరీష్‌డిక్షన్ గల కమిషన్ ఆఫ్ కస్టమ్స్ అంటే పోర్ట్/ఎయిర్‌పోర్ట్/ ICD మొదలైనవి గల అంటే షిప్పింగ్ బిల్స్ దాఖలు చేసిన చోట దాఖలు చేయాలి. ఇది 1 జూలై, 2017కు ముందు ఎగుమతులు చేసినప్పటికీ అందుకుగాను దరఖాస్తు ఇంకా దాఖలు చేయాల్సి ఉన్నప్పటికి వర్తిస్తుంది. ఒకవేళ ఎగుమతులు బహుళప్రదేశాల నుండి ఉంటే వస్తువుల ఎగుమతి ప్రదేశాలలో ఎక్కడైనా ఉన్నవాటిపై జ్యూరీష్‌డిక్షన్ గల కస్టమ్స్ కమిషర్ వద్ద దరఖాస్తు దాఖలు చేయాలి.

ప్రశ్న 6 SEZ యూనిట్స్ మరియు SEZ డెవలపర్స్‌కు సరఫరాలు చేయడానికి డ్రాబ్యాక్ బ్రాండ్‌రేటు నిర్ణయించడానికి దరఖాస్తు దాఖలు సంబంధించి GST విధానం క్రింద ఏదైనా మార్పు కూడా ఉందా?

జవాబు 1 జూలై, 2017 కు ముందు SEZ యూనిట్లు మరియు SEZ డెవలపర్స్‌కు సరఫరాలు చేసేందుకు బ్రాండ్‌రేటు నిర్ణయించడానికి దరఖాస్తులను సెంట్రల్ ఎక్సైజ్ జ్యూరీష్‌డిక్షనల్ కమిషనర్‌కు దాఖలు చేయాల్సి ఉంటుంది. 1 జూలై 2017 నుండి వర్తింపుతో బ్రాండ్‌రేటు నిర్ణయించడానికి దరఖాస్తులను DTA సరఫరాదారు యొక్క ప్రధాన వ్యాపార ప్రదేశం అధికార పరిధిలో ఉన్న కస్టమ్స్ కమిషనర్‌కు దాఖలు చేయాలి. 1 జూలై 2017కు ముందు ఎగుమతులు చేసినప్పటికీ ఇది వర్తిస్తుంది. అందుకుగాను బ్రాండ్‌రేటు నిర్ణయించడానికి దరఖాస్తును దాఖలు చేయాల్సి ఉంటుంది.

ప్రశ్న 7 దిగుమతి చేసుకున్న వస్తువుల తిరిగి ఎగుమతిపై ఇందుకు సంబంధించి నిర్ణయించిన రేట్ల ప్రకారం ఇంతకుముందు వర్తించే విధంగా దిగుమతి సమయంలో చెల్లించిన అన్ని సుంకాల డ్రాబ్యాక్ వర్తించేది. 1 జూలై 2017కు ముందు దిగుమతి చేసుకున్న వస్తువులను 1 జూలై 2017 తర్వాత తిరిగి ఎగుమతిచేసిన వాటికి సంబంధించిన స్థితి ఏమిటి? 1 జూలై 2017 తర్వాత IGST మరియు పరిహార సెస్ దిగుమతి చేసుకున్న వస్తువులపై కూడా చెల్లించబడింది. అట్టి దిగుమతి చేసుకున్న వస్తువులపై IGST మరియు పరిహార సెస్ చెల్లిస్తే, తిరిగి ఎగుమతి చేస్తే IGST మరియు పరిహార సెస్ డ్రాబ్యాక్ కూడా మంజూరు చేయబడుతుందా?

జవాబు దిగుమతి సమయంలో చెల్లించిన సుంకాల కోసం కస్టమ్స్ చట్టం 1962లోని సెక్షన్ 74 క్రింద డ్రాబ్యాక్ లభిస్తుంది. అందువలన వస్తువులు దిగుమతి చేసుకున్న సమయంలో చెల్లించిన సుంకాలు/పన్నులు, వాటి డ్రాబ్యాక్ మంజూరు చేయబడుతుంది. 1 జూలై 2017కు ముందుగా దిగుమతి చేసుకున్న వస్తువులపై చెల్లించిన బేసిక్ కస్టమ్స్ డ్యూటీ డ్రాబ్యాక్ + కస్టమ్స్ అదనపు డ్యూటీ (CVD) + ప్రత్యేక అదనపు డ్యూటీ (SAD) 1 జూలై 2017 తర్వాత తిరిగి ఎగుమతి చేసినప్పటికీ చెల్లించవలెను. అదే విధంగా 1 జూలై 2017 తర్వాత దిగుమతి చేసుకున్న వస్తువుల విషయంలో బేసిక్ కస్టమ్స్ డ్యూటీ+IGST +పరిహార సెస్ చెల్లించవలెను. మరియు వీటన్నింటి డ్రాబ్యాక్ అట్టి దిగుమతి చేసుకున్న వస్తువుల తిరిగి ఎగుమతిపై చెల్లించవలెను.

ప్రశ్న 8 GST విధానం క్రింద అడ్వాన్స్ ఆథరైజేషన్ స్కీమ్, EPCG స్కీమ్ మరియు డ్యూటీ క్రెడిట్ స్క్రిప్స్ అంటే మర్చంటైజ్ ఎక్స్‌పోర్ట్స్ ఫ్రమ్ ఇండియా స్కీమ్ (MEIS) మరియు సర్వీసు ఎక్స్‌పోర్ట్ ఫ్రమ్ ఇండియా స్కీమ్ (SEIS) క్రింద లభించే అన్ని డ్యూటీల నుంచి మినహాయింపు ప్రయోజనం కొనసాగుతుందా?

జవాబు 1 జూలై 2017 తర్వాత IGST విధించదగు వస్తువుల విషయంలో బేసిక్ కస్టమ్స్ డ్యూటీ, సేఫ్‌గార్డ్ డ్యూటీ, ట్రాన్సిషనల్ ప్రొడక్ట్ స్పెసిఫిక్ సేఫ్‌గార్డ్ డ్యూటీ మరియు యాంటీ-డంపింగ్ డ్యూటీ మాత్రమే సదరు అన్ని పథకాల క్రింద ప్రయోజనాలు పరిమితం చేయబడతాయి. సెంట్రల్ ఎక్సైజ్ చట్టం 1944కు నాలుగవ షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన ఐటంల కోసం (నిర్ధారిత పెట్రోలియం ఉత్పత్తులు, పొగాకు మొ॥) కోసం కస్టమ్స్ టారిఫ్ చట్టం 1975లోని సెక్షన్ 3(1), 3(3) మరియు 3(5) క్రింద విధించే అదనపు డ్యూటీ నుంచి మినహాయింపు లభిస్తుంది.

ప్రశ్న 9 GST విధానం క్రింద EPCG ఆథరైజేషన్ ఉపయోగిస్తూ మేము ఉత్పాదక వస్తువులను దిగుమతి చేసుకుంటే మేము డ్యూటీ రహిత ప్రయోజనం (మినహాయించబడిన అన్ని డ్యూటీలు) పొందగలమా?

జవాబు EPCG ఆథరైజేషన్ క్రింద చేసిన దిగుమతులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ మాత్రమే మినహాయించబడును. EPCG హోల్డర్ ఉత్పాదక వస్తువుల దిగుమతిపై IGST చెల్లించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందవలసి ఉంటుంది.

ప్రశ్న 10 మర్చంటైజ్ ఎక్స్‌పోర్ట్స్ ఫ్రమ్ ఇండియా స్కీమ్ (MEIS) మరియు సర్వీసు ఎక్స్‌పోర్ట్స్ ఫ్రమ్ ఇండియా స్కీమ్ (SEIS) వంటి డ్యూటీ క్రెడిట్ స్క్రిప్స్‌ను GST చెల్లింపును ఉపయోగించవచ్చునా?

జవాబు లేదు. MEIS మరియు SEIS స్క్రిప్స్‌ను GST విధానం క్రింద దిగుమతుల కోసం GST క్రింద కవర్ చేయబడని ఐటంలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ లేదా అదనపు కస్టమ్స్ డ్యూటీల చెల్లింపు కోసం మాత్రమే ఉపయోగించవచ్చును.

ప్రశ్న 11 1.7.2017 కంటే ముందు జారీ చేసిన మరియు 1.7.2017న ఉపయోగించకుండా ఉన్న వివిధ ఆథరైజేషన్లు/స్క్రిప్‌ల కోసం మినహాయింపు లభిస్తాయా?

జవాబు GST చట్టం క్రింద మినహాయింపు ఇవ్వబడలేదు. FTP లోని చాప్టర్ 3లో ఎక్స్‌పోర్ట్ ఇన్సెంటివ్ పథకాల క్రింద ఎగ్జిమ్ స్క్రిప్‌లు (ఉదాహరణకు MEIS మరియు SEIS) దిగుమతి సమయంలో GST చే కవర్‌చేయబడని ఐటంలపై కస్టమ్స్ డ్యూటీలు లేదా అదనపు కస్టమ్ డ్యూటీల చెల్లింపు కోసం ఉపయోగించవచ్చును. ఈ స్క్రిప్‌లను సమీకృత పన్ను మరియు పరిహార సెస్ చెల్లింపు కోసం ఉపయోగించరాదు. అదే విధంగా, డొమెస్టిక్ సేకరణల కోసం CGST, SGST లేదా IGST చెల్లింపు కోసం ఉపయోగించరాదు.

గమనిక : CGST చట్టం, 2017కు నిర్దేశంలో SGST చట్టం, 2017 మరియు UTGST చట్టం, 2017కు నిర్దేశం కూడా చేర్చబడి ఉంది.

davp 15502/13/0149/1718

డిస్‌క్లెయిమర్: పైన ఇవ్వబడిన సమాధానాలు అవగాహనకు మరియు మార్గదర్శకత్వం నిమిత్తం మాత్రమే ఇవ్వబడినవి మరియు దానికి ఎటువంటి చట్టబద్ధమైన చెల్లుబాటు ఉండదు.

GST - ఉత్తమమైన & సరళమైన పన్ను

ఏదేని GST సంబంధిత విచారణ కొరకు @askGST_GoI వద్ద మాకు ట్వీట్ చేయండి
హెల్ప్ డెస్క్ : 1800-1200-232, 0120-4888999

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ మరియు కస్టమ్స్ & రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాల వాణిజ్య పన్నుల శాఖలు
www.cbec.gov.in, www.cbec-gst.gov.in

✦ రాజీనామా చేసి డిపాజిట్ తెచ్చుకో



మంత్రి కేటీఆర్‌కు దాసోజు సవాల్

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్లలో దళితులపై దాడిని సమర్థించుకుంటున్న మంత్రి కేటీఆర్‌కు దమ్ముంటే రాజీనామా చేసి, ఎన్నికల్లో డిపాజిట్ తెచ్చుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ సవాల్ చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మీరాకుమార్ పర్యటనతో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు ఎక్కడ తగలాలో అక్కడే తగిలినట్టుందన్నారు. కేటీఆర్‌కు ప్రజాస్వామ్యం మీద, రాజ్యాంగం మీద గౌరవం ఉన్నదా అని ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో పోలీసులు ఇలాగే వ్యవహరించారా, కిడ్నీలు పాడయ్యే విధంగా హింసించారా అని ప్రశ్నించారు. కేటీఆర్ రాజీనామా చేసి గెలవాలని, డిపాజిట్ వస్తే ముక్కు నేలకు రాస్తానని దాసోజు శ్రవణ్ సవాల్ చేశారు.

✦ టీఆర్‌ఎస్‌లోని దళిత నేతలపై కుట్ర: మల్లు



సాక్షి, హైదరాబాద్: దళితులకు వ్యతిరేకంగా మాట్లాడించడం ద్వారా టీఆర్‌ఎస్‌లోని దళిత నేతలపై రాజకీయకుట్ర జరుగుతున్నదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి హెచ్చరించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, దళితులకు రాజ్యాంగం ఇచ్చిన అవకాశంతో చట్టసభలకు ఎంపికైన ఎంపీ బాల్క సుమన్, టి.రాజయ్య, గువ్వల బాలరాజు వంటివారు దళితులపై దాడిని సమర్థిస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ దాడిపై ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. టీఆర్‌ఎస్‌లోని దళిత నేతలను దళిత వర్గానికి దూరం చేసే కుట్ర జరుగుతున్నదని హెచ్చరించారు.

✦ ప్రభుత్వంపై విషం కక్కుతున్న కాంగ్రెస్

మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వంపై పోరాడటానికి ఏ అంశమూ దొరక్క.. కాంగ్రెస్ నాయకులు సమస్యే కాని దాన్ని సమస్యగా చిత్రీకరించి ప్రభుత్వంపై, మంత్రి కేటీఆర్‌పై విషం కక్కుతున్నారని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. మీరాకుమార్‌ను సిరిసిల్లకు రప్పించి కాంగ్రెస్ నేతలు డ్రామాకు తెరలేపారని దుయ్యబట్టారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మూడేళ్లలో దళితులు, గిరిజనులపైనే కాకుండా ఏ ఒక్క వర్గం వారిపైనా చిన్న దాడి జరగలేదని, తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నాలను తిప్పికొడతామని స్పష్టం చేశారు.

✦ దళితుల అభివృద్ధిపై చర్చకు సై

పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కు ఐడీసీ చైర్మన్ శంకర్‌రెడ్డి సవాల్



సాక్షి, హైదరాబాద్: టీఆర్‌ఎస్ ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన దళితుల అభివృద్ధిపై సిరిసిల్ల కేంద్రంలో చర్చించేందుకు తాను సిద్ధమని ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ (ఐడీసీ) ఈద శంకర్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సవాల్ విసిరారు. కేవలం ప్రభుత్వాన్ని బద్నాం చేయాలన్న ఎజెండాతో సిరిసిల్ల ఘటనను కాంగ్రెస్ పెద్దది చేస్తోందని విమర్శించారు. రాజకీయ పలుకుబడి కోసమే కాంగ్రెస్ సిరిసిల్ల అంశాన్ని జాతీయ అంశంగా చిత్రించే ప్రయత్నం చేస్తోందన్నారు.

✦ కాంగ్రెస్ జిమ్మిక్కులను దళితులు నమ్మరు



టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

సాక్షి, హైదరాబాద్: దళితులపట్ల ఎంతగా మొసలికన్నీరు కార్చినా కాంగ్రెస్ పార్టీని దళితులు నమ్మరని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. మీరాకుమార్‌ను ఇక్కడికి తీసుకువచ్చి తెలంగాణ కాంగ్రెస్ నేతలు దళితులను అవమానించారని మండిపడ్డారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్న భయంతోనే కాంగ్రెస్ ఇసుక మాఫియా అంటూ ఆరోపణలు చేయడం మొదలుపెట్టిందన్నారు.

✦ కాంగ్రెస్‌వి దిగజారుడు ఆరోపణలు

టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ మండిపాటు



సాక్షి, హైదరాబాద్: మూడేళ్ల టీఆర్‌ఎస్ పాలనను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నేతలు దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. తెలంగాణకు పేరు ప్రతిష్టలు రావడాన్ని కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని దుయ్యబట్టారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అసలు తెలంగాణ రావడమే తప్పన్నట్టుగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో భూకబ్జాలన్నీ కాంగ్రెస్ చలవేనని, ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా చొరవ తీసుకుని భూ కుంభకోణాలను వెలికితీసి ప్రక్షాళనకు నడుం బిగించారన్నారు. మాఫియాను, క్లబ్బులను, పబ్బులను పెంచి పోషించిన సంస్కృతి కాంగ్రెస్, టీడీపీలదేనని ఆరోపించారు.

✦ రుణాల అవకతవకలపై విచారణ: పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని ఐవోబీ రుణాల్లో పెద్దఎత్తున కుంభకోణం జరిగిందని, దీనిపై సీబీసీఐడీతో విచారణ జరిపించాలని శాసనమండలిలో కాంగ్రెస్ ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ భూమి ఒకరిదైతే రుణాలు వేరేవాళ్లకు ఇచ్చారని ఆరోపించారు. మధ్యదళారీలు, బ్యాంకు అధికారులు కలసి రైతుల సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. రైతు రుణాలపై ఐఏఎస్ అధికారిని నియమించి, పర్యవేక్షణ జరిపించాలని పొంగులేటి కోరారు. డ్రగ్స్ కేసులో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

✦ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా

కేంద్రాన్ని కోరిన దళిత క్రైస్తవుల హక్కుల సమితి

సాక్షి, న్యూఢిల్లీ: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని అఖిల భారత దళిత క్రైస్తవుల హక్కుల సమితి డిమాండ్ చేసింది. ఈ సంఘం జాతీయ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం దళిత క్రైస్తవుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. కేసీఆర్ కేబినెట్‌లో క్రైస్తవులను చేర్చుకోలేదని, కార్పొరేషన్‌కు నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. క్రైస్తవుల స్థితిగతులను అధ్యయనం చేయడానికి కమిటీ ఏర్పాటు చేస్తామన్న ఎన్నికల హామీని ఇంకా అమలు చేయలేదన్నారు.

✦ బీఫార్మసీలో అన్ని సీట్లు భర్తీ

సాక్షి, హైదరాబాద్: బీఫార్మసీ, ఫార్మ్-డి, బయోటెక్నాలజీ కోర్సుల్లో అన్ని సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్రంలోని 174 కాలేజీల్లోని 7,367 సీట్లను ఎంసెట్ బైపీసీ విద్యార్థులతో భర్తీ చేసేందుకు ప్రవేశాల కమిటీ గత నెల 27 నుంచి 30 వరకు కౌన్సెలింగ్ నిర్వహించింది. ఇందులో 12,250 మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోగా, వారికి మంగళవారం ప్రవేశాల కమిటీ సీట్లను కేటాయించింది. సీట్లు పొందిన విద్యార్థులు వెబ్‌సైట్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించింది. ఈనెల 7లోగా ఫీజు చెల్లించాలని (ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించని వారు) పేర్కొంది. 9వ తేదీలోగా కాలేజీల్లో చేరాలని పేర్కొంది. చివరి దశ కౌన్సెలింగ్ పూర్తయ్యే వరకు కాలేజీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వవద్దని తెలిపింది.

✦ సీపీఎస్ రద్దు కోసం దశలవారీ ఉద్యమం

సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కోసం దశల వారీ ఉద్యమం చేపట్టనున్నట్లు సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం వెల్లడించింది. ఇందులో భాగంగా ఈ నెల 2, 3, 5 తేదీల్లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని, 5న మండల తహసీల్దార్లకు విజ్ఞాపనపత్రాలు అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. 10న కలెక్టర్లకు విజ్ఞాపనపత్రాలు అందజేయాలని, అదే రోజు జిల్లా కేంద్రాల్లో మహా ధర్నాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించి, సెప్టెంబరు 1న చలో హైదరాబాద్, మహా ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

స్కెచ్ విక్రమ్‌దే..!

తనపై కాల్పులకు పథకం రచించింది విక్రమ్‌గౌడే

- అమలులో పెట్టేందుకు సహకరించిన సన్నిహితుడు
- విక్రమ్‌ను నిందితునిగా చేర్చిన పోలీసులు
- మంగళవారం నాటికి అదుపులో నలుగురు నిందితులు
- తుపాకీ కొత్తచెరువులో పారేసినట్లు అనుమానాలు



సాక్షి, హైదరాబాద్

మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్ నివాసంలో శుక్రవారం జరిగిన కాల్పుల కేసు కొలిక్కి వచ్చింది. ఈ 'ఆపరేషన్'కు పథకరచన చేసింది విక్రమ్‌గౌడేనని దర్యాప్తులో వెలుగులోకి వచ్చిందని తెలిసింది. విక్రమ్‌కు సన్నిహితంగా ఉండే నందు అనే వ్యక్తి ఈ పథకం అమలులో సూత్రధారిగా వ్యవహరించినట్టు వెల్లడైందని సమాచారం. పథకాన్ని మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన నిందితులు అమలు చేయగా.. మంగళవారం నాటికి పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ కేసులో బాధితుడిగా ఉన్న విక్రమ్‌గౌడ్‌ను పోలీసులు నిందితుడిగా మార్చారు.

నందూకు స్కెచ్ అమలు బాధ్యతలు

తనపై ఎవరైనా తుపాకీతో కాల్చడం ద్వారా హత్యాయత్నం చేస్తే.. సానుభూతితో కుటుంబం దగ్గర కావడం, భయంతో ఫైనాన్షియర్లు కొన్ని నెలల పాటు తన దగ్గరకు రాకుండా ఉండటం జరుగుతుందని విక్రమ్ భావించారు. దీన్ని అమలులో పెట్టే బాధ్యత తన్ని తనతో సన్నిహితంగా ఉండే నందూ అనే వ్యక్తికి అప్పగించారు. ముందుగా లోకల్ షూటర్ల గురించి ఆరా తీసినా వారు ప్రొఫెషనల్ షూటర్లు కాదనే కారణంతో వెనక్కి తగ్గారు. చివరికి నందు తనకు ఉన్న పాత పరిచయాల నేపథ్యంలో అనంతపురానికి చెందిన ముఠాను సంప్రదించారు. విక్రమ్‌కు ఎలాంటి ప్రాణహానీ లేకుండా కాల్పులు జరిపి వెళితే ఒక్కొక్కరికీ రూ.50 వేలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ 'ఆపరేషన్'కోసం అనంతపురం ముఠా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన వారిని రంగంలోకి దింపింది.

చివరి నిమిషంలో మారిన ప్లేస్..

తొలుత వేసుకున్న ప్లాన్ ప్రకారం విక్రమ్‌పై కాల్పులు బయటి ప్రాంతంలో ఎక్కడైనా జరగాల్సి ఉంది. ఈ మేరకు నిందితులు రెక్కీ సైతం పూర్తి చేసి తమ ప్రాంతాలకు వెళ్లిపోయారు. అయితే బహిరంగ ప్రదేశంలోనో, రోడ్డు పైనో ప్లాన్ అమలు చేస్తే సీసీ కెమెరాలతో పాటు ఇతర ఆధారాలు లభించే అవకాశాలు ఉండటంతో 'ప్లేస్'ను విక్రమ్ ఇంటికే మార్చారు. రోడ్డుపై జన సంచారం తక్కువగా ఉంటుందనే తెల్లవారుజాము సమయాన్ని ఎంచుకున్నారు. ప్లాన్ అమలు కోసం ఇంట్లోని సీసీ కెమెరాలను విక్రమ్ ముందుగానే తొలగించినట్టు తెలుస్తోంది. ఇక నిందితులకు అవసరమైన వాహనాన్ని నందూ సమకూర్చినట్లు సమాచారం. కాల్పులకు రెండు రోజుల ముందు షూటర్లతో కలసి విక్రమ్ పార్టీ చేసుకున్నారు. ఈ సందర్భంగా తనకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మూడు రౌండ్లు కాల్చాలని సూచించారు.

ప్లాన్ అమలు..

అప్పటికే పలుమార్లు రెక్కీ పూర్తి చేసుకున్న నిందితులు శుక్రవారం ఉదయం అనంతపురం నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. నందూ సమకూర్చిన వాహనంపై విక్రమ్ ఇంటి దగ్గరకు వెళ్లారు. ఒకరు బయటే వేచి ఉండగా.. మరొకరు ఇంట్లోకి వెళ్లి మొదట ఒక రౌండ్ కాల్చాడు. విక్రమ్ చెప్పడంతోనే రెండో రౌండ్ సైతం కాల్చి పారిపోయారు. వీరికి సహకరించిన మరో నిందితుడు ఆ ఇంటికి కొద్దిదూరంలో వేచి ఉన్నట్లు తెలుస్తోంది. కాల్పుల అనంతరం అక్కడి నుంచి ఫిల్మ్‌నగర్ మీదుగా పారిపోయారు. వెళ్తూ ఆయుధాన్ని కొత్త చెరువులో విసిరేసి షేక్‌పేట వెళ్లి అక్కడి నుంచి ఓల్డ్ ముంబై రోడ్డు ద్వారా నానక్‌రాంగూడ చేరుకున్నారని సమాచారం. అక్కడ నుంచి ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్ అనుసరించి సిటీ దాటారని పోలీసులు భావిస్తున్నారు.



నిందితులు తుపాకీ విసిరేసినట్లుగా భావిస్తున్న కొత్త చెరువు. పోలీసులు గాలిస్తోంది ఇక్కడే

కొత్త చెరువును జల్లెడ పడుతున్న పోలీసులు

మంగళవారం సాయంత్రానికి విక్రమ్, నందూ, అహ్మద్, రాజు, మురళి, రాజశేఖర్‌లను నిందితులుగా చేరుస్తూ కేసులో మార్పులు చేశారు. అనంతపురం, కర్ణాటకల్లో ప్రత్యేక బృందాలు నలుగురిని అదుపులోకి తీసుకున్నాయి. వీరిలో మురళి కాల్పులు జరిపిన వ్యక్తిని ద్విచక్ర వాహనంపై విక్రమ్ ఇంటికి తీసుకువచ్చినట్లు సమాచారం. పరారీలో ఉన్న వారి కోసం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో గాలిస్తున్నారని తెలిసింది. నిందితుల్ని బుధవారం అరెస్టు ప్రకటించే ఆస్కారం ఉందని తెలిసింది. కాల్పులకు వినియోగించిన ఆయుధం కోసం పోలీసులు మంగళవారం కొత్త చెరువులో ముమ్మరంగా వెతికారు. దాదాపు 20 మంది టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొత్త చెరువును జల్లెడ పట్టారు. అయితే ఎలాంటి ఫలితం లేకపోవడంతో బుధవారం మరోసారి వెతకనున్నారు.

ఆర్థిక ఇబ్బందుల వల్లే..

తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విక్రమ్ అనేక చోట్ల అప్పులు చేశారు. ఇటీవల కాలంలో రుణం ఇచ్చిన ఫైనాన్షియర్ల నుంచి తిరిగి చెల్లించాలంటూ ఒత్తిడి పెరిగింది. మరోవైపు విక్రమ్‌ను ఆయన కుటుంబం కూడా దూరంగా ఉంచుతుండటంతో ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో ఏదైనా పథకం వేయడం ద్వారా అటు కుటుంబానికి దగ్గర కావడం, ఇటు ఫైనాన్షియర్ల ఒత్తిడి తగ్గించుకోవడం చేయాలని విక్రమ్ భావించారు. కొన్ని చిత్రాలను నిర్మించడం ద్వారా సినీరంగంతోనూ సంబంధాలు ఉన్న ఆయన సినీ ఫక్కీలోనే ఈ సమస్యలకు 'పరిష్కారం' వెతకాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు వచ్చిందే హత్యాయత్నం ఐడియా. ఆరు నెలల నుంచి కాల్పుల ఉదంతానికి ప్రణాళిక రచించారు.

సీఎం కేసీఆర్ రైతుగా ఆలోచిస్తున్నారు

- ఆయన నిర్ణయాలతో సాగునీటి రంగం బలోపేతం: హరీశ్
- ఏపీ పాలకులు తెలంగాణను ఏనాడూ పట్టించుకోలేదు
- ఎస్సారెస్పీని నిర్వీర్యం చేశారు.. దానికి మళ్లీ ప్రాణం పోస్తాం
- అందుకే ఎస్సారెస్పీ పునర్జీవన పథకం
- పథకానికి 10న సీఎం శంకుస్థాపన.. అక్కడే బహిరంగ సభ



సాక్షి, హైదరాబాద్: ''ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి రంగానికి ఎంతో అన్యాయం జరిగింది. ఏపీ పాలకులు తెలంగాణను ఏనాడూ పట్టించుకోలేదు. తెలంగాణ కాంగ్రెస్, టీడీపీ నాయకులకు సోయి లేక ఎంతో నష్టం వాటిల్లింది. సీఎం కేసీఆర్ ఒక రైతుగా ఆలోచన చేస్తున్నారు. ముఖ్యమంత్రి తీసుకుంటున్న నిర్ణయాలతో సాగునీటి రంగం బలోపేతమవుతోంది. ఇందులో భాగంగానే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవన పథకానికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేశారు. ప్రాజెక్టు కాల్వల ఆధునికీకరణకు మరో రూ.వెయ్యి కోట్లు వెచ్చిస్తాం. మొత్తంగా రూ.2 వేల కోట్లతో పనులు మొదలు కానున్నాయి''అని మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి వచ్చే నీటిని తీసుకుంటూ ఎస్సారెస్పీ వరద కాల్వలను జలాశయంగా వాడుకుంటామని, మూడు చిన్న ఎత్తిపోతల ద్వారా ఆ నీటిని ఎస్సారెస్పీ జలాశయానికి చేరుస్తామని చెప్పారు. 112 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఎస్సారెస్పీలో ప్రస్తుతం 80 టీఎంసీల నీటిని కూడా నిల్వ చేయలేకపోతున్నామన్నారు. ఎస్సారెస్పీ పునర్జీవన పథకానికి ఈ నెల 10న సీఎం శంకుస్థాపన చేస్తారని, అదేరోజు మధ్యాహ్నం ప్రాజెక్టు వద్ద రైతులతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. గోదావరిపై తెలంగాణలోని ముఖ్యమైన ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు ఇప్పటి దాకా చుక్కనీరు రాలేదని, అదే మేడిగడ్డ వద్ద నిత్యం లక్షలాది క్యూసెక్కుల నీరు వృథాగా కిందకు వెళ్లిపోతోందని హరీశ్ పేర్కొన్నారు. 1964లో మొదలైన ప్రాజెక్టు పూర్తి ఆయకట్టు 9.68 లక్షల ఎకరాలకు ఒక్కసారి కూడా నీరివ్వలేదని చెప్పారు. గతేడాది ఎస్సారెస్పీ ప్రాజెక్టు తాగునీరు కూడా అందివ్వలేక పోయిందని, ఇదంతా గత పాలకులైన కాంగ్రెస్, టీడీపీల పుణ్యమని హరీశ్ ఎద్దేవా చేశారు. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకే ఎస్సారెస్పీ పునర్జీవన పథకం చేపట్టినట్టు వివరించారు.

ఉమ్మడి పాలనలో అక్కడ అలా.. ఇక్కడ ఇలా!

ఉమ్మడి రాష్ట్రంలో ఏపీలోని ధవళేశ్వరం, ప్రకాశం, సుంకేసుల ఆనకట్టలన్నింటినీ బ్యారేజీలుగా మార్చుకున్నారని, కేసీ కెనాల్‌ను ఆధునీకరించారని కానీ తెలంగాణలోని సదర్‌మట్‌ను విస్మరించారని హరీశ్ అన్నారు. తెలంగాణ వచ్చాకే సదర్‌మట్‌ను బ్యారేజీగా మార్చేందుకు రూ.315 కోట్లు విడుదల చేశామని, దీనివల్ల 1.6 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చని తెలిపారు. మెదక్ జిల్లా ఘనపూర్ ఆనకట్టను విస్మరించారన్నారు. తెలంగాణ ప్రభుత్వం దీనికి రూ.100 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఎస్సారెస్పీ పునర్జీవన పథకానికి భూసేకరణ కూడా పెద్దగా అవసరం లేదని కేవలం 40 ఎకరాలు సేకరిస్తే సరిపోతుందని, 156 మెగావాట్ల విద్యుత్ అవసరమవుతుందని, మూడు దశల్లో 33 మీటర్లు ఎత్తి పోస్తే ఎస్సారెస్పీ జలాశయానికి నీటిని చేర్చొచ్చని వివరించారు.

వర్గీకరణ హామీని బీజేపీ విస్మరించింది

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి



సాక్షి, న్యూఢిల్లీ: అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు ప్రవేశపెడతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని బీజేపీ విస్మరించిందని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి మండిపడ్డారు. వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఆవరణలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. మాదిగలను బీజేపీ ఓటు బ్యాంకుగానే పరిగణిస్తోందన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేయించిందన్నారు. అయినా కేంద్రం స్పందించకపోవడం దారుణమని పిడమర్తి రవి అన్నారు.

పవన్.. తెలుసుకొని మాట్లాడు: ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: కాపులను బీసీలో కలుపుతామని టీడీపీ మేనిఫెస్టోలో పెట్టినప్పుడు వ్యతిరేకించని ఆర్.కృష్ణయ్య.. ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ ఎమ్మెల్యే, బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. కాపులను బీసీలో కలుపుతామని 1994లో ఒక జీవో జారీ చేస్తే దానిపై హైకోర్టుకు వెళ్లామని, ఆ జీవోను హైకోర్టు కొట్టేసిన విషయం పవన్ కల్యాణ్ తెలుసుకొని మాట్లాడాలన్నారు. అదేవిధంగా 1998, 2000 సంవత్సరంలో జాతీయ కమిషన్ వచ్చినప్పుడూ అడ్డుకున్నామని గుర్తుచేశారు. కాపులను బీసీలో కలపడం అంటే ఒక పులి, ఒక ఎద్దుతో నాగలి కట్టడమేనన్నారు. కాపులను బీసీ జాబితాలో కలపాలంటే కొన్ని అర్హతలుండాలని వివరించారు.

కార్పొరేట్ శక్తులకు కేంద్రం దాసోహం

సురవరం ధ్వజం

- 16నుంచి రౌండ్‌టేబుల్ సమావేశాలు.. అక్టోబర్ 5 నుంచి బస్సు యాత్ర: చాడ

సాక్షి, హైదరాబాద్: కేంద్రం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారి, యథేచ్ఛగా దోచుకునేందుకు అవకాశం కల్పించిందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రం అవినీతి తెలంగాణగా మారిపోయిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై సీపీఐ రాష్ట్ర శాఖ మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సదస్సు నిర్వహించింది. అబద్ధాలు ప్రచారం చేయడంలో ప్రధాని నరేంద్ర మోదీని, సీఎం కేసీఆర్ మించిపోతున్నారని ఎద్దేవా చేశారు. బంగారు తెలంగాణ అంటే రైతులను పట్టించుకోకుండా ఉండటమా.. రోడ్లు దారుణంగా ఉండటమా అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల రాష్ట్రం గా ముందుకి వెళుతోందని, అప్పుల తెలం గాణగా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని, అక్టోబర్ 5 నుంచి బస్సు యాత్ర చేపడతామన్నారు.



కార్యకర్తలు బహూకరించిన కరవాలంతో సురవరం. చిత్రంలో నారాయణ, చాడ తదితరులు

జీఎస్టీతో చిన్న పరిశ్రమలకు దెబ్బ

జీఎస్టీతో చిన్న పరిశ్రమలు దెబ్బ తిన్నాయని జేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. ప్రజల అభివృద్ధి కోసం చేసే యాత్రకు జేఏసీ మద్దతు ఉంటుందని, సామాజిక న్యాయం కోసం అందరినీ కలుపుకొని పోవాలని, అభివృద్ధి కోసం ప్రజా సంఘాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ ఉన్న పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, నెరెళ్లలో దళితులపై దాడి దారుణమని విమలక్క పేర్కొన్నారు. నేరెళ్ల ఘటనతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మండిపడ్డారు. 60 ఏళ్ల పోరాట ఫలితాలను సీఎం కేసీఆర్ కుటుంబమే అనుభవిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారా యణ ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో 17 చోట్ల దళితులపై దాడులు జరిగాయన్నారు. ఎంపీ కవితకు కేంద్రమంత్రి పదవి కోసం సీఎం కేంద్రానికి దాసోహం అయ్యాడని విమర్శించారు. కేసీఆర్ నియంత పాలనపై ఉద్యమాలు చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు.

దళితులు మనుషులు కారా: గీతారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో దళితులు మనుషులు కారా, వారికి బతికే హక్కు లేదా అని కాంగ్రెస్ నేత గీతారెడ్డి ప్రశ్నించారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పోలీసుల అమానుష దాడిలో గాయపడిన వారిని మీరాకుమార్ పరామర్శించి, చలించిపోయి కన్నీరు పెట్టుకున్నారని చెప్పారు. కాని అధికార టీఆర్‌ఎస్ నేతలు కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. దళితులను పరామర్శించడానికి ముఖం చెల్లకపోవడంతో టీఆర్‌ఎస్ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారని విమర్శించారు. దళితులు అంటే ఎందుకు ఇంత చిన్నచూపా అని ప్రశ్నించారు. ప్రపంచంలో ఏ మూలకు, ఏం జరిగినా ట్వీటర్‌లో స్పందిస్తున్న కేటీఆర్, తన నియోజకవర్గంలో సమస్యపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

డిగ్గీ రాజా ఔట్.. కుంతియా ఇన్

- దిగ్విజయ్ స్థానంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమించిన సోనియా
- రెండో ఇన్‌చార్జిగా కర్ణాటకకు చెందిన సతీశ్ జర్కిహోలి



సాక్షి, హైదరాబాద్, న్యూఢిల్లీ: కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రామచంద్ర కుంతియా నియామకమయ్యారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ప్రస్తుతం తెలంగాణ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న దిగ్విజయ్ సింగ్‌ను తొలగించి.. రెండో ఇన్‌చార్జిగా ఉన్న కుంతియాకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జనార్దన్ ద్వివేదీ మంగళవారం ప్రకటించారు. రెండో ఇన్‌చార్జిగా కర్ణాటకకు చెందిన సీనియర్ నేత సతీశ్ జర్కిహోలిని నియమించినట్లు వెల్లడించారు. వాస్తవానికి దిగ్విజయ్‌సింగ్‌ను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యతల నుంచి తప్పిస్తారని కొంతకాలంగా పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అక్టోబర్ నెలాఖరునాటికి ఏఐసీసీలో సంస్థాగతంగా మార్పులు చేయాలన్న యోచనతో రాష్ట్ర పార్టీ వ్యవహారాల నుంచి దిగ్విజయ్‌ను తప్పించినట్టుగా పార్టీ సీనియర్లు చెబుతున్నారు.

విభజనకు ముందు నుంచీ..

దిగ్విజయ్ సింగ్ 2004 నుంచి మూడేళ్ల పాటు ఉమ్మడి రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జిగా పనిచేశారు. అనంతరం 2013లో తిరిగి ఈ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ, ఏపీలకు ఇన్‌చార్జిగా కొనసాగారు. వీటితోపాటు ఇటీవలి వరకు గోవా, కర్ణాటకల రాష్ట్రాల బాధ్యతలూ చూశారు. మార్చిలో గోవా బాధ్యతలను, మేలో కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జి పదవి నుంచి తొలగించగా... తాజాగా తెలంగాణ బాధ్యతల నుంచి తప్పించారు. ప్రస్తుతం ఆయన ఏపీ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

ఉత్తమ్ మాటే నెగ్గిందా!

దిగ్విజయ్‌సింగ్‌ను రాష్ట్ర బాధ్యతల నుంచి తప్పించడానికి ఉత్తమ్ కారణమని పార్టీ వర్గాల్లో వాదన వినిపిస్తోంది. మరికొందరు నేతలు మాత్రం ఈ మార్పుకు, రాష్ట్ర పార్టీ వ్యవహారాలకు సంబంధం లేదని చెబుతున్నారు. వాస్తవానికి వచ్చే అక్టోబర్ నాటికి టీపీసీసీ చీఫ్ మారతారని.. వచ్చే ఎన్నికల కోసం కొత్త సారథిని నియమిస్తారని కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ఉత్తమ్‌ను తొలగించాలని డిమాండ్ చేసే నేతలకు దిగ్విజయ్ సహకరిస్తున్నారనే ప్రచారమూ ఉంది. పలు అంశాల్లో దిగ్విజయ్‌కు, ఉత్తమ్‌కు మధ్య సఖ్యత సరిగా లేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా, ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీలతో నేరుగా సంబంధాలున్న ఉత్తమ్‌ను తొలగించడానికి వారు సిద్ధపడలేదని.. అందువల్ల దిగ్విజయ్‌నే రాష్ట్ర బాధ్యతల నుంచి తప్పించారని కొందరు నేతలు వాదిస్తున్నారు. దీంతో రాష్ట్ర పార్టీలో ఉత్తమ్ మాటే చెల్లుబాటు అవుతుందని అంటున్నారు. మరికొందరు మాత్రం దిగ్విజయ్ మార్పునకు, రాష్ట్ర పార్టీలో జరుగుతున్న పరిణామాలకు సంబంధం లేదని అభిప్రాయపడుతున్నారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం అయిన దిగ్విజయ్‌సింగ్‌కు ఆ రాష్ట్రంలో రానున్న ఎన్నికలు కీలకమని.. అక్కడ పూర్తికాలం పనిచేయాల్సి ఉన్నందునే తెలంగాణ వ్యవహారాల నుంచి ఉపశమనం కలిగించారని చెబుతున్నారు. మధ్యప్రదేశ్‌లో పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నాని.. అందువల్ల తెలంగాణ బాధ్యతల నుంచి తప్పించాలని దిగ్విజయ్ అధిష్టానాన్ని కోరారని వారు అంటున్నారు. మరోవైపు దీర్ఘకాలం పాటు పార్టీ వ్యవహారాల బాధ్యతల్లో ఉన్న దిగ్విజయ్‌ను తప్పించడం వల్ల రాష్ట్రంలో పార్టీకి లాభమా, నష్టమా అన్న దానిపై పార్టీ ముఖ్యులు విశ్లేషించుకుంటున్నారు.

సౌత్‌జోన్ రీజనల్ కో–ఆర్డినేటర్‌గా జె.గీతారెడ్డి

ఏఐసీసీలో నూతన విభాగంగా ఏర్పాటు చేసిన ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ సౌత్‌జోన్ రీజనల్ కో–ఆర్డినేటర్‌గా జె.గీతారెడ్డి నియమితులయ్యారు. వైస్ చైర్మన్, వెస్ట్‌జోన్ కో–ఆర్డినేటర్‌గా మిలింద్ దేవ్‌రా, ఈస్ట్ జోన్ రీజనల్ కో–ఆర్డినేటర్‌గా గౌరవ్ గొగోయ్, నార్త్ జోన్ రీజనల్ కో–ఆర్డినేటర్‌గా సల్మాన్ సోజ్ నియమితులైనట్టు జనార్దన్ ద్వివేదీ ప్రకటించారు.

నేను నా దైవం



లేనట్లే... ఉన్నాడు!

గిరిబాబు

ఫోటో: శివ మల్లాల

సందేహం మంచిది.. ప్రశ్నలు జీవితానికి నిర్దేశం.
కనబడేవన్నీ సత్యాలు కానప్పుడు
కనపడనివి అసత్యాలు కాగలవా?
దైవాన్ని అనుభూతి చెందుతాం.. కనిపించకపోయినా..
గిరిబాబుకు దేవుడి ఉనికి మీద ఎన్నో సందేహాలు.
దేవుడికి ఎక్కుపెట్టిన ఎన్నో ప్రశ్నలు.
లేనట్లే.. అనిపించినా.. ఉన్నాడనే సమాధానం.

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సీనియర్ నటుడు గిరిబాబు ఇంటికి వెళ్లినప్పుడు ఆయన విశ్రాంతిగా కూర్చొని టీవీలో సినిమా చూస్తూ కనిపించారు. ఒకప్పుడు తను విలన్‌గా నటించిన 'కల్పన' సినిమా అది! డెబ్బై ఐదేళ్ల వయసులో గత కాలపు స్మృతులను నెమరువేసుకుంటున్న గిరిబాబు 'నేను–నా దైవం' గురించి విస్తృతంగా చర్చించారు. దేవుడున్నాడా? లేడా? అని జీవితమంతా ఎదురైన సందేహాలను ఇలా వివరించారు.

- **నాటి సినిమాలు ఇప్పుడు చూసుకుంటూ హాయిగా గడుపుతున్నారు. ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు దేవుడిని ఏవిధంగా తలుచుకుంటున్నారు?**

గిరిబాబు: దేవుడున్నాడు.. అని బాగున్నప్పుడు అనిపిస్తుంది. బాగోలేనప్పుడు దేవుడే ఉంటే ఇలా ఎందుకు జరుగుతుంది? అని కూడా అనిపిస్తుంది. ఈ జీవితం ఇలా ఉంది అంతే! నేను నిత్యపూజలేవీ చేయను. మా ఇంట్లో కూడా చేయరు. అలాగని నేనేమీ నాస్తికుడిని కాదు. నాకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. ప్రతి పండగకు నా పిల్లలు, వారి పిల్లలు అందరం కలుస్తాం. ఏ దేవుడికి సంబంధించిన పండగైతే ఆ పూజ చేసుకొని, కలిసి భోజనం చేస్తాం. సంతోషంగా, సంతృప్తిగా ఉంటుంది. బయటకెళ్లినప్పుడు గుడిముందుగా వెళితే మాత్రం దండం పెట్టుకుంటాను.

- **అంటే సంతోషం దేవుడితో ముడి పడి ఉందంటారా?**

సంతోషంగా ఉండేలా ప్రయత్నించడం మన చేతుల్లోనే ఉంది. కానీ, అప్పుడు దేవుడు దయతలిచాడు అనిపిస్తుంది. మరణం మన చేతుల్లో లేదు. అప్పుడు దేవుడున్నాడా? అనే సందేహం కలుగుతుంది. నా మనవరాలు (కూతురి కూతురు) పెళ్లి తిరుపతిలో ఘనంగా చేశాం. కొత్తజంటతో కలిసి అందరం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నాం. చాలా సంతోషంగా ఉన్నాం. మరుసటి రోజు ఇంటికి వచ్చాం. మా అల్లుడు, మేమంతా సోఫాల్లో సేదతీరుతున్నాం. ఉన్నట్టుండి మా అల్లుడు ఆ సోఫాలోనే వాలిపోయాడు. ఆసుపత్రికి తీసుకెళితే ప్రాణం పోయిందన్నారు. 'దేవుడా మేం చేసిన తప్పేంటి? ఎందుకిలా చేశావ్! రాత్రి వరకు నీ సన్నిధానంలోనే ఉన్నాంగా! ఒక్కరోజులో ఈ తేడా ఏంటి? పెళ్లికళతో ఉన్న ఇల్లు ఒక్కసారిగా ఇలా అయిపోయిందేంటి? నువ్వున్నావా? లేవా?!' అనే సందేహం కలిగింది.

- **దేవుడున్నాడు అనిపించిన సందర్భాలు?**

మా అమ్మనాన్నలకు ఒక్కణ్ణే కొడుకును. గారాబంగా పెంచారు. కాలేజీ చదువులకు రాగానే పెళ్లి చేశారు. కాలేజీ రోజుల్లో విపరీతంగా నాటకాల్లో పాల్గొనేవాడిని. సినిమా ప్రకటనలు చూసి నా ఫొటోలను ఆ సంస్థలకు పంపుతుండేవాడిని. అలా దర్శకుడు ఎస్డీ లాల్ అబ్బాయి బాగున్నాడని సినిమాకు ఎంపిక చేసి, కబురు పంపారు. కొన్ని రీళ్లు తీసి డబ్బు లేక ఆ సినిమా తీయలేకపోయారు. కానీ, ఆరు నెలల తర్వాత ప్రొడ్యూసర్ అట్లూరి పూర్ణచంద్రరావు 'జగమే మాయ' సినిమాకు నా గురించి చెప్పారు. అక్కణ్ణుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఏ మాత్రం ప్రయాస పడకుండానే సినిమా అవకాశాలు విపరీతంగా వచ్చాయి. అప్పుడు చాలాసార్లు అనుకునే వాడిని దేవుడు వీరిద్దరి రూపంలో నాకీ అవకాశాన్నీ, నిలదొక్కునే స్థైర్యాన్నీ ఇచ్చాడని.

'ప్రేమకథ' సినిమా షూటింగ్‌కి యూనిట్ సభ్యులతో కలిసి రైలులో ప్రయాణిస్తున్నాం. రైలు ప్రమాదం జరిగింది. నా వెంట వచ్చిన కెమరామన్లు, ఇంకొంతమంది ఆ దుర్ఘటనలో మరణించారు. నేను బతికాను. అప్పుడనిపించింది దేవుడున్నాడు అని. అయితే, ఆ చనిపోయినవారి వైపున దేవుడు ఎందుకు లేడు? అనే సందేహమూ వచ్చింది.

ఇంకోసారి సంక్రాంతి పండగకు మా కుటుంబ సభ్యులమంతా కలిసి మా ఊరు బయల్దేరాం. దారిలో మా కారును లారీ ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో కొద్దిపాటి గాయాలతో మేమంతా బతికాం. అప్పుడూ అనిపించింది దేవుడున్నాడని.

- **చావు బతుకులే దైవాన్ని పరిచయం చేస్తాయంటారా?**

తల్లి గర్భంలో అంతా చీకటే. అయినా అక్కడ కాళ్లూ చేతులు ఆడిస్తుంటుంది శిశువు. గర్భంలోని నుంచి బయటకు అంటే వెలుగులోకి వచ్చినందుకు నవ్వాలి కానీ, కెవ్వుమని ఏడ్చేస్తుంది ఎందుకు? పెద్ద సందేహం. బహుశా పుడుతూనే తను చావుకు దగ్గర అవుతానేమో అని ఏడుస్తుందేమో! అనే ఆలోచన.

ఈ సృష్టిలో మనకన్నా ముందు పశుపక్ష్యాదులున్నాయి. గింజలు తినో, గడ్డి తినో పెరుగుతాయి అవి. కానీ, వాటిని చంపి తినే పులి లాంటి జంతువులూ ఉన్నాయి. వీటిని పుట్టించిన దేవుడే వాటినీ పుట్టిస్తే సాటి జంతువును చంపి తినమని ఎందుకు పెట్టాడు. పాపం ఆ అమాయక జంతువు ఏం పాపం చేసింది? ఇదో సందేహం.

రాతియుగంలో మనిషి జంతువులను చంపి తినేవాడు. అప్పుడు వాడికి దేవుడంటే తెలియదు. మెదడు వికాసం పొంది ఆలోచనలు చేయడం ఆరంభిస్తూ ఏదో శక్తి ఉందని గ్రహింపుకొచ్చాడు. ఆ ఆలోచన నుంచే హింసను వదిలేసి మునులు, రుషులు వచ్చారు. జనం పెరుగుతున్న కొద్దీ ఎవరికి వారు ఓ దేవుడిని సృష్టించుకున్నారు. ఆ విధంగా దేవుళ్ల సంఖ్య పెరిగింది. బలి ఇస్తే దైవం అనుగ్రహిస్తుందనే నమ్మకంలో ఇప్పటికీ చాలామంది ఉన్నారు. దేవుడు అమాయకజీవిని చంపమనే ఆలోచన మనిషికి ఎందుకు కల్పించాడు?!

- **దేవుళ్ల సినిమాల్లోనూ నటించిన అనుభవాలు?**

దేవతలు–మహిమలు ఉన్న సినిమాలు చాలానే చేశాను. అయితే, 'దేవతలారా దీవించండి' అనే సినిమాలో పామును దేవతగా చూపిస్తాం. కాసేపు పాము మనిషిలా మారుతుంది. తర్వాత మళ్ళీ పాములా కనిపిస్తుంది. పాము పట్ల మనం చూపే దైవభక్తి అంతా ఇంతాకాదు. నాగులచవితి, నాగుల పంచమి అంటూ పూజలు చేస్తాం. పుట్టలో పాలు పోసి భక్తిగా మొక్కుతాం. అయితే, నాకు అర్థంకానిదేంటంటే.. ఈ సృష్టిలో పశుపక్ష్యాదులన్నీ తమ పిల్లల్ని అత్యంత ప్రేమగా సాకుతాయి. మరో జంతువును చంపే పులి కూడా తన పిల్లలను ప్రేమగా చూసుకుంటుంది. మొసలి కూడా ఒడ్డున ఇసుక తవ్వి గుడ్లు పెట్టి, అవి పిల్లలు కాగానే జాగ్రత్తగా నోటకరుచుకు వెళ్లి నీళ్లలో వదిలిపెడుతుంది. కానీ, పాము అలా కాదే.. తన పిల్లలని తనే మింగుతుంది. ఈ సృష్టిలో తన పిల్లల మీద ఎలాంటి అఫెక్షన్ లేని ప్రాణి ఏదైనా ఉందంటే అది పామే! అలాంటి పాముకు పూజలేంటి?! పుట్టలో పాలు పోస్తారు. దానికి ఊపిరి ఆడక బయటకు వచ్చేస్తుంది. ఇది చూసి జనం పరవశించి పోతారు. ఏంటో ఇదంతా అనిపిస్తుంది. నాకు తెలిసినంతవరకు బహుశా శివుడి మెడలో ఆభరణంగా పాము ఉంటుంది కాబట్టి ఈ జనం పూజలు చేస్తుండవచ్చా? ఇలాంటి సందేహాలు కలుగుతాయి.



నా భార్య శ్రీదేవితో నా అనుబంధం గురించి ఒక్కమాటలో చెప్పలేను. అందరినీ చక్కగా చూసుకునేది. ఆమె చేతి వంట అద్భుతంగా ఉండేది. మా నాన్న నాగయ్యకు ఇప్పుడు 107 ఏళ్లు. బిడ్డలా చూసుకునేది. కొడుకులు, కూతుళ్లు, మనవలు, మనవరాళ్లు అందరూ ప్రాణం పెడతారు తనంటే! బంధువుల్లోనూ అంతే! పూజలు, వ్రతాలు, నోములు ఎక్కడా లోపం చేసేది కాదు. ఓ 'రోజు కాళ్ల నొప్పులు, జ్వరంగా ఉంది' అంది. ఆసుపత్రికి తీసుకెళ్లాం. డాక్టర్లు అడ్మిట్ చేయాలన్నారు. ఒంట్లో ఏదో ఇన్ఫెక్షన్ అన్నారు. మూడునెలల ఏడురోజుల పాటు ఆసుపత్రిలో నరకయాతన అనుభవించి కిందటేడాది మమ్మల్ని వదిలి వెళ్లిపోయింది. అప్పుడనిపించింది 'ఏం తప్పు చేశాను? నన్ను ప్రాణంగా చూసుకునే నా అర్ధాంగిని దేవుడెందుకు తీసుకెళ్లిపోయాడు. అసలు దేవుడున్నాడా? ఉంటే ఇలా జరుగుతుందా?' పెద్ద సందేహం.

- **ఇలాంటి సందేహాలకు బీజం ఎక్కడ పడింది?**

మా ఊళ్లో. మా ఊరు ప్రకాశం జిల్లాలోని రావినూతల. చాలా చిన్నప్పుడు. బడికెళ్లే రోజుల్లో రాత్రి పూట ఆరుబయట పడుకుని ఆకాశంకేసి గంటలు గంటలు చూసేవాడిని. అన్ని చుక్కలు ఆకాశంలో దేవుడు ఎలా పెట్టాడు, ఆ చుక్కలు దాటుకొని వెళ్లిపోతే ఏం వస్తుంది? అంత పెద్ద సముద్రానికి కూడా తీరం ఉంటుంది. మరి ఈ విశ్వం అవతల ఏముంటుంది? ఇలాంటి సందేహాలు ఎడతెరిపి లేకుండా వచ్చేవి. చాలామందికి ఈ ఆలోచన వచ్చే ఉంటుంది. తర్వాత వదిలేస్తారు. కానీ, ఇప్పటికీ ఇది పెద్ద సందేహమే. గ్రహాలు, పాలపుంతలు... ఇలాంటి వాటి గురించి తెలుసుకుంటుంటాను. వేరే గ్రహాలలో జీవరాశి ఉందని చెప్పే వార్తలు చదివి ఆశ్చర్యపోతుంటాను. అలా అయితే అక్కడే దైవం ఉండాలి? ఏదో శక్తి విశ్వమంతా ఉండాలి. అంత పెద్ద ఆకారం రూపం ఎలా ఉంటుందో?!

- **దేవుణ్ణి ఆకాశంలో వెతికే మీకు దైవం గురించి ఎవరు పరిచయం చేశారు?**

మా ఇంట్లో పడమర ఇల్లు అని ఉండేది. అది దేవుడి గది! పండగలప్పుడు పూజలు, ప్రసాదాలు హడావిడులు ఉండేవి. అమ్మనాన్నలు దేవుడి గదిని అలంకరించి, నైవేద్యాలు పెట్టి నన్ను బొట్టు పెట్టుకో, దండం పెట్టుకోమనేవారు. వాళ్లు చెప్పినట్టు చేసేవాణ్ణి. మా ఊరి దగ్గరలో సింగరాయకొండ జాతర అద్భుతంగా సాగుతుంది. కొండ కింద ఆంజనేయ స్వామి, కొండమీద లక్ష్మీనరసింహ స్వామి. జాతర అంటే పండగే పండగ. స్నేహితులతో కలిసి ఒళ్లు అలసిపోయేలా తిరిగి ఇళ్లకు చేరుకునేవాళ్లం.

- **ఇంతకీ దేవుడున్నట్లా? లేనట్లా?**

మా ఊళ్లో రాజుల కాలం నాటి శైవాలయాలు, వైష్ణవాలయాలు ఉన్నాయి. వాటి పునరుద్ధరణకు ఓ కమిటీ ఏర్పాటు చేశాం. దానికి నేనే అధ్యక్షుడిని. వాటిని బాగుచేయడమే కాకుండా నిత్యం పూజలు జరిగేలా, వార్షిక ఉత్సవాలు జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ఇవి కాకుండా సాయిబాబా గుడి కూడా కట్టించాం. మా కుటుంబం అంతా ఊరెళ్లినప్పుడల్లా దర్శనం చేసుకుంటాం. కిందటి నెల నా పుట్టినరోజు. వారం రోజుల ముందుగానే ఊరికెళ్లాను. గుళ్లన్నీ దర్శించి వచ్చాను. మా చుట్టుపక్కల ఊళ్లవాళ్ళూ ఆ గుళ్లకు వచ్చి సంతోషంగా తిరిగివెళ్లడం నాకు నచ్చుతుంటుంది. అందుకోసమే నేను వెళుతుంటానని అనిపిస్తుంది. దైవం అంటే బతికినన్నాళ్లూ ఏదో ఒక రకంగా మన చుట్టూ ఉన్నవారు సంతోషంగా ఉండేలా చూడటమే అని బలంగా అనిపిస్తుంది.

- నిర్మలారెడ్డి చిల్కమర్రి

కురులు

కొండంత విలువ

కొండకు వెంట్రుక వేశాను... వస్తే కొండ పోతే వెంట్రుక... అని సామెత. వెంట్రుక అంటే మనవాళ్లకు వెంట్రుకతో సమానం. అందుకే 'నువ్వు నాకు వెంట్రుకతో సమానం' అని తీసి పడేస్తుంటాం. తల నిండా నెల తిరిగే సరికి గుట్టలు గుట్టలుగా ఉత్తపుణ్యానికి వెంట్రుకలు పెరిగిపోతాయి కనుక మనకు వెంట్రుకలంటే లెక్కలేదు. కాని ప్రపంచంలో తల మీద వెంట్రుకలు లేని వాళ్లు, మొలవని వాళ్లు, మొలిచినా రాలిపోయిన వాళ్లు ఒక్కో వెంట్రుక కోసం అర్రులు చాస్తూ ఉంటారు. తల మీద వెంట్రుకలు అందానికే కాదు ఆత్మ విశ్వాసానికి కూడా చిహ్నం. ఈ ఒక్క పాయింట్ మీదే ప్రపంచంలో వేల కోట్ల రూపాయల వెంట్రుకల వ్యాపారం జరుగుతోంది. చదవడానికి ఆశ్చర్యంగా ఉన్నా సరే... అంతగా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. ఇందులో మంచి వార్త ఏమిటంటే ప్రపంచానికి అవసరమైన వెంట్రుకల ఎగుమతిలో 80 శాతం వాటాతో భారతదేశం ముందు వరుసలో ఉంది. మరి ఈ వెంట్రుకలు ఎక్కడి నుంచి వస్తాయి? మన సంప్రదాయమే. హైందవ సాంప్రదాయంలో తల నీలాలు సమర్పించడం ఒక ముఖ్యమైన ఆనవాయితీ. తన అహాన్ని, భగవంతుని ముందు తల ఒంచి తల నీలాలు ఇవ్వడం ద్వారా ఆత్మని అర్పిస్తాడు భక్తుడు. ఇలా భారతదేశంలోని ఆలయాలకు చేరుతున్న టన్నుల కొద్ది వెంట్రుకలు భారతదేశానికి వేల కోట్ల రూపాయల రాబడిని సంపాదించి పెడుతున్నాయి.

ఏడాదికి 1300 టన్నులు

భారతదేశం నుంచి సంవత్సరానికి దాదాపు 1300 టన్నుల శిరోజాలు ప్రపంచానికి ఎగుమతి అవుతన్నాయని అంచనా. దేశంలో 200 సంస్థలు ఈ వ్యాపారంలో ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం చెన్నైలో ఉన్నాయి. విదేశీ ఎగుమతుల ద్వారా కాని దేశీయ మార్కెట్ వల్లగానీ మొత్తం మీద మన దేశంలో 2500 కోట్ల వ్యాపారం వెంట్రుకల మీద జరుగుతోంది. మళ్లీ ఇందులో సంవత్సరానికి 10 నుంచి 30 శాతం వృద్ధి కనిపిస్తోంది. ఇంత వ్యాపారానికి అవసరమైన వెంట్రుకల సేకరణకు ప్రధాన కేంద్రం వేరే ఏదో కాదు... మన తిరుపతి కొండే. రోజుకు సగటున 25 వేల మంది అర్పిస్తున్న తల నీలాల ద్వారా సంవత్సరానికి 700 నుంచి 1000 కోట్ల రాబడి సమకూరుతోంది.

ప్రతీకాత్మక చిత్రం



రెండు రకాలు

వెంట్రుకలను రెండు రకాలుగా వర్గీకరిస్తారు. ఒకటి ఇళ్ల నుంచి సేకరించినవి. ఇవి పొట్టిగా చిక్కుతో ఉంటాయి. మరొకటి తల నీలాల ద్వారా సేకరించినవి. ఇవి పొడవుగా శుద్ధి చేయడానికి అనువుగా ఉంటాయి. శుద్ధి చేసిన వెంట్రుకలు 7 నుంచి 11 అంగుళాల పొడవు ఉన్నవి కిలో 7000 రూపాయలు పలుకుతున్నాయి. 30 అంగుళాల పొడవున్న వెంట్రుకలు కిలో 50 వేలు ధర చేస్తున్నాయి.

చైనా పోటీ


చైనా వాళ్ల తల వెంట్రుకలు భారతీయుల వెంట్రుకలతో పోల్చితే రెట్టింపు మందంగా ఉంటాయి. ఇవి విగ్గుల తయారీలో బాగా ఉపయోగ పడతాయి. అయితే వీటిని మెత్తగా చూపించాలంటే మాత్రం భారతీయ శిరోజాలను కలపక తప్పదు. ఎగుమతుల్లో భారత్ ముందంజలో ఉన్నా వ్యాపారంలో మాత్రం చైనా భారీ లాభాల్లో ఉంది. దీనికి కారణం అక్కడ వెంట్రుకలతో తయారయ్యే ఉత్పత్తుల కర్మాగారాలు ఎక్కువగా ఉన్నాయి. మనం వెంట్రుకలను విక్రయిస్తుంటే అది వెంట్రుకలతో తయారయ్యే విగ్గులను, సవరాలను, వంకీల జుట్టు వరుసలను విక్రయిస్తోంది. కనుక ఇక మీద తల దువ్వుకున్నప్పుడు దువ్వెనలో వెంట్రుక కనిపిస్తే తీసి పడేయకండి. నాలుగు వెంట్రుకలు వెనకేసి సిరి మూటగట్టుకోవచ్చని గ్రహించండి.



శిరోజాలను ప్రాసెస్ చేస్తున్న మహిళలు

ఆత్మీయం

నేరము.. హింస



అహింసా పరమోధర్మః అన్నారు పెద్దలు. అంటే హింసించకుండా ఉండటమనేది అన్ని ధర్మాలలోకెల్లా ఉత్తమమైనదని అర్థం. అలాగని హింస అంటే, జీవిని చంపడమే కాదు, దాన్ని బంధించినా, అంటే జంతువులు, పక్షుల్ని కట్టేసి పెంచుకున్నా హింసే అన్నాడు బుద్ధభగవానుడు. బానిసత్వాన్నీ హింసగానే పరిగణించాడు. చేతలతోనే కాదు, మాటల ద్వారా దూషించినా, కఠినంగా మాట్లాడినా, వ్యంగ్యంగా మాట్లాడినా, రెండర్థాల పదాలతో బాధపెట్టినా– ఇవన్నీ 'జీవహింస'గానే చెప్పాడు. ఐతే ఏదైనా కావాలని, తెలిసి చేస్తేనే అది నేరం అవుతుందని, తెలియక జరిగిన హింస తప్పు మాత్రమే అవుతుందని చెప్పాడు. ఉద్దేశ్యపూర్వకంగా చేసిన జీవహింస ఎంత పాపకార్యమో చెప్పే ఒక జాతక కథ ఉంది. ఒకడు ఒక దేవతకు ఒక మేకపోతును బలిస్తూ ఉంటాడు. అప్పుడు ఆ మేకపోతు పెద్దగా నవ్వుతుంది. ఆ నవ్వు చూసి బలిచ్చేవాడు కత్తిదించుతాడు. వెంటనే ఏడుస్తుంది. అప్పుడు వాడు– '' ఓ మేకా! ఎందుకు నవ్వావు? ఎందుకు ఏడ్చావు?'' అని అడిగాడు. అప్పుడు ఆ మేక ''ఓరీ మూర్ఖుడా! నేనూ నీకులాగా ఒక యజ్ఞంలో మేకను వధించాను. పుణ్యం రాకపోగా 500 జన్మలు మేకగా పుట్టే పాపం కలిగింది. ఇప్పటికి 499 సార్లు మేకగా పుట్టి మెడ నరికించుకున్నాను. ఇది ఆఖరిది. ఈ రోజుతో నా పాపం తీరిపోతుందని ఆనందంతో నవ్వాను. ఇక నన్ను చంపడం వల్ల నీకు ఐదువందల మేక జన్మలు కలుగుతాయి కదా! అని నీ దుస్థితికి బాధపడి ఏడ్చాను'' అంది. అంటే– 'జీవహింస' ఎంత పాపకార్యమో' అని చెప్పడానికి చెప్పిన కథ ఇది. దీనిలోని అంతస్సూత్రాన్ని అర్థం చేసుకోవడం అవసరం.





సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం
2-8-2017

గండి ఆంజనేయస్వామి

శ్రీరాముడే చెక్కిన శిల్పం

మనదేశంలో అత్యంత ప్రముఖంగా పేర్కొనదగిన హనుమత్‌క్షేత్రాలు 108 ఉన్నాయి. వాటిలో 107 ఆలయాలలో హనుమ స్వయంభువుడై వెలిసినట్లు చెబుతారు. అయితే, కేవలం ఒక్కచోట మాత్రం హనుమకు ఆరాధ్యదైవమైన శ్రీరామచంద్రుడు తన బాణం మొనతో హనుమ ఆకారాన్ని చెక్కటం... తన స్వామి చెక్కిన ఆ చిత్రంలోకి హనుమ స్వయంగా వచ్చి నిలవడం కనిపిస్తుంది. అదే వైఎస్సార్ జిల్లా వేంపల్లెకు దగ్గరలోని గండి ఆంజనేయ స్వామి ఆలయం. అత్యంత మహిమాన్వితమైన ఆలయాలలో ఒకటిగా పేరుగాంచిన ఈ క్షేత్రంలో ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో స్వామికి విశేష పూజలు జరుగుతాయి. ఈ సందర్భంగా ఈ స్వామికి సంబంధించిన సజీవ చిత్రణ.



గండి ఆంజనేయస్వామి మూలవిరాట్

వేంపల్లె సమీపాన పాల కొండల కనుమ గుండా పోవు పాపాఘ్ని నది తోవ (గండి) మిక్కిలి ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ పర్వత పంక్తుల ఎత్తు దాదాపు రెండు వేల అడుగులు.. పాపాఘ్ని నది ఎత్తైన కొండ, లోయల మధ్య మలుపులు తిరిగి ప్రవహించి కడప వైపు మైదానంలో ప్రవేశిస్తుంది. పాలకొండలకు చొచ్చుకొని పోవు చోట కుడి వైపు ఒడ్డున గండి ఆంజనేయస్వామి ఆలయం ఉంది. దీనికి ఓ పురాణ గాథ ఉంది.

శ్రీరాముడు లంకకు వెళ్లేటప్పుడు హనుమంతుడి తండ్రి అయిన వాయుదేవుడు ఈ ప్రాంతంలో తపోనిష్టుడై ఉన్నాడు. రాముడికి ఆశీస్సులు అందించిన వాయుదేవుడు, తిరుగు ప్రయాణంలో రావణుడిని సంహరించి వచ్చేటప్పుడు ఇదే మార్గంలో రావాలని కోరాడు.

వాయుదేవుని కోరిక ప్రకారం సింహళ (శ్రీలంక) విజయ యాత్ర ముగించుకొని తిరిగి వచ్చేటప్పుడు రాముడు తన పరివారంతో సహా ఒకరోజు ఇక్కడ బస చేశాడు. వాయుదేవుడు శ్రీరాముడికి స్వాగతం ఇవ్వడం కోసం రెండు కొండలకు మధ్యలో ఒక బంగారు తోరణం నిర్మించాడు. శ్రీరాముడు అక్కడ ఒకచోట విశ్రాంతి తీసుకుంటూ ఒక శిలపై తన బాణపు ఉలితో ఆంజనేయుడి రూపాన్ని చిత్రించాడు. కాలి చిటికెన వేలిని చెక్కేలోగా రాహుకాలం రావడంతో అంతటితో వదిలేశాడట రాముడు. ఆ శిలను అక్కడినుంచి తరలిద్దామని చూడగా, వేలినుంచి రక్తం కారడంతో స్వామి వారక్కడ సజీవరూపులై ఉన్నారని తెలుసుకుని, చేసేదేమీ లేక ఆ స్థలంలోనే ఆలయాన్ని నిర్మించారట. అదే గండి వీరాంజనేయస్వామి దేవాలయం. దేవతానుగ్రహం వల్ల పుణ్యాత్ములకు అవసాన దశలో ఆ బంగారు తోరణం కనిపిస్తుందని విశ్వాసం. అప్పటి జిల్లా కలెక్టర్ థామస్ మన్రో తన కడపటి ప్రయాణాన ఈ గండి మీదుగా వెళ్లినప్పుడు ఈ తోరణం కనిపించదట. ఈ తోరణాన్ని చూసిన వారు త్వరలో మరణిస్తారని తెలుసుకోవడంతో ఆయన అనుచరులు ఎంతో ఆందోళన పడ్డారట. చివరికి అదే నిజమని తేలింది. కడప బ్రౌన్ గ్రంథాలయంలోని ఒక పుస్తకంలో ఈ వివరణ కనిపిస్తుంది.

పవిత్ర పాపాఘ్ని నది

పాపాలను నశింపజేసేది కాబట్టి ఈ నదికి పాపాఘ్ని అని పేరు వచ్చింది. కోలార్ జిల్లాలోని నందికొండే నంది పాదమని చెబుతారు.

పాపాఘ్ని అంతటా పవిత్రమే అయినా ఐదు స్థలాలలో మరింత పవిత్రతను పంచుకుంది. దీని ఉత్పత్తి స్థానం నంది కొండ ఒకటి, వాయు క్షేత్రంగా గండి రెండవది.. కేశవ తీర్థం మూడవది.. భాస్కర క్షేత్రంగా ఉన్న వేంపల్లె నాల్గవది, పాపాఘ్ని నది పినాకిని (పెన్నా) నదిలో కలిసే చోటు ఐదవది. ఈ ఐదు స్థానాలలో పాపాఘ్ని నది మహా పవిత్రంగా పరిగణింపబడుతోంది. పాపాఘ్ని నది గండి క్షేత్రంలో ఆంజనేయస్వామి ఆలయానికి ఎదుట దక్షిణం నుండి ఉత్తర ప్రవాహం ఉండటంతో మరింత ప్రాశస్త్యాన్ని సంతరించుకుంది.

పుణ్య తీర్థం


గండిలో ఉన్న దర్శనీయ స్థలాలు

గండి పుణ్యక్షేత్రంలో పలు దర్శనీయ స్థలాలు ఉన్నాయి. భూమానంద ఆశ్రమం.. నామాలగుండు, దాసరయ్య కోన, మాతంగ గుహ, జీకొంగ్రాయుని మేరు పర్వత శిఖరం, శ్రీచౌడేశ్వరి ఆలయం, ఉమామహేశ్వరాలయం, పావురాల గుట్ట, ఏకదంతప్ప నాయుని కోట, గవి మల్లేశ్వరస్వామి ఆలయం, కోదండ రామాలయం, శనేశ్వరాలయాలు ఉన్నాయి.

సమీపంలో ఉన్న పర్యాటక ప్రాంతాలు

గండికి సమీపంలో 8కి.మీ దూరంలో పలు పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. గండి వీరన్నగట్టుపల్లె సర్కిల్ వద్ద నుండి తూర్పు వైపు వెళితే వైఎస్ఆర్ ఘాట్, ఎకో పార్కు, ట్రిపుల్ ఐటీ, నెమళ్ల పార్కు ఇక్కడ చూడాల్సిన ప్రదేశాలు. గండికి వచ్చిన భక్తులందరూ ఈ ప్రాంతాలను కూడా సందర్శిస్తుంటారు.

- కోడూరు రామమోహనరెడ్డి
సాక్షి, వేంపల్లి, వైఎస్ఆర్ జిల్లా



శ్రావణ మాస శోభ

ఏటా శ్రావణ మాసంలో ఇక్కడ శ్రావణ మాస ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఏడాది ఉత్సవాలు ఇప్పటికే మొదలయ్యాయి. తొలి శనివారం పూజ పూర్తయింది. ఈ నెల 5వ తేదీన రెండవ శనివారం, మూడవ శనివారం ఆగస్ట్ 12న, నాల్గవ శనివారం ఆగస్ట్ 19వ తేదీలలో గండి క్షేత్రంలో శ్రావణ మాస శోభ కనిపిస్తుంది. నాల్గవ శనివారం స్వామి వారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ నాలుగు వారాలలో భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. దుష్టశక్తులను తరిమికొట్టే దేవుడిగానే గాక సంతానప్రదాతగా కూడా స్వామికి పేరుంది. గండి ఆంజనేయస్వామిని కొలిస్తే సంతానం కలుగుతుందన్న నమ్మకం ఉండటంతో భక్తుల సందడి అధికంగా ఉంటుంది.

- వర్ధి కేసరి అయ్యంగార్
(ఆలయ అర్చకులు)

ఈ క్షేత్రానికి ఇలా వెళ్లాలి

వైఎస్ఆర్ జిల్లాలో వేంపల్లె సమీపంలో ఉన్న గండి వీరాంజనేయస్వామి క్షేత్రానికి పలు మార్గాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక నుండి భక్తులు పెద్ద ఎత్తున ఇక్కడికి వస్తారు. కడప నుండి వేంపల్లె మీదుగా గండికి (53కి.మీ) చేరుకోవచ్చు. అలాగే తిరుపతి నుంచి రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మీదుగా గండి క్షేత్రానికి చేరుకోవచ్చు. మదనపల్లె, పీలేరు ప్రాంత వాసులు రాయచోటి మీదుగా గండికి చేరుకోవచ్చు. అలాగే కదిరి, పులివెందుల, వేంపల్లె మీదుగా గండికి చేరుకొనే మార్గాలు ఉన్నాయి.

కొమురెల్లి

కోరమీసాల మల్లన్న

కొండ చెరికలో ఉన్న కోరమీసాల కొంరెల్లి మల్లన్నను కొలిచిన వారికి కొంగు బంగారమే.. మల్లన్న దర్శనం పూర్వజన్మ సుకృతం అంటారు. తెలంగాణలో ప్రతి జిల్లా నుండి భక్తులు తండోపతండాలుగా వచ్చి సిద్ధిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో ఉన్న మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు.

స్థల పురాణం

కొమురవెల్లి మల్లన్న ఈ పర్వతంపై 11వ శతాబ్దంలో వెలసినట్లు ప్రతీతి. యాదవ కులస్తుడైన ఓ గొర్రెల కాపరి కలలో స్వామి కన్పించి నేను ఇంద్రకీలాద్రిపై వెలసి ఉన్నాను. దర్శించుకొమ్మని, కొలిచిన వారి కొర్కెలు తీరుస్తానని చెప్పినట్లు ప్రచారం. అనాటి నుండి ఆ ప్రాంతం ప్రజలు పూజలు చేయడం మొదలు పెట్టారు. అప్పటికే వీరశైవ సాంప్రదాయం విరాజిల్లుతున్న కాకతీయుల సామ్రాజ్యంలో అంతర్భాగమైన కొముర వెల్లిలో వెలసిన మల్లికార్జున స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేశారని ఇక్కడి పూజారులు చెబుతుంటారు.

చెక్కు చెదరని పుట్టమట్టి విగ్రహం

ఇంద్రకీలాద్రిపై కొండ చెరికలో వెలసిన మల్లన్న దేవునికి పూజలు మొదలై ఐదు వందల యేళ్లయింది. విచిత్రం ఏమిటంటే... 500 సంవత్సరాల క్రితం పుట్టమట్టితో విగ్రహాన్ని తయారు చేశారు. దేవుడికి కోరమీసాలు కూడా పెట్టారు. అది ఇప్పటికీ చెక్కు చెదరకుండా అలాగే ఉంది. ఈ విగ్రహం నాభిలో శివలింగం ఉండటం ప్రత్యేకత. యాదవుల ఆడబిడ్డ గొల్ల కేతమ్మ, లింగ బలిజల ఆడబిడ్డ బలిజ మేడలమ్మను పాణిగ్రహణం చేసుకొని స్వామి ఇక్కడ వెలిసినట్లు నానుడి. అందుకోసమే స్వామి వారికి ఇరుపక్కల గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మల విగ్రహాలు ఏర్పాటు చేశారు.

పట్నాల మల్లన్న

దేవస్థానంలో వీరశైవ ఆగమ శాస్త్ర ప్రకారం లింగ బలిజలు అర్చన చేయగా, స్వామి వారికి యాదవ కుల ఆచారం ప్రకారం ఒగ్గు పూజారులు వివిధ రంగుల, రంగాలంకార పట్నాలతో స్వామి వారిని కొలుస్తారు. అనంతరం బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలతో స్వామి వారికి అంగరంగ వైభవంగా కల్యాణం జరుగుతుంది. ఇక్కడికి వచ్చే భక్తులు స్వయంగా నివేదన తయారు చేసి ఒగ్గు పూజారుల ద్వారా పట్నం వేయించడం విశేషం. స్వామి వారికి బోనం చేసే కుండను భద్రంగా ఇంటికి తీసుకెళ్లి దాంట్లో పాలు పితకడం, పాలు కాచడం చేస్తే ఆ కుటుంబంలో ఆయురారోగ్యాలతోపాటు, అష్ట ఐశ్వర్యాలు చేకూరతాయని, పశు సంపద, పాడిపంటలతో ఆ ఇల్లు తులతూగుతుందని విశ్వాసం. అదే విధంగా గంగరేగు చెట్టు, ఒళ్లు బండ ఇక్కడ ప్రత్యేకత. గంగరేగు చెట్టుకు ప్రదక్షిణ చేసి ఒళ్లు బండ వద్ద ప్రణమిల్లి చెట్టు వద్ద పట్నం వేసిన వారి కోరికలు తీరుతాయని నమ్మకం. కోర్కెలు తీరాలని కొబ్బరి కాయల ముడుపులు కట్టడం అనవాయితీ. తడి బట్టలతో దేవాలయం ముందుండే ఒళ్లు బండ వద్ద ఒళ్లుపట్టుకుని, కోడెలు కట్టేస్తామని మొక్కిన వారికి సంతానం కల్గుతుందని నమ్మకం.

స్వామివారి బండారి, గంగిరేగు చెట్టు ఆకు ఎంతో మహిమ గలవని, బండారి నుదుట పెట్టుకొని గంగిరేగు ఆకును ఔషధంగా తీసుకుంటే సర్వరోగాలు తొలగిపోతాయని విశ్వాసం.

- ఈరగాని భిక్షం
సాక్షి, సిద్దిపేట
ఫొటోలు: **కె. సతీష్**



కొండ చెరికలో ఉన్న కొంరెల్లి మల్లన్న విగ్రహం

కన్నుల పండుగగా.. మల్లన్న కల్యాణం

తెలంగాణ ప్రజల ఇలవేల్పుగా మొక్కే కొంరెల్లి మల్లన్న కల్యాణం ప్రతి సంవత్సరం కన్నుల పండుగగా జరుగుతుంది. మార్గశిర బహుళ ద్వాదశి స్వామివారి దృష్టికుంభం (బలిహరణము) నుండి మొదలయ్యే ఉత్సవాలు మార్గశిర బహుళ ద్వాదశిరోజు కల్యాణం, ఏటా మహాశివరాత్రి రోజు పెద్దపట్నం, ఫాల్గుణ మాసం బహుళ త్రయోదశి రోజు అగ్నిగుండాల ప్రజ్వలన మొదలైన ప్రత్యేక కార్యక్రమాలు, ప్రతి రోజు స్వామి వారికి అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



అమ్మవార్లకు బోనాలు



గంగరేగు చెట్టు వద్ద పూజలు



కోనేటి స్నానం

ఇలా చేరుకోవచ్చు

ప్రసిద్ధ కొమురెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో ఉంది. హైదరాబాద్ నుండి రాజీవ్ రహదారి మీదుగా 80 కిలోమీటర్లు, వరంగల్ నుండి జనగామ మీదుగా 110 కిలోమీటర్లు, కరీంనగర్ నుండి సిద్దిపేట మీదుగా వస్తే 80 కిలో మీటర్ల దూరం ఉంటుంది.

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్

హాయ్ సర్!! నేను ఓ అబ్బాయిని లవ్ చేశాను. ఒకరంటే ఒకరికి ప్రాణం. అయితే మా విషయం ఇంట్లో తెలిసిపోయింది. మా పేరెంట్స్ నన్ను జాబ్ మానిపించేశారు. అయితే కష్టపడి ఇంట్లో అందరినీ ఒప్పించుకున్నాను. బట్ తన ఇంట్లో ఒప్పుకోవడం లేదట. అందుకే 'మనం విడిపోదాం' అంటున్నాడు. అంతా ఒప్పుకుని మేం కలిసి ఉండాలంటే ఏం చెయ్యాలి సలహా ఇవ్వండి ప్లీజ్!!

- లతిక

ఉద్యోగం పోయింది!
అబ్బాయి రాలేదు!!
ప్రేమ ఉంది!
ప్రేమికుడు జంప్!!
భ్రమ ఉంది!
జీవితం లేదు!!

'సార్ ఏంటి సార్ మాకీ తంటా..?
ఒక్క ముక్క అర్థం కావడంలేదు సార్!!'

ఎందుకు అర్థం కావడంలేదు నీలాంబరీ! వెరీ సింపుల్!!

'అరటిపండు లా సింపుల్ కాదు.. ఆపిల్ మీద డింపుల్ కాదు..
ఏదో తేడా కొట్టేసింది సార్!!'

తేడా కొట్టింది నాకు కాదు! ఈ యూత్‌కి!! అమ్మానాన్నలను ఒప్పించుకోవాలి కానీ, ఏంటీ బాధలు? ప్రేమలో పడేదాకా ఎగ్జయిటింగ్‌గా ఉంటుంది. హార్ట్... ఫుల్ చార్జ్‌లో ఉంటుంది. ఆ తరువాత హార్ట్ బ్లాక్ అయ్యి మైండ్ డిశ్చార్జ్ అయిపోతుంది.

'సార్ మీకో దండం పెడతా.. విషయం తెలుగులో చెబితేనే అరటిపండు ఇస్తా!!'

అబ్బాయి... కుదరడం లేదు, ఇంట్లో ఒప్పుకోవడం లేదు... అని ఎక్స్‌క్యూజ్‌లు ఇస్తున్నాడు. ఒట్టి పిరికోడు. అలాంటి పిరికోణ్ని పెళ్లి చేసుకొనే కంటే సింపుల్‌గా ఉండటం చాలా బెటర్!!



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి. లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

సెల్ఫ్ చెక్

డ్రా చేసిన డబ్బు చేతికి రాకపోతే..?



ఇప్పుడు బ్యాంకు లావాదేవీలు చాలా సులభమయ్యాయి. ఖాతా తెరవడంతో బాటే బ్యాంక్ ఏటిఎం కార్డ్ వస్తోంది. అయితే దీని వాడకంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మాత్రం మన పని గోవిందా! ఏటిఎం కార్డ్ వాడకంలో అప్రమత్తంగా ఉంటున్నారా?

1. బ్యాంక్ ప్రతి 3 లేదా 6 నెలలకోసారి పంపే స్టేట్‌మెంట్‌ను పరిశీలించి, తేడా ఉంటే వివరణ కోరతారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
2. మీ తదనంతరం మీ ఖాతాలో ఉన్న మొత్తం ఎవరికి చెందాలో వారి వివరాలను (నామినీ) తప్పనిసరిగా ఇస్తారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
3. పిన్ నెంబర్‌ను వరసగా మూడుసార్లు తప్పుగా కొడితే కార్డ్ బ్లాక్ అవుతుంది. కాబట్టి జాగ్రత్తగా వ్యవహరిస్తారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
4. ఏటిఎం పిన్‌నెంబర్‌ను 2–3 నెలలకోసారి మార్చడం మంచిదని తెలుసు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
5. నగదు విత్‌డ్రా చేయడానికి ఏటిఎం కార్డ్‌ను ఇతరులకు ఇవ్వడం మంచిది కాదని తెలుసు.
   ఎ. కాదు ☐
   బి. అవును ☐
6. తప్పనిసరి పరిస్థితుల్లో అలా చేయవలసి వస్తే మినీ స్టేట్‌మెంట్‌ను చెక్ చేసుకోవడం, వెంటనే ఏటిఎం పిన్ నంబర్‌ను మార్చడం మంచిదని తెలుసు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
7. ఏటిఎం కార్డ్ పోయినట్లయితే ఆ విషయాన్ని వెంటనే బ్యాంక్ దృష్టికి తీసుకెళ్లి కార్డును బ్లాక్ చేయిస్తారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
8. పిన్ నెంబర్‌ను కొన్ని కొండగుర్తుల సాయంతో గుర్తుంచుకోవడం మినహా కార్డ్ మీద రాయడం సురక్షితం కాదు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
9. ఒక్కొక్కసారి విత్‌డ్రా చేయబోయిన మొత్తం చేతికి అందకుండానే ఖాతా నుంచి నగదు నిల్వ తగ్గిపోయినట్లుగా చూపిస్తుంటుంది. ఇటువంటప్పుడు మన నగదును బ్యాంకు నుంచి రాబట్టుకోవాలంటే ఆ స్లిప్‌ను జాగ్రత్త చేయడం తప్పనిసరి అని మీకు తెలుసు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
10. మీకు లాటరీ వచ్చింది అంటూ ఫోన్ చేసి ఏటిఎం కార్డ్ మీద ఉండే సివివి నంబరు అడిగి మోసాలకు పాల్పడుతుంటారు. కాబట్టి ఎవరికీ సివివి నంబరు చెప్పకూడదని మీకు తెలుసు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐

పై వాటిలో కనీసం ఏడింటికైనా 'బి'లు వచ్చినట్లయితే మీకు ఏటిఎం కార్డ్ వాడకంపై తగినంత అవగాహన ఉందని చెప్పవచ్చు. 5 లోపుగా వస్తే మీరు ఏటిఎం కార్డ్ వాడకంలో మరిన్ని జాగ్రత్తలు తెలుసుకోవడం మంచిది.

కాసుకో సుడోకు

5					2			8
	8	3	1			9		4
9			8			1	5	
			9				8	3
	6	9	7	4	8	5	2	
8	1				6			
	9	2			4			6
6		4			9	2	1	
1			6					5

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

5	6	3	8	1	2	7	4	9
7	2	1	9	3	4	6	8	5
9	4	8	5	6	7	3	2	1
2	1	7	4	9	6	8	5	3
3	9	5	2	8	1	4	6	7
4	8	6	3	7	5	9	1	2
8	5	2	7	4	9	1	3	6
1	7	4	6	2	3	5	9	8
6	3	9	1	5	8	2	7	4

అప్పుడు మా ఆవిడ చంపేస్తుంది!



"నేను నిర్మాతగా వ్యవహరించే సినిమాల చిత్రీకరణలకు అస్సలు వెళ్లను. నేనొక్క రోజు సెట్‌కు వెళ్లినా ఆ సినిమా సుకుమారే డైరెక్ట్ చేశాడంటారు. పైగా, నాకో విజన్ ఉంటుంది. ఆయా దర్శకులకు వేరే విజన్ ఉంటుంది. నేనేదో ఉచిత సలహా ఇచ్చి, వాళ్ల కష్టాన్ని తక్కువ చేయడం ఎందుకు? అందుకే, 'కుమారి 21ఎఫ్' సెట్‌కి గానీ, ఈ 'దర్శకుడు' సెట్‌కి గానీ వెళ్లలేదు" అన్నారు సుకుమార్. అశోక్, ఈషా జంటగా హరిప్రసాద్ జక్కా దర్శకత్వంలో బీఎన్‌సీఎస్‌పీ విజయ్‌కుమార్, థామస్‌రెడ్డి ఆదూరి, రవిచంద్ర సత్తిలతో కలసి ఆయన నిర్మించిన 'దర్శకుడు' శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా సుకుమార్ చెప్పిన విశేషాలు...

● సుకుమార్

'దర్శకుడు' ఎలా ఉన్నాడు?

ఓ ప్రేక్షకుడిగా చూశా. చాలా బాగున్నాడు. సినిమా చూసినప్పుడు కొన్నిసార్లు మనకు రిజల్ట్ తెలుస్తుంది. లేదంటే ఇంత కాన్ఫిడెంట్‌గా చెప్పలేం! అందమైన ప్రేమ కథా చిత్రమిది. నా తరహా సినిమా కాదు.

తెరపై దర్శకుణ్ణి చూసినప్పుడు మీకు మీరు గుర్తొచ్చారా?

లేదు. నా కథ కాదిది. అందులో నా పాత్ర ఏం లేదు. సెట్‌లో కాస్ట్యూమ్ డిజైనర్‌తో ప్రేమలో పడ్డ దర్శకుడి కథ. (నవ్వుతూ...) నేనలా చేస్తే మా ఆవిడ చంపేస్తుంది కాబట్టి... నాకలాంటి ఎక్స్‌పీరియన్స్ లేదు.

హీరోగా చేసిన మీ అన్న కొడుకు అశోక్ బాడీ లాంగ్వేజ్ మీలాగే ఉందట?

ఏదైనా పాత్రలో నటించేటప్పుడు అలాంటి వ్యక్తులను అబ్జర్వ్ చేస్తారు కదా. అందులోనూ దర్శకుడి పాత్ర. తనకు ఎక్కువ తెలిసిన దర్శకుణ్ణి, కళ్ల ముందున్నది నేనే. కొన్నిసార్లు నాకు కోపం వచ్చినప్పుడు చేతిలో ఉన్నది విసిరేస్తా. అటువంటి సీన్స్‌లో 'చిన్నాన్న అయితే ఎలా చేస్తాడు?' అని ఊహించుకుని చేశాడేమో! నిజం చెప్పాలంటే... సీరియస్ ఎమోషనల్ సీన్స్‌లో అనుభవమున్న నటుడిలా అశోక్ బాగా చేశాడు.

మీ లైఫ్‌లోంచి ఓ సీన్ కాపీ చేశానని హరిప్రసాద్ అన్నారు. ట్రైలర్‌లోని ఆ సీన్ చూసి మీ వైఫ్ ఏమన్నారు?

(నవ్వుతూ...) 'నా సీన్ కాపీ కొట్టేశావ్' అని తిట్టింది. ఫస్ట్‌లో తనకు సినిమాల గురించి ఏం తెలీదు. ఆమెది హైదరాబాద్. ఎక్కువ హిందీ సినిమాలు చూసేది. నా సిన్మాలు చూడలేదు. 'డైరెక్షన్ అంటే నువ్వేం చేస్తావ్' అనడిగింది. తన డౌట్ ఏంటంటే... 'డ్యాన్స్ మాస్టర్ డ్యాన్స్ చేస్తాడు, ఆర్టిస్ట్ యాక్ట్ చేస్తాడు, ఇలా అందరూ అన్నీ చేస్తే నువ్వేం చేస్తావ్?' అంది. ఆర్టిస్టులకు ఎలా చేయాలో చెబుతానన్నా. 'అల్లు అర్జున్‌కు చెబుతావా నువ్వు? బన్నీ ఆ మాత్రం చేయలేడా? నువ్వు చెప్పేదేంటి!' అంది. కొన్నాళ్లు తనది ఇన్నోసెన్సా? మరొకటా? అర్థం కాలేదు. సెట్‌లో కూడా అప్పుడప్పుడూ అందరూ తమ తమ పనులు చేసేస్తుంటే... 'ఇక్కడ నా జాబ్ ఏంటి?' అనే భయం వేస్తుంది. వాళ్లు సరిగ్గా చేసినా, ఏదొకటి మార్పులు చెబుతాం. చివరకు, ఎడిటింగ్‌లో వాళ్లు చేసిందే పెట్టుకుంటాం.

మామూలుగా ఎప్పుడైనా మీ వైఫ్ మిమ్మల్ని తిట్టిన, కోప్పడిన సందర్భాలున్నాయా?

ఫ్యామిలీకి ఎక్కువ టైమ్ కేటాయించలేదని ఫీలవుతుంటుంది. ఇంటికి వెళ్లినప్పుడు అబ్బాయి ఏం చేశాడో చూడమని మా ఆవిడ చూపిస్తుంది. ఆనందపడతా. కానీ, నా సినిమా హిట్టయితే ఉన్నంత ఆనందం ఉండదేమోననే డౌట్. ఒక్కోసారి పర్సనల్ లైఫ్‌ను నెగ్లెక్ట్ చేస్తాం.

లాజిక్స్‌తో సినిమా తీసే మీరు ఎప్పుడో 1985లోకి వెళ్లి పల్లెటూరి నేపథ్యంలో 'రంగస్థలం' తీస్తున్నారేంటి?

ఎప్పట్నుంచో పల్లెటూరి నేపథ్యంలో ఓ సినిమా చేయాలనుంది. రామ్‌చరణ్ 'రంగస్థలం'తో అది కుదిరింది. కథ ప్రకారమే 1985 నేపథ్యం ఎంచుకున్నా. ప్రయోగమేమీ కాదు, మంచి కమర్షియల్ సినిమా. 85లోకి వెళ్లి తీస్తేనే కథ వర్కౌట్ అవుతుంది. అప్పుడు సెల్‌ఫోన్స్ లేవు కదా. అలాంటి లాజిక్స్ కొన్ని ఉన్నాయి. పాపికొండల్లో సెల్ సిగ్నల్స్, పొల్యూషన్ లేని చోట చిత్రీకరించాం. మీరు నమ్మరు నాకు కొన్ని హెల్త్ ప్రాబ్లమ్స్ ఉన్నాయి. అక్కడ ఉన్నప్పుడు ఏం లేవు. ఆరోగ్యంగా ఉన్నా. ఇక్కడికి రాగానే మళ్లీ మొదలు.

మీరు మ్యాథ్స్ లెక్చరర్ కదా! మీ దగ్గర్నుంచి సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ ఆశించొచ్చా?

సైన్స్ ఫిక్షన్ చేయాలంటే ఇక్కడి మార్కెట్ చాలదు. హిందీలో చేయాలి. అలాంటి కాన్సెప్ట్స్ నా దగ్గర కొన్ని ఉన్నాయి. కానీ, అవి వర్కౌట్ అవ్వాలంటే చాలా కుదరాలి. భారీ బడ్జెట్‌తో తీసేంత లిబర్టీ రావాలంటే కంటిన్యూస్ సక్సెస్‌లు ఉండాలి.

పూరి జగన్నాథ్ డ్రగ్స్ ఇష్యూ వార్తలు విన్నప్పుడు ఏమనిపిస్తుంది?

ఆయనకు ఇంకో మంచి కథ దొరికిందనిపిస్తుంది. ఆయన చాలా స్ట్రాంగ్. పూరీతో మాట్లాడితే... ఆయన మనసెంత అందమైనదో తెలుస్తుంది. ఐ లవ్ హిమ్. ఆయన్ను కలవాలని ఓ రోజు ఇంటి వరకు వెళ్లా. లేరన్నారని వచ్చేశా. వెంటనే కాల్ చేశా. ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది.

'దర్శకుడు'లోనూ అంతే. అతని లైఫ్‌లో ప్రేమ, దర్శకత్వం రెండూ ఉంటాయి. కానీ, వాడు దర్శకత్వానికి ఇచ్చినంత ఇంపార్టెన్స్ ప్రేమకు ఇవ్వడు. ఉదాహరణకు... మా ఆవిడతో షాపింగ్‌కు వెళ్లినప్పుడు తను రెండు డ్రస్సులు చూపిస్తే.. 'బాగున్నాయి, రెండూ తీసుకో' అన్నా. అలాంటి నేను ఓసారి తమన్నా కాస్ట్యూమ్ బాగోలేదని రెండు గంటలు '100% లవ్' షూటింగ్ ఆపేశా. కాస్ట్యూమ్స్ తెప్పించి వెతుకుతుంటే, వెనుక మా ఆవిడ ఉంది. 'హీరోయిన్ కోసం ఇంత టైమ్ కేటాయించావ్. నాకోసం లేదు' అని అలిగింది. ఆమెను బుజ్జగించడానికి కొంచెం టైమ్ పట్టింది (నవ్వుతూ).

'దర్శకుడు' సినిమా ట్రైలర్‌లో 'దర్శకత్వమంటే 20 శాతం క్రియేటివిటీ, 80 శాతం మేనేజ్‌మెంట్' డైలాగ్‌పై మీ ఫీలింగ్?

కథ రాసేంత వరకు మన చేతిలో ఉంటుంది. తర్వాత ఒప్పించడానికి కొందర్ని మేనేజ్ చేయాలి. అలాగని, వాళ్లేం తప్పు చేయడం లేదు. నేను, వాళ్లూ అందరికీ నచ్చాలనే క్రమంలో క్లాష్ తప్పదు. తర్వాత సెట్‌కి వెళ్లగానే ఓ ఐదొందల మందిలో ఎవరినీ నొప్పించకుండా, సినిమాను కంప్లీట్ చేయాలి. అప్పుడు.. 20 శాతం క్రియేటివిటీ అనేది 100 శాతం. 80 శాతం మేనేజ్‌మెంట్ అనేది 20 శాతం. 20 శాతం ఎఫర్ట్స్‌తో 80 శాతం మేనేజ్‌మెంట్ చేయాలి. 80 శాతం ఎఫర్ట్స్‌తో 20 శాతం క్రియేటివిటీ చూపాలి.

నెక్స్ట్ ఏంటి? అశోక్‌ను హీరోగా కంటిన్యూ చేస్తారా? దర్శకుణ్ణి చేస్తారా?

చేతిలో ఓ పనుంటే దాంతో ఎలాగైనా బతకొచ్చు. అశోక్ మంచి రైటర్. అయితే... ఈ సిన్మా రిజల్ట్ బట్టి తన ఫ్యూచర్ ఉంటుంది. సూపర్ హిట్టయితే హీరోగా రెండు ఛాన్సులొస్తాయి. లేదంటే... దర్శకుడవుతాడు.

అన్నదాత... సుఖీభవ


● ఆర్. నారాయణమూర్తి

"అందరికీ అన్నం పెట్టే రైతన్నల పరిస్థితి దయనీయంగా మారింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, రైతుల ఆత్మహత్యలను రూపుమాపేలా చర్యలు తీసుకోవాలని మా నూతన చిత్రం ద్వారా చెప్పాలనుకుంటున్నాం'' అన్నారు ఆర్. నారాయణమూర్తి. స్నేహచిత్ర పిక్చర్స్ పతాకంపై ఆయన నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో రూపొందించనున్న చిత్రం'అన్నదాత సుఖీభవ'. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 4న ఆరంభం కానుంది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన పాత్రికేయల సమావేశంలో ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ– ''ప్రధాని మోదీగారికి, తెలంగాణ సీయం కేసీఆర్‌గారికి, ఏపీ సీయం నారా చంద్రబాబునాయుడుగారికి నా సినిమా ద్వారా మూడు విజ్ఞప్తులు చేయాలనుకుంటున్నాను. రైతుల ఆత్మహత్యలను జాతీయ విపత్తుగా భావించడంతో పాటు శాస్త్రవేత్త ఎమ్.ఎస్. స్వామినాథన్ సిఫార్సులను పరిశీలించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలనుకుంటున్నాం. అలాగే, కేసీఆర్‌గారు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలతోపాటు అనేక సౌకర్యాలను కలిపిస్తూ రైతులకు మేలు చేస్తున్నారు. అయితే గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతుల ఆత్మహత్యలు తగ్గడం లేదు. ఈ విషయంపై కేసీఆర్‌గారు తగు చర్యలను తీసుకోవాలని ఈ చిత్రం ద్వారా కోరుతున్నాం. ఏపీ సీయం చంద్రబాబునాయుడుగారు నదుల అనుసంధానంతో రైతులకు మరింత మేలు చేయాలని ఈ చిత్రంతో చెప్పాలనుకుంటున్నాం. అన్నదాతలూ మీరు చనిపోవద్దు. మీరు బతకండి... మమ్మల్ని బతికించండి'' అన్నారు.

చైతూతో లైలా!?


● నాగచైతన్య

అక్కినేని యువ మన్మథుడు నాగ చైతన్యతో లైలా మరోసారి జోడీ కడుతున్నారని ఫిల్మ్ నగర్ టాక్. లైలా అంటే ఎవరో కొత్తమ్మాయి కాదు. రీసెంట్‌గా అల్లు అర్జున్ 'డీజే'తో సందడి చేసిన పూజా హెగ్డేనే. నాగ చైతన్య 'ఒక లైలా కోసం' సినిమాతోనే పూజ తెలుగు తెరకు పరిచయమయ్యారు. తాజాగా మరోసారి చైతూతో కలసి నటించబోతున్నారట. 'కార్తికేయ' ఫేమ్ చందూ మొండేటి దర్శకత్వంలో చైతూ ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. అందులో పూజా హెగ్డేను హీరోయిన్‌గా ఎంపిక చేశారట. ప్రస్తుతం చైతూ నటిస్తున్న 'యుద్ధం శరణం' చిత్రీకరణ చివరి దశకు వచ్చేసిందట. ఈ సినిమా పూర్తయిన తర్వాత పెళ్లి కోసమని చైతూ కొన్ని రోజులు సెలవులు తీసుకోనున్నారు. పెళ్లి తర్వాత సెప్టెంబర్‌లో చందూ మొండేటి సినిమా చిత్రీకరణ ప్రారంభిస్తారట.


● పూజా హెగ్డే

టైటిల్ ఒక్కటే... కథలు రెండు!


● మోహన్‌లాల్

...ఆ రెండిటిలోనూ హీరో ఒక్కరే కావడం విశేషమిక్కడ! మలయాళ హీరో మోహన్‌లాల్ 'విలన్' టైటిల్‌తో మాతృభాషలో ఓ సినిమా చేస్తున్నారు. అందులో మన తెలుగు నటుడు శ్రీకాంత్, హీరో విశాల్, హీరోయిన్లు రాశీ ఖన్నా, హన్సిక ముఖ్య తారలు. సేమ్ టైటిల్‌కు ముందు 'ది' తగిలించి.. 'ది విలన్' టైటిల్‌తో కన్నడలో ఓ సినిమా రూపొందుతోంది. ఇందులో శివ రాజ్‌కుమార్, 'ఈగ' ఫేమ్ సుదీప్ హీరోలు. అమీ జాక్సన్ హీరోయిన్. ఇప్పుడీ కన్నడ విలన్‌ను తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో తీయాలనుకుంటున్నారు నిర్మాత సీఆర్ మనోహర్. తెలుగులో 'మహాత్మ, రోగ్' సినిమాలను నిర్మించిందీయనే. తెలుగు, తమిళ ప్రేక్షకులకు సుదీప్, అమీలు సుపరిచితులే. శివ రాజ్‌కుమార్ గురించి తక్కువమందికి తెలుసు. సో, ఆ పాత్రలో మిగతా భాషల ప్రేక్షకులకు పరిచయమున్న నటుడయితే బాగుంటుందని మోహన్‌లాల్‌ను సంప్రదించారు. కన్నడ వెర్షన్‌లో శివ రాజ్‌కుమార్ చేస్తున్న పాత్రను తెలుగు, తమిళ, మలయాళ వెర్షన్స్‌లో మోహన్‌లాల్ చేస్తారన్న మాట. ప్రస్తుతం హీరో, దర్శక–నిర్మాతల మధ్య డిస్కషన్స్ జరుగుతున్నాయి. 'ది విలన్'కు మోహన్‌లాల్ ఆల్మోస్ట్ సైన్ చేసినట్టే! ఇంకో విశేషం ఏంటంటే... ఇందులోనూ శ్రీకాంత్ కీలక పాత్ర చేస్తున్నారు. ఆయన కూడా సేమ్ టైటిల్‌తో రూపొందుతోన్న రెండు సినిమాల్లో చేయబోతున్నారన్న మాట!

బంగారం చిన్నోడు.. ఫిదా చిన్నది...

ఏం పిల్లరా... యెల్లట్లేదు మైండ్‌లోంచి. భలే నటించిందిరా! అంటున్నారు 'ఫిదా'లో సాయి పల్లవిని చూసినోళ్లు. తెలుగు ప్రేక్షకులను అంతగా ఫిదా చేసిన ఈ అమ్మాయి వచ్చే నెల్లో మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. అయితే... స్ట్రయిట్ తెలుగు సినిమాతో కాదు. మలయాళ అనువాదంతో మనల్ని పలకరించనున్నారు. 'ఓకే బంగారం' ఫేమ్ దుల్కర్ సల్మాన్, సాయి పల్లవి జంటగా సమీర్ తాహిర్ దర్శకత్వంలో రూపొందిన మలయాళ సినిమా 'కలి'ను ప్రముఖ సీడెడ్ డిస్ట్రిబ్యూటర్ డీవీ కృష్ణస్వామి తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ప్రస్తుతం తెలుగు డబ్బింగ్, మిక్సింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల రెండో వారంలో టైటిల్ ప్రకటించి, సెప్టెంబర్‌లో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ చిత్రానికి మాటలు: భాషా శ్రీ, సాహిత్యం: సురేంద్ర కృష్ణ, సంగీతం: గోపీసుందర్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: దక్షిణ్ శ్రీనివాస్, సహ–నిర్మాత: వి. చంద్రశేఖర్.

● దుల్కర్ సల్మాన్ సాయిపల్లవి


బృందావనంలో కొత్తవాళ్లు!

'బృందావనమది అందరిది' చిత్రంతో తెలుగులో పలు విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన శ్రీధర్ సీపాన దర్శకుడిగా మారుతున్నారు. అంతా కొత్త నటీనటులతో తీయనున్న ఈ సినిమా గురించి శ్రీధర్ సీపాన మాట్లాడుతూ– ''దర్శకునిగా మారడం ఆనందంగా ఉంది. రచయితగా నన్ను ఆదరించిన ప్రేక్షకులు దర్శకుడిగానూ ఆదరిస్తారని ఆశిస్తున్నాను. జంధ్యాలగారిలా అందరూ నవ్వుకునే సినిమాలు తీయాలనుకుంటున్నాను. అందుకే కమర్షియల్ కథలు ఉన్నా అవన్నీ పక్కనపెట్టి ఈ వినోదాత్మక కథను ఎంచుకున్నాను. వినోదాత్మకంగా ఉంటూనే మనలోని బంధాలను గుర్తు చేసేలా ఉంటుందీ సిన్మా. కథ, ఫైట్లు, పాటలు ఉండే సాధరణ చిత్రంలా ఉండదు. ఈ సినిమాతో దర్శకుడిగా నాకో మార్క్ తెచ్చుకోవాలనుకుంటున్నాను''అన్నారు.


● శ్రీధర్ సీపాన

ఆర్కేగౌడ్‌కు స్పీకర్ అభినందన

తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా ఎన్నికైన ప్రతాని రామకృష్ణగౌడ్‌ను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఎస్. మధుసూధనాచారి అభినందించారు. ప్రొడ్యూసర్స్ సెక్టార్ ఈసీ మెంబర్‌గా కూడా ఆర్కే గౌడ్ ఎన్నికైయ్యారు. మూడువందల పై చిలుకు ఓట్లు వేసి, గెలిపించిన నిర్మాతలకు ఆర్కే గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడానికి కృషి చేస్తానన్నారు.



● ఆర్కే గౌడ్, మధుసూధనాచారి

శ్రీకరం.. శుభకరం


● ప్రశాంత్, ఐన్‌థ్రిల్లా

నిమ్మని ప్రశాంత్, ఐన్‌థ్రిల్లా చక్రవర్తి జంటగా వాన మామలై కృష్ణదేవ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'శ్రీకరం శుభకరం నారాయణీయం'. ''సంప్రదాయ కుటుంబ యువతి, దీనికి ప్రభావితం అయినటువంటి సామాన్య యువకుని విజయ పరంపర ఈ చిత్ర మూలకథ. మోడర్న్ కల్చర్‌కు అలవాటు పడిన యువతను భారతీయ సనాతన సమాజానికి దూరం కాకుండా, ప్రగతి మార్గంలో ఆధ్యాత్మిక చింతన అలవరచుకునే విధంగా చిత్రాన్ని తీర్చిదిద్దుతాం'' అన్నారు కృష్ణదేవ్. ఈ సినిమాకు సంగీతం: తారక రామారావు.

నావల్లే హైదరాబాద్‌కు ఐఎస్‌బీ: సీఎం



సాక్షి, అమరావతి: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) తన వల్లే హైదరాబాద్‌కు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉండగా చెన్నై లేదా పుణేలో ఈ సంస్థ క్యాంపస్‌ను పెట్టాలనుకున్నారని, కానీ తాను చొరవ తీసుకుని హైదరాబాద్‌లో నెలకొల్పేలా చేశానన్నారు. నల్సార్ యూనివర్సిటీని కూడా తానే హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించానని చెప్పారు. ఈ-ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఐఎస్‌బీ సౌజన్యంతో అధికారులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని చంద్రబాబు శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రారంభించి మాట్లాడారు. శిక్షణకు 33 శాఖల నుంచి నలుగురిని ఎంపిక చేశామని, ఆరు నెలలపాటు ఐఎస్‌బీ ప్రొఫెసర్లు వివిధ అంశాల్లో వారికి శిక్షణ ఇస్తారని సీఎం తెలిపారు.

టెక్నాలజీలో నా మనుమడు నన్ను మించిపోయాడు..: టెక్నాలజీలో తన కంటె తన మనుమడు ముందున్నాడని, రెండేళ్ల వయసులోనే సెల్‌ఫోన్‌ను ఆపరేట్ చేస్తున్నాడని సీఎం చంద్రబాబు చెప్పారు.మీడియా ఎప్పుడూ వ్యతిరేక వార్తల కోసం చూస్తుందని, అవి లేకపోతే వారికి పాఠకులు, వీక్షకులు ఉండరని వ్యాఖ్యానించారు. ఇటీవల రెండు మూడు వ్యతిరేక వార్తలు చూశానని, అవేవీ నిజం కాదన్నారు.

మౌస్‌లు, విండోస్‌ల గురించి తెలిసింది మా నాన్న హయాంలోనే: లోకేశ్

ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ యంత్రాంగం మౌస్‌లు ఎన్ని ఉన్నాయంటే సచివాలయంలో వెతికి ఎలుకలు లేవని చెప్పేవారని, విండోస్‌లు ఎన్ని ఉన్నాయంటే కిటికీలు లెక్కపెట్టేవారని చెప్పారు. తన తండ్రి హయాంలో ఐటీని అభివృద్ధి చేశాక మౌస్ అంటే కంప్యూటర్ మౌస్‌లని, విండోస్ అంటే ఆపరేటింగ్ సిస్టమ్స్ అని తెలుసుకుని వాటిని ఉపయోగించుకునే పరిస్థితి వచ్చిందన్నారు.

✦ టీడీపీకి ఓట్లు వేయకుంటే పింఛన్లు కట్



వృద్ధులను బెదిరించిన ఎమ్మెల్యే బోండా ఉమా

నంద్యాల: 'టీడీపీకి ఓట్లు వేయకుంటే పింఛన్లు రావు... మీరే తెలుసుకోండి'.. ఇబ్బంది పడొద్దంటూ విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు వృద్ధులను బెదిరించారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటి ఫలాలను అనుభవించే వాళ్లు ఓట్లు ఎందుకు వేయరని ప్రశ్నించారు. కర్నూలు జిల్లా నంద్యాలలోని 24వ వార్డు కౌన్సిలర్ దిలీప్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక బీసీ వసతిగృహంలో వృద్ధుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు. ఉపఎన్నిక ప్రచారం కోసం వచ్చిన ఎమ్మెల్యే బోండా ఉమా ముఖ్యఅతిథిగా హాజరై భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన వృద్ధులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఉపఎన్నికలో తెలుగు దేశం పార్టీకి కచ్చితంగా ఓటు వేసి గెలిపించాలని, లేదంటే తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం వసతిగృహంలో పనిచేసే ఉద్యోగులను ఓట్లు అడిగి కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు.

✦ 'అనంత'-అమరావతి మధ్య ఎక్స్‌ప్రెస్ హైవే

రహదారి పక్కనే రైలు మార్గం : మంత్రి అయ్యన్న వెల్లడి

సాక్షి, విశాఖపట్నం: అనంతపురం-అమరావతి మధ్య రూ.27 వేల కోట్లతో ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించనున్నట్టు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి సీహెచ్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ రహదారికి సమాంతరంగా రైలు మార్గాన్ని కూడా నిర్మిస్తామని వెల్లడించారు. మంగళవారం విశాఖ కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే 393 కిలోమీటర్లని మొత్తం ఐదు జిల్లాల గుండా వెళుతుందని, దేశంలో ఉన్న ఎక్స్‌ప్రెస్ హైవేల్లో ఇది మూడోదని పేర్కొన్నారు.

✦ చంద్రశేఖర్‌రెడ్డికి జాతీయ స్థాయి గుర్తింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఇంధన పొదుపు సంస్థ సీఈవో ఎ. చంద్రశేఖర్‌రెడ్డికి జాతీయ గుర్తింపు లభించింది. కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) ఏర్పాటు చేసిన జాతీయ మీడియా కమిటీకి ఆయనను ప్రధాన సమన్వయ కర్తగా నియమించారు. ఎల్‌ఈడీ బల్బుల వినియోగంపై ఈ కమిటీ దేశంలో విస్తృత ప్రచారం చేస్తుంది. ఈ కమిటీకి బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ భక్రే చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఈఈఎస్‌ఎల్ ఎండీ సౌరభ్‌కుమార్ వైస్ చైర్మన్‌గా, బీఈఈ కార్యదర్శి పంకజ్ కుమార్, మహారాష్ట్ర, పంజాబ్, కేరళ, అస్సాం రాష్ట్రాల ఇంధనపొదుపు సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.

✦ 7వ తేదీన దుర్గగుడి మూసివేత



ఇంద్రకీలాద్రి (విజయవాడ): శ్రావణ శుద్ధ పౌర్ణమి 7వ తేదీ చంద్రగ్రహణం సందర్భంగా దుర్గగుడి మూసివేయనున్నట్టు ఈవో సూర్యకుమారి తెలిపారు. 7వ తేదీ రాత్రి 10.56 నిమిషాల నుంచి రాత్రి 12.52 వరకు చంద్రగ్రహణం ఏర్పడుతుందని ఆలయ అర్చకులు పేర్కొంటున్నారు. ఆగమ శాస్త్ర ప్రకారం ఆరోజు మధ్యాహ్నం మహా నివేదన అనంతరం ఆలయ ద్వారాలు మూసివేస్తామని చెప్పారు. 8వ తేదీ ఉదయం ఆలయ శుద్ధి, అమ్మవారి సంప్రోక్షణ అనంతరం ఉదయం 8.00 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తామని వెల్లడించారు. 8వ తేదీ తెల్లవారుజామున వస్త్రాలంకరణ, ఖడ్గమాల ఆర్జిత సేవ, త్రికాల అర్చన సేవలను నిలిపివేయనున్నట్టు తెలిపారు.

✦ నంద్యాల కాంగ్రెస్ అభ్యర్థిగా అబ్దుల్ ఖాదర్

సాక్షి, అమరావతి: నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గడ్డం అబ్దుల్ ఖాదర్ పేరును ఖరారు చేసినట్లు పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిర భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 4 లేదా 5వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన అబ్దుల్ ఖాదర్ 1994 నుంచి ట్రేడ్ యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొనేవారని, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారని తెలిపారు.

✦ మృత్యువులోనూ అన్న వెంటే..



భోగమ్మ మృతదేహం

పెదబయలు (అరకులోయ): చిన్నప్పటి నుంచి తనతోపాటు కలిసిమెలిసి పెరిగిన అన్న మరణాన్ని తట్టుకోలేక చెల్లి కూడా తనువు చాలించిన విషాద సంఘటన ఇది. విశాఖ ఏజెన్సీ ముంచింగిపుట్టు మండలం పనస గ్రామానికి చెందిన గిరిజనుడు కూడ సూరయ్య(52) జ్వరంతో బాధపడుతుండగా సోమవారం రాత్రి పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ఆయన మృతిచెందాడు. అదే రోజు రాత్రి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. పెదబయలు మండలం పర్రెడ గ్రామంలో ఉంటున్న మృతుడి చెల్లి పాంగి భోగమ్మ (46) తన అన్న మరణవార్త విని మంగళవారం ఉదయం హుటాహుటిన పనస గ్రామానికి వెళ్లింది. అన్న మృతదేహాన్ని చూసి రోదిస్తూ ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలింది. ఆమెను బంధువులు పెదబయలు పీహెచ్‌సీకి తరలించగా వైద్యాధికారి పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. భోగమ్మ భర్త 15 ఏళ్ల కిందటే మృతిచెందాడు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు. కూలి పనిచేస్తూ పిల్లల్ని పోషిస్తూ వస్తోంది.


✦ టీడీపీకి శిల్పా చక్రపాణిరెడ్డి గుడ్‌బై?



నేడు భవిష్యత్ కార్యాచరణ ప్రకటన

సాక్షి ప్రతినిధి, కర్నూలు: ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి అధికార తెలుగుదేశం పార్టీని వీడుతున్నట్లు స్పష్టమైన సంకేతాలు వెలువడ్డాయి. కర్నూలు జిల్లా నంద్యాలలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన సమావేశంలో ఆయన ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అయితే, ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. సమావేశంలో శిల్పా చక్రపాణిరెడ్డి అనుచరులు టీడీపీలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అవమానాలను ఏకరువు పెట్టారు. గౌరవం లేని చోట ఉండాల్సిన అవసరం లేదన్నారు. చంద్రబాబుకు వాడుకుని వదిలేయడం మొదటి నుంచీ అలవాటేనని, మన విషయంలోనూ అదే జరిగిందని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా.. నంద్యాల ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం మరోసారి తన తమ్ముడు చక్రపాణిరెడ్డిని కలిశారు. తనకు సహకరించాలని కోరారు. మరోవైపు చక్రపాణిరెడ్డిని బుజ్జగించేందుకు టీడీపీ నేతలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇదే సందర్భంలో దివంగత భూమా నాగిరెడ్డి సన్నిహితుడు ఎ.వి.సుబ్బారెడ్డి కూడా శిల్పా చక్రపాణిరెడ్డితో భేటీ అయ్యారు. కార్యకర్తల అభిప్రాయాల మేరకు శిల్పా చక్రపాణిరెడ్డి తన భవిష్యత్ నిర్ణయాన్ని బుధవారం అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

పెళ్లికి జీఎస్టీ 'బ్యాండ్'!



సాక్షి, అమరావతి: పెళ్లిళ్లపై జీఎస్టీ బ్యాండ్ బాజా మోగిస్తోంది. జూలై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి పెళ్లిళ్ల వ్యయం భారీగా పెరిగిపోయింది. వివాహ ఖర్చుల్లో ప్రధానమైన లైటింగ్, అలంకరణ, ఫొటోగ్రఫీ వంటి సేవలతోపాటు దుస్తులు, ఆభరణాలు, ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు వంటి కొనుగోళ్లపై పన్ను రేట్లు పెరిగిపోయాయి. ఇప్పుడు పెళ్లిళ్లకు అందించే సేవలన్నీ వర్క్ కాంట్రాక్టు పరిధిలోకి వస్తున్నాయి. వీటిపై పన్ను 15 శాతం నుంచి 18 శాతానికి చేరింది. బంగారంపై పన్ను 1.8 శాతం నుంచి 3 శాతానికి, బట్టలు, చెప్పులు, ఫర్నీచర్ వంటి వాటిపై పన్నులు భారీగా పెరగడంతో పెళ్లివారి బడ్జెట్ తల్లకిందులవుతోంది. 'రెండు నెలల క్రితం మా అమ్మాయి పెళ్లికి రూ.8 లక్షలు అవుతుందని అంచనా వేసుకున్నాం. ఇప్పుడు జీఎస్టీ పుణ్యమా అని బడ్జెట్ మరో రూ.1.50 లక్షలు పెరుగుతోంది. ఏం చేయాలో తోచడం లేదు' అని విజయవాడకు చెందిన శ్రీరామ్ ప్రసాద్ వాపోయారు. గతంలో పెళ్లి అంటే కనీసం 1,000 నుంచి 1,500 మందికి భోజనాలను ఆర్డర్లు ఇచ్చేవారని, కానీ.. ఇప్పుడు ఎంత పెద్ద పెళ్లయినా ఈ సంఖ్య 500 దాటడం లేదని అక్షయ క్యాటరర్స్ అధినేత కె. శ్రీనివాస్ తెలిపారు. గతంలో ధనవంతుల పెళ్లికి సుమారు 4,000 మందికి ఆర్డర్లు ఇచ్చేవారని, ఇప్పుడు ఈ సంఖ్య 2,000కు పరిమితమైందని, అదే విధంగా ప్లేటు ఖరీదును రూ.650 నుంచి రూ.400కు తగ్గించుకుంటున్నారని కేఎంకే క్యాటరర్స్ ప్రతినిధి శ్రీనివాస్ తెలిపారు. జీఎస్టీ భారం ఎలా పెరిగిందంటే..

- **దుస్తులు:** పెళ్లి ఖర్చులో ప్రధానమైనవి దుస్తులు. అందుకే పెళ్లి ఖర్చుల్లో 20 నుంచి 25 శాతం వాటా వీటిదే. మొన్నటి వరకు కేవలం రెడీమేడ్ దుస్తులపై మాత్రమే పన్ను ఉండేది. కానీ, జీఎస్టీ పరిధిలోకి చీరలు, పంచెలతోపాటు అన్ని టెక్స్‌టైల్ ఉత్పత్తులను తీసుకొచ్చారు. దీంతో రూ.1,000 లోపు దుస్తులపై 5 శాతం, ఆపైన 12 శాతం పన్ను చెల్లించాలి. దీనివల్ల అదనంగా 7 శాతం పన్ను పెరగ్గా, టెక్స్‌టైల్‌పై 5 శాతం అదనపు పన్ను చెల్లించాల్సి వస్తోంది. దీంతో తమ వ్యాపారంలో 30 శాతం క్షీణత నమోదైందని విజయవాడ వస్త్రలతకు చెందిన ఓ వ్యాపారి వాపోయారు.
- **ఫుట్‌వేర్:** గతంలో రూ.500 లోపు పాదరక్షలపై పన్ను 5 శాతం ఉండగా రూ.500 మించి ఉన్న వాటిపై 10 శాతం నుంచి 18 శాతానికి పెరిగింది. దీంతో అదనపు భారం గ్యారంటీ.
- **ఆభరణాలు:** పెళ్లిళ్ల వ్యయంలో అగ్రస్థానం బంగారానిదే. జీఎస్టీ రాక ముందు 1.8 శాతంగా ఉన్న పన్ను ఇప్పుడు 3 శాతానికి పెరిగింది. దీంతో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వారు అవసరమైన మేరకే ఆభరణాలు కొంటున్నారు.
- **ఫర్నీచర్:** పెళ్లికూతుర్ని కొత్త కాపురానికి పంపుతున్నప్పుడు ఇంటికి అవసరమైన ఫర్నీచర్, ఎలక్ట్రానిక్స్ తదితర వస్తువులను ఇస్తుంటారు. ఫర్నీచర్‌పై పన్ను భారం 12 శాతం నుంచి ఏకంగా 28 శాతానికి పెరిగింది. ఎలక్ట్రానిక్ వస్తువులపై కూడా పన్ను రేట్లు స్వల్పంగా పెరిగాయి.
- **సేవలు:** క్యాటరింగ్, డెకరేషన్, మేకప్, లైటింగ్, కొరియర్, ఆతిథ్యం వంటి సేవలపై పన్నును 15 నుంచి 18 శాతానికి పెంచారు.
- **క్యాటరింగ్:** జీఎస్టీలో చాలా ఆహార ధాన్యాలపై పన్నును ఎత్తివేశారు. ఇంతకాలం వ్యాట్‌తోపాటు సేవా పన్ను కలిపి 24.5 శాతం పన్ను చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు 18 శాతం చెల్లిస్తే సరిపోతుంది. కానీ, ట్యాక్స్ పరిధిలోకి రావడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరల ధరలు ఎక్కువగా ఉండడం, కూలీల రేట్లు పెరగడం, కేటరింగ్‌లో ఎక్కువగా వాడే కోవా రేటు పెరగడంవల్ల ఈ బడ్జెట్ కూడా పెరుగుతోంది.

ఐటీ నిఘా..

పెళ్లిళ్ల ఖర్చులపై ఐటీ శాఖ కన్నేసి ఉంచింది. పెద్ద నోట్ల రద్దు తర్వాత రూ.2 లక్షలు మించిన వాటిపై నగదు రూపంలో లావాదేవీలను ఆపేశారు. రూ.2 లక్షలు దాటితే చెక్కులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారానే లావాదేవీలు జరపాలన్నది నిబంధన. కానీ, ఇప్పటికీ చాలామంది లావాదేవీలను నగదు రూపంలోనే జరుపుతుండడంతో ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం రంగంలోకి దిగింది.

పెళ్లి ఖర్చుల్లో పెరుగుదల ఇలా..

ఒక మధ్య తరగతి అమ్మాయికి పెళ్లి చేయడానికి అయ్యే మొత్తం ఖర్చు సుమారుగా రూ.11.15 లక్షలు. జీఎస్టీ రాకముందు చాలామంది బిల్లు లేకుండా ఎటువంటి పన్నులు చెల్లించకుండా వ్యాపారాలు చేసేవారు. కానీ, జీఎస్టీ వచ్చిన తర్వాత వార్షిక టర్నోవర్ రూ.20 లక్షలు దాటితే అందరూ పన్ను పరిధిలోకి వస్తున్నారు. దీంతో ప్రతిఒక్కరూ ఆ పన్ను భారాన్ని వినియోగదారుని మీద వేస్తుండటంతో ఆ మేర వ్యయాలు పెరుగుతున్నాయి. వివిధ సేవలు, కొనుగోళ్లపై పెరిగిన పన్ను భారాన్ని ఉజ్జాయింపుగా తీసుకొని లెక్కిస్తే అదనంగా రూ.1.33 లక్షలు అంటే మొత్తం పెళ్లి వ్యయం రూ.12.48 లక్షలకు చేరింది. అదే స్టార్ హోటల్స్‌లో చేస్తే ఈ ఖర్చు మరింత పెరుగుతోంది.

చంద్రబాబు అబద్ధాలు నమ్మొద్దు



పవన్‌కు ముద్రగడ లేఖ

కిర్లంపూడి (జగ్గంపేట): చంద్రబాబు ఉచ్చులో పడి ఆయన చెప్పే అబద్ధాలు నిజమని నమ్మి మీ పరపతి తగ్గించుకోవద్దని సినీనటుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు ఒక లేఖ రాశారు. ఆ లేఖ సారాంశం ఇలా ఉంది..

'మా జాతికి (బలిజ, తెలగ, కాపు, ఒంటరి) రిజర్వేషన్లపై అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి 28-08-1994న ఇచ్చిన జీఓ నంబర్ 30ని గౌరవ హైకోర్టు ఫుల్ బెంచ్ కొట్టివేసిందని చెప్పడంతో పాటు బీసీ రిజర్వేషన్ జీఓ ఇవ్వాలని కాపు ఉద్యమకారులు తొందర చేస్తున్నట్టుగా ముఖ్యమంత్రి మీ వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు వారి పెంపుడు పత్రికలో మంగళవారం ప్రచురితమైంది. వాస్తవానికి జీఓ నంబర్ 30 సక్రమంగానే ఇచ్చారని కోర్టు ఇచ్చిన తీర్పు 07-04-1995లో ఈనాడు పత్రికలో కూడా ప్రచురితమైంది. మంత్రి అచ్చెన్నాయుడు 2016 ఆగస్టు 8న కిర్లంపూడికి వచ్చి ఏడు మాసాల్లో కమిషన్ రిపోర్టు తెప్పించుకుని అసెంబ్లీలో తీర్మానం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చేలా కేంద్రానికి పంపుతామని హామీ ఇచ్చారు. అవేమీ ఆచరణకు నోచుకోలేదు.మాటి ఇచ్చి ఇలా మోసం చేసిన వ్యక్తితో మీరు ప్రయాణం చేసి, అబద్ధాలను నిజమని నమ్మి మీ పరపతిని తగ్గించుకోవద్దని కోరుతున్నా..' అని ముద్రగడ ఆ లేఖలో పేర్కొన్నారు.

పాదయాత్రకు సిద్ధంగా ఉండండి

ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పాదయాత్రకు కాపుజాతి యావత్తూ సిద్ధంగా ఉండాలని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం పిలుపు ఇచ్చారు.

5 నుంచి ఏపీ ఎంసెట్ తుది విడత కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మా కోర్సుల ప్రవేశానికి గాను ఏపీ ఎంసెట్-2017 తుది విడత కౌన్సెలింగ్‌ను ఈ నెల 5 నుంచి నిర్వహించనున్నట్లు అడ్మిషన్ల కమిటీ కన్వీనర్ జీఎస్ పండాదాస్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 5, 6 తేదీల్లో వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకోవచ్చని, 8న సీట్లు కేటాస్తామన్నారు. ఇదివరకు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాలేని వారు కూడా ఈ రెండురోజుల వెబ్‌కౌన్సెలింగ్‌కు వచ్చి ధ్రువపత్రాల పరిశీలన అనంతరం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చన్నారు. వర్సిటీ కాలేజీల్లో 483, ప్రైవేటు కాలేజీల్లో 31,362 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వివరాలను ఎంసెట్ కౌన్సెలింగ్ వెబ్‌సైట్లో (హెచ్‌టీటీపీఎస్://ఏపీ ఈఏఎంసీఈటీ.ఎన్‌ఐసీ.ఐఎన్) ఉంచినట్లు తెలిపారు.

ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించండి



- కేంద్రాన్ని కోరిన వైఎస్సార్‌సీపీ
- 'పోలవరం' కేంద్రమే చేపట్టాలి: ఎంపీ వెలగపల్లి

సాక్షి, న్యూఢిల్లీ: విభజన కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్రానికి మరోసారి విజ్ఞప్తి చేసింది. మంగళవారం లోక్‌సభలో సప్లిమెంటరీ డిమాండ్స్‌పై జరిగిన చర్చలో ఆ పార్టీ ఎంపీ వెలగపల్లి వరప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 9 రోజులు నిరాహార దీక్ష చేపట్టారని గుర్తు చేశారు. ఇప్పటివరకూ కేంద్రం ఈ దిశగా ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. వైజాగ్ - చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో మూడేళ్లయినా ఎటువంటి పురోగతి లేదని, ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఇక్కట్లలో ఉందన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ కారిడార్‌ను త్వరితగతిన అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టుకు వాస్తవ వ్యయం రూ. 40 వేల కోట్లకు పైగా అవుతుందని అంచనా వేస్తున్న నేపథ్యంలో ఈ జాతీయ ప్రాజెక్టు వ్యయాన్ని కేంద్రమే పూర్తిగా భరిస్తూ ప్రాజెక్టును చేపట్టాలని కోరారు. పేద రైతులను ఆదుకోవడానికి వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరను పెంచాలన్నారు. విభజన చట్టంలో పొందుపరచిన విశాఖ రైల్వేజోన్ ఇప్పటివరకూ సాకారం కాలేదని, దీన్ని త్వరితగతిన ప్రకటించాలని కోరారు. దుగరాజపట్నం ఓడరేవు ఏర్పాటు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చినా ఇంతవరకూ అమలు కాలేదని, స్థానికులంతా ఈ ప్రాజెక్టు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు.

తెలంగాణ

వృద్ధ దంపతుల ఆత్మహత్య

చికిత్స చేయించుకోలేక అఘాయిత్యం

చిన్నకోడూరు (సిద్దిపేట): అనారోగ్యంతో మంచం పట్టిన వృద్ధ దంపతులు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన పూసల వెంకటేశం (80), ఐలవ్వ (70)లకు ముగ్గురు కుమారులు. పూసల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. ముగ్గురు కుమారులు వేరుగా ఉండటంతో వృద్ధ దంపతులు ఒకచోట ఉంటున్నారు. ఎనిమిది నెలల క్రితం ఐలవ్వకు పక్షవాతం రావడంతో మంచానికే పరిమితమైంది. ఇటీవల వెంకటేశం కాలు విరగడంతో మంచం పట్టాడు. మెరుగైన చికిత్స చేయించుకునే స్థోమత లేక, అయిన వారెవరూ దగ్గర లేరనే బాధతో వీరిద్దరు మనస్తాపానికి గురై.. మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగారు. అపస్మారకస్థితికి చేరుకున్న వీరిని ఇరుగు పొరుగు వారు గమనించి వెంటనే సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ కొద్దిసేపటికే మృతి చెందారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై నేడు విచారణ

సాక్షి, హైదరాబాద్: తమ సంస్థల్లోని 20,903 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తూ విద్యుత్ సంస్థల యాజమాన్యాలు జారీ చేసిన ఉత్తర్వులపై ఉమ్మడి హైకోర్టు బుధవారం విచారణ జరపనుంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై దాఖలు చేసిన వ్యాజ్యం మంగళవారం జాబితాలో ఉన్నప్పటికీ, అది విచారణకు నోచుకులేదు. దీంతో పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సత్యంరెడ్డి ఈ పరిస్థితిని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ, దీనికి సంబంధించి ఓ దరఖాస్తును కోర్టు ముందుంచాలని, తద్వారా బుధవారం తప్పక విచారణకు వస్తుందని తెలిపింది. దీంతో సత్యం రెడ్డి ఓ దరఖాస్తును రిజిస్ట్రీకి సమర్పించారు. ఈ నేపథ్యంలో ఈ కేసు బుధవారం నాటి కేసుల విచారణ జాబితాలో 8వ ఐటమ్‌గా నమోదైంది.

సౌదీలో రోడ్డు ప్రమాదం

భువనగిరి జిల్లా యువకుడి దుర్మరణం

రామన్నపేట (నకిరేకల్): సౌదీ అరేబియాలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రానికి చెందిన షేక్ ఆజం (29) మృతి చెందాడు. రామన్నపేటలోని గాజులవాడలో నివాసం ఉంటున్న షేక్ వలీ-చాంద్ సుల్తానా దంపతుల చిన్నకుమారుడు షేక్ ఆజం ఉపాధి కోసం ఏడాదిన్నర క్రితం సౌదీ అరేబియాకు వలస వెళ్లాడు. అక్కడి హాలియా ప్రాంతంలో ల్యాండ్ సర్వేయర్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకొని తనుండే చోటుకు కారులో వెళ్తుండగా వెనుక నుంచి ట్రక్కు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

భూ రికార్డులు సరిచేస్తారిలా...



రాష్ట్రంలో అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన (ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్) కోసం రెవెన్యూ యంత్రాంగం భారీ కసరత్తు చేస్తోంది. గ్రామాన్ని యూనిట్‌గా చేసుకుని రికార్డులను పరిశీలించే ప్రక్రియ మొదలుపెట్టింది. గ్రామాల్లో అన్ని రకాల భూముల వివరాల పరిశీలనకు రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) ఇటీవల విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన చోట్ల ప్రత్యేక అధికారులనూ నియమించుకుంటున్నారు. ఆగస్టు 10 నాటికి రికార్డుల ప్రక్షాళన పూర్తి చేయాలని నిర్ణయించినా పలు కారణాల వల్ల ఈ ప్రక్రియ జాప్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. - సాక్షి, హైదరాబాద్

ప్రక్షాళనలో కీలకాంశాలివే..

- గ్రామం యూనిట్‌గా మొదలైన పత్రాల పరిశీలన
- సీలింగ్ భూముల స్వాధీన వివరాల నమోదు
- చనిపోయిన వారి పేర్ల గుర్తింపు
- ఆగస్టు 10 నాటికి ప్రక్రియ పూర్తవడం కష్టమే!

➡ సేత్వార్, ఖాస్రా, చెస్సలా, ప్రస్తుత పహాణీల్లో ఉన్న భూమిలో సరిపోలని సర్వే నంబర్ల గుర్తింపు. డబుల్ ఎంట్రీలు, క్రయ విక్రయ లావాదేవీలు, క్లరికల్ తప్పుల సవరణ. ఆపై వెబ్‌ల్యాండ్‌లో నమోదు. ఒకవేళ సవరణ వీలుకాకుంటే అందుకుగల కారణాల గుర్తింపు.

➡ మీ-సేవ కేంద్రాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా జరిగే మ్యుటేషన్ల పరిశీలన. పెండింగ్ మ్యుటేషన్లకుగల కారణాల నమోదు.

➡ ప్రభుత్వ భూసేకరణ కింద పరిహారం చెల్లించాక రెవెన్యూ రికార్డుల్లో సంబంధిత రైతులు లేదా పట్టాదారుల వివరాల సవరణ ప్రక్రియ పూర్తిగా జరిగిందా లేదా అని పరిశీలన.

➡ ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వమే భూమిని కొనిచ్చాక రికార్డుల సవరణ జరిగిందా లేదా అని తనిఖీ.

➡ వివాదాల్లోని ఇనాం భూములకు పరిష్కారం లభించిందా లేదా అని పరిశీలన. ఒకవేళ లేకుంటే అందుకుగల కారణాల నమోదు.

➡ ఆంధ్రప్రదేశ్ భూ నియంత్రణ చట్టం -1973 ప్రకారం ప్రభుత్వానికి స్వాధీనపడిన వ్యవసాయ/ అర్బన్ సీలింగ్ భూముల వివరాల నమోదు పూర్తిస్థాయిలో పరిశీలన.

➡ భూదానోద్యమం ద్వారా ఎన్ని ఎకరాల భూమి ప్రభుత్వానికి దఖలు పడింది. అందులో ఎన్ని ఎకరాలకు రికార్డులున్నాయి.. లేని భూములకు ఎందుకు రికార్డులు నమోదు చేయలేదో ఆరా తీస్తారు. దేవాదాయ, వక్ఫ్ భూముల రికార్డులూ క్షుణ్ణంగా తనిఖీ.

➡ పట్టాదారులుగా ఉండి చనిపోయిన వారికి సంబంధించిన రికార్డులు అప్‌డేట్ అయ్యాయా... వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో వాటి నమోదుపై పరిశీలన.

➡ పహాణీల నుంచి చనిపోయిన వారి పేర్లు తొలగింపు పెండింగ్‌లో ఉంటే అందుకు గల వివరాల సేకరణ. ప్రభుత్వ, ఇతర అసైన్డ్ భూముల కబ్జాలో ఉండి చనిపోయిన వారి రికార్డుల అప్‌డేట్ జరిగిందా? ఒకవేళ తొలగించని పక్షంలో అందుకుగల కారణాల నమోదు.

➡ వెబ్‌ల్యాండ్‌లో నమోదైన వివరాల్లో పట్టాదారు, అనుభవదారుని కాలమ్‌లలో తేడాలుంటే గుర్తింపు. పూర్తిస్థాయి పరిశీలన అనంతరం వాటి సవరణ.

➡ గ్రామాల్లో చెరువుల సంఖ్య, చెరువు శిఖం భూముల వివరాలు ఒరిజనల్ రికార్డుల్లో ఉన్నాయా లేవా అని పరిశీలన. నాలా, పట్టాశిఖం భూముల వివరాలు పహాణీలో నమోదు చేశారా లేదా తనిఖీ.

➡ రెవెన్యూ క్లస్టర్‌లో వీఆర్వో కార్యాలయం ఉందా లేదా? లేకుంటే అందుకుగల కారణాల నమోదు.

లష్కరే టాప్ కమాండర్ హతం

- ఎన్‌కౌంటర్‌లో దుజానాతోపాటు మరో ఉగ్రవాది దార్ మృతి
- ఇంట్లో నక్కిన ఉగ్రవాదుల్ని మట్టుబెట్టిన భద్రతాబలగాలు
- కశ్మీర్ లోయలో అప్రమత్తత
- ఇంటర్నెట్ సేవలు బంద్




భద్రతాబలగాల దాడిలో నేలమట్టమైన ఉగ్రవాదులు దాక్కొన్న ఇల్లు. (ఇన్‌సెట్లో) దుజానా

శ్రీనగర్: ఉగ్రపోరులో భారత భద్రతాదళాలు కీలక ముందడుగు వేశాయి. మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్, లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజానాను పక్కా ప్రణాళికతో మట్టుబెట్టాయి. ఉగ్ర సంస్థల కీలక నేతలను నిర్మూలించే ఆపరేషన్‌లో మరో విజయం సాధించాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ పక్కా సమాచారం, సమర్థ ప్రణాళికతో సాగిన 'ఆపరేషన్ దుజానా'ను విజయవంతంగా, తమవైపు నుంచి ఎలాంటి నష్టం లేకుండా ముగించగలిగాయి. జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్తాన్ జాతీయుడైన దుజానాను, అతని స్థానిక అనుచరుడు అరిఫ్ నబీ దార్ భద్రతా బలగాలు హతమార్చాయి. ఒక ఇంట్లో దుజానా, దార్‌లు దాక్కొన్నారన్న సమాచారం మేరకు భద్రతా బలగాలు సోమవారం అర్ధరాత్రి నుంచి పుల్వామాలో హక్రిపోరా ప్రాంతాన్ని స్వాధీనంలోకి తెచ్చుకున్నాయి. చివరకు మంగళవారం తెల్లవారుజామున భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పుల్లో దుజానా, దార్‌లు హతమయ్యారని, వారి మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నామని ఆర్మీ అధికారులు తెలిపారు. గతేడాది హిజ్బుల్ టాప్ కమాండర్ బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్ అనంతరం తలెత్తిన హింస నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో అత్యంత అప్రమత్తత ప్రకటించారు. కశ్మీర్‌లో శాంతి భద్రతలు అదుపు తప్పకుండా మొబైల్ ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేశారు. చాలాచోట్ల బ్రాడ్‌బాండ్ సేవల్ని నిలిపేశారు. కశ్మీర్ లోయలో బడులు, కళాశాలలు, వర్సిటీల్ని మూసివేశారు.

పక్కాగా.. ఆపరేషన్ దుజానా: సోమవారం అర్ధరాత్రి.. పుల్వామాలోని హక్రిపోరాలోని ఒక ఇంట్లో లష్కరే కశ్మీర్ చీఫ్ అబు దుజానా ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే పోలీసులు, సైన్యం, సీఆర్‌పీఎఫ్ బలగాలు అప్రమత్తమయ్యాయి. హుటాహుటిన స్పెషల్ ఆపరేషన్స్ (ఎస్‌ఓజీ) బృందాల్ని పుల్వామాకు 13 కి.మీ. దూరంలో ఉన్న హక్రిపురాకు తరలించారు. డీఐజీ స్వయం ప్రకాశ్ పాణి సంఘటన ప్రాంతానికి చేరుకుని 'ఆపరేషన్ దుజానా'ను పర్యవేక్షించారు. ఎస్‌ఓజీతో పాటు పుల్వామా జిల్లా పోలీసులు, ఆర్మీకి చెందిన విక్టర్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్లు ఉగ్రవాదులు ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ఇంతలో స్థానికులు భద్రతా బలగాల్ని ప్రతిఘటిస్తూ వాళ్లపై రాళ్లదాడికి పాల్పడ్డారు. మరోవైపు దుజానా, దార్‌లను మట్టుబెట్టేందుకు వారు ఉన్న ఇంట్లోని ప్రజల్ని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు భద్రతా బలగాలు ఆపరేషన్ మొదలుపెట్టాయి. భద్రతా బలగాల ఎదురు కాల్పుల్లో దుజానా, భట్ మరణించారు. ఉగ్రవాదులు మరణించారని తెలియగానే.. జనాల్లోంచి కొందరు మిలిటెంట్లు పోలీసులపైకి కాల్పులు ప్రారంభించారని పోలీసులు తెలిపారు. వంద మందికిపైగా ఆందోళనకారులు భద్రతా బలగాలపైకి రాళ్లు రువ్వడంతో.. వారిపైకి టియర్ గ్యాస్ షెల్స్, పెల్లెట్లు ప్రయోగించడంతో పాటు.. రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒక పౌరుడు మరణించాడు.

నియామకాల్లో కీలకం.. దాడుల్లో చురుగ్గా!
అబు దుజానా(26) దక్షిణ కశ్మీర్‌లో లష్కరే తోయిబా చీఫ్ కమాండర్.. లష్కరేలో ఏ+++ హోదా ఉగ్రవాది. అతను పాకిస్తానీ అన్న విషయం తప్ప మిగతా వివరాలు తెలియదు. పుల్వామా గ్రామీణ ప్రాంతాల నుంచే ఉగ్రవాద కార్యకలాపాల్ని కొనసాగించే దుజానా తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది. 2013లో అబు ఖాసీం మరణించాక.. దుజానాను లష్కరే టాప్ కమాండర్‌గా నియమించారు. ఆరేళ్ల క్రితం కశ్మీర్‌లోకి ప్రవేశించిన దుజానా మొదట్లో ఉత్తర కశ్మీర్‌లో చురుగ్గా పనిచేశాడు. లష్కరే నాయకత్వంతో విభేదాలతో జకీర్ మూసా గ్రూపులో చేరినట్లు వార్తలు వినిపించాయి. దాదాపు 12 సార్లు పోలీసుల వల నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. దక్షిణ కశ్మీర్‌లో భద్రతా బలగాలు, రాజకీయ కార్యకర్తలపై అనేక దాడుల్లో చురుగ్గా వ్యవహరించాడు. స్థానిక యువతను లష్కరే తోయిబాలో చేర్పించడంలో అతను చురుగ్గా వ్యవహరించేవాడని, రెయాజ్ అహ్మద్, అరిఫ్ నబీ దార్, అయూబ్ లోన్‌ల్ని లష్కరేలో చేర్పించింది అతనే. ఇక పుల్వామా జిల్లాకు చెందిన ఉగ్రవాది దార్.. అరిహల్, రత్నిపోరా, నెహమాల్లో జమ్మూ కశ్మీర్ బ్యాంక్ బ్రాంచ్‌లు, ఎల్లాక్వాయ్ దేహతి బ్యాంక్ దోపిడీల్లో చురుగ్గా వ్యవహరించాడు.

భార్యను చూసేందుకొచ్చి: భార్యను, గర్ల్‌ఫ్రెండ్‌ను చూసేందుకు ఒక గ్రామానికి తరచూ రావడమే దుజానాను పట్టిచ్చింది. మూడు నెలల వ్యవధిలో పుల్వామా జిల్లాలోని ఒక గ్రామానికి చాలాసార్లు రావడంపై నిఘా వర్గాలు దృష్టిపెట్టాయి. ఖుర్షీద్ అనే వ్యక్తి ఇంటికి వస్తున్నాడని, అతని కుమార్తెతో దుజానాకు వివాహమైనట్లు నిఘా వర్గాలు నిర్ధారించుకున్నాయి.



బుర్హాన్ వనీ చనిపోయిన 2016లో అత్యధికంగా 88 మంది స్థానిక యువకులు ఉగ్రబాట పట్టారు.

ఆపరేషన్ 'ఏరివేత'!

హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్‌తో గతేడాది నుంచి అశాంతితో కశ్మీర్ రగులుతూనే ఉంది. దీనికి ముగింపు పలకాలనే ఉద్దేశంతో కేంద్రం 'హిట్‌లిస్ట్'ను రూపొందించి మరీ ఉగ్రవాదుల ఏరివేతను కొనసాగిస్తోంది. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మే నెలాఖరులో మాట్లాడుతూ, కశ్మీర్‌లో పరిస్థితిని సాధారణ స్థితికి తెస్తామని, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని అంతమొందిస్తామన్నారు. పక్కాగా వ్యూహం సిద్ధం చేశాకే హోంమంత్రి ఈ ప్రకటన చేసినట్లు తెలుస్తోంది. సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు మిలిటెంట్ల జాబితాను రూపొందించగా.. 253 మంది క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు లెక్కతేల్చారు. వీరిలో విదేశీయులు, స్థానికులు ఎవరో గుర్తించారు.

టార్గెట్... లీడర్
Maytas Infra	46.5	47.25
Medinova Dia	24.6	25.1
Mold-tek	50	49.8
Moldtek Plastic	278.8	280.3
Moschip Semi	46.3	46.55
NCCFinance	1.8	1.8
NCLInd	209.55	196.25
NETTLINX	98.5	92.85
NMDC Ltd	125.75	126.75
NagarAgrich	37.35	38.4
NagarConst	88.9	88.85
Natco Pharma	967	973.55
Nava Bh Ventur	135.25	137.1
Neha Inter	6	6.09
Neocure Ther	3.68	3.63
Neuland Lab	1435	1446.4
Nihar Info Glo	16.05	17.6
Nile	617.5	623.1
Oil Country	45.85	46.85
Ortin labs	16.95	17
Pankaj Poly	7.86	7.49
Panyam Cemen	66.25	66.6
PennInd	55.3	54.75
Phytochem I	59.7	59.9
Pitti Lamin	55.85	54.95
Pokarna	1329.5	1294.65
Prajay Engs	9.45	9.33
PremiExpl	480.35	487.15
Prism Cement	121.4	119.75
Ragsan Petro	60	60.2
Rain Industries	128.45	129.9
Raj Packagin	58.5	57.85
Ram Informat	43.75	48.3
Reg.Ceramic	5.9	5.9
Restile Cer	5.65	5.5
Roopa Indus	13.71	13.06
Saamya Biotech	1.88	1.8
Sagar Cem	825	839.3
Samkrg Pist	296.5	296.45
Sampre Nutri	48	46.5
SangInd	87.35	89.5
Satvah. Ispat	44	42.05
Saven Techno	22.9	22.8
Secund	0.95	0.96
South Bio Tech	3.87	3.86
SrRayAlk	32.05	32.9
Srinivasa Ship	64.1	66.5
Sujana Metal	2	2.13
Sujana Towers	4.82	4.96
Sujana Univers	1.2	1.29
Surana Tele	5.23	5.15
Suryachakra Pow	1.65	1.68
Suryalata Sp	137.25	143.65
Suryava Spin	8.84	9.28
SuvarCem	168.5	167.5
Suven Pharma	170.1	166.4
TCI Finance	23.15	23.5
Taj Gvk Hotel	166.4	163.45
Tanla Solutions	37.45	39.05
Trans Biotek	2.63	2.76
Transport Co	303.95	313.7
Trendy Knit	0.21	0.21
Usher Agro	8.23	8.07
V&K Soft	4.7	4.84
VBC Ferro	42	42
VST Indus	3018.5	3097.65
Vamshi Rubb	71	73.15
Viceroy Hotels	19.1	19.25
VijayTextil	61.5	60
Vimta Labs	146.65	150.1
Virat Crane	36.5	36.5
Virinchi Con	88	88.4
VisakaInd	470	473.9
Vision Tech	1.62	1.69
Vista Pharma	31.5	32.1
Vivimed Labs	121.05	124.85
ZenoTech Lab	56.95	54.8

పైసల్లేవు.. పరి'శ్రమే' మిగిలింది!

'టీ-ప్రైడ్'కు నిధుల జాడ్యం

మంజూరై రెండేళ్లయినా విడుదల కాని పెట్టుబడి రాయితీలు



ఓ దళిత మెకానికల్ డిప్లొమా ఇంజనీర్ హైదరాబాద్‌లోని బాలానగర్ పారిశ్రామిక వాడలో 'టీ-ప్రైడ్' పథకం కింద రూ.కోటి పెట్టుబడితో సీఎన్‌సీ మౌల్డింగ్ మెషీన్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. బీహెచ్ఈఎల్, బీడీఎల్, డీఆర్‌డీఎల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి వర్క్ ఆర్డర్లు కూడా వచ్చాయి. అయితే ఆయా సంస్థలు ఆరు నెలలకోసారి బిల్లులు చెల్లిస్తుంటాయి. దీంతో పరిశ్రమ నిర్వహణ కష్టతరంగా మారింది. పెట్టుబడి కోసం బ్యాంకు నుంచి తీసుకున్న రుణ వాయిదాలు చెల్లించలేక.. ఉత్పత్తి కొనసాగించేందుకు కావాల్సిన నిధుల్లేక ఇబ్బందులు తలెత్తాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెట్టుబడి రాయితీ నిధులు వస్తే ఈ సమస్య నుంచి గట్టెక్కవచ్చని రెండేళ్లుగా ఎదురుచూస్తున్నా ఫలితం లేదు. బ్యాంకులు ఈ పరిశ్రమకు ఇచ్చిన రుణాన్ని నిరర్థక ఆస్తి (ఎన్‌పీఏ)గా లెక్కగట్టి.. మొత్తం రుణం కట్టేయాలంటూ నోటీసులిచ్చాయి. దీంతో పరిశ్రమ సంక్షోభంలో పడింది. 'టీ-ప్రైడ్'అమల్లో జాప్యం కారణంగా ఇలా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఇబ్బందులు పడుతున్నారు.

2016-17లో ఎస్సీ పారిశ్రామికవేత్తల కోసం కేటాయించిన మొత్తం
రూ. 128 కోట్లు

ఇందులో విడుదల చేసిన మొత్తం
రూ. 32 కోట్లు

2016-17లో ఎస్టీ పారిశ్రామికవేత్తల కోసం కేటాయించిన మొత్తం
రూ. 96 కోట్లు

ఇందులో విడుదల చేసిన మొత్తం
రూ. 24 కోట్లు

2017-18లో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల కోసం కేటాయించిన మొత్తం
రూ. 218 కోట్లు

ఇందులో ఏప్రిల్‌లో విడుదల చేసిన మొత్తం
రూ. 101 కోట్లు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు
- రూ.262 కోట్ల మేర పేరుకుపోయిన బకాయిలు
- నిరర్థక ఆస్తులుగా మారుతున్న పెట్టుబడి రుణాలు
- రుణాలు తీర్చాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులు
- సంక్షోభంలో ఎస్సీ, ఎస్టీల పరిశ్రమలు!

సాక్షి, హైదరాబాద్: దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలను తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'టీ-ప్రైడ్'కార్యక్రమం ఆచరణలో విఫలమవుతోంది. పరిశ్రమలు స్థాపించిన వెంటనే రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తే పరిశ్రమలు నిలదొక్కుకోవడానికి అవకాశం ఉండగా... దరఖాస్తు చేసుకుని రెండేళ్లయినా పెట్టుబడి రాయితీ అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బ్యాంకుల వడ్డీలు పెరిగి పెట్టుబడి రుణాలు భారంగా మారుతున్నాయి. ఉత్పత్తుల విక్రయాల బిల్లులు సకాలంలో అందక పరిశ్రమల నిర్వహణ భారంగా మారుతోంది.

తీవ్ర జాప్యం.. అరకొరగా నిధులు..

రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులతో కూడిన రాష్ట్ర స్థాయి కమిటీ ప్రతి మూడు నెలలకోసారి, జిల్లా స్థాయి కమిటీలు నెలకోసారి సమావేశమై 'టీ-ప్రైడ్' పథకం కింద ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి రాయితీలను మంజూరు చేయాలి. కానీ సమావేశాలు జరిగి ఏడాదిన్నర, రెండేళ్ల తర్వాత కూడా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి రాయితీలు విడుదల కావడం లేదు. ఈ పథకానికి ప్రభుత్వం బడ్జెట్ నిధులు కేటాయించినా.. విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 2016-17లో ఎస్సీ పారిశ్రామికవేత్తల కోసం రూ.128 కోట్లు కేటాయించగా.. రూ.32 కోట్లు, ఎస్టీ పారిశ్రామికవేత్తల కోసం రూ. 96 కోట్లు కేటాయించగా.. రూ.24 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. 2017-18లో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు కలిపి రూ.218 కోట్లు కేటాయించగా.. ఏప్రిల్‌లో రూ.101 కోట్లు విడుదలయ్యాయి.

టీ- ప్రైడ్ పథకమిదీ..

సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసే దళిత, గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాయితీ, ప్రోత్సాహకాలు అందించేందుకు 2014 నవంబర్ 2న 'తెలంగాణ స్టేట్ ప్రోగ్రాం ఫర్ రాపిడ్ ఇన్‌క్యుబేషన్ ఆఫ్ ఎంటర్‌ప్రెనియర్స్ ఇన్‌సెంటివ్స్ ప్రోగ్రామ్ (టీ-ప్రైడ్)'అనే పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు గరిష్టంగా రూ.75 లక్షలకు మించకుండా పరిశ్రమలో 35 శాతం పెట్టుబడి రాయితీతోపాటు పలు ప్రోత్సాహకాలను ప్రకటించింది. దీంతో పెద్ద సంఖ్యలో ఎస్సీ, ఎస్టీలు పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చారు.

రూ. 262 కోట్ల బకాయిలు

- ఎస్సీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సంబంధించి.. 2016 ఏప్రిల్ 22 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎస్ఎల్‌సీ సమావేశాల్లో, 2016 ఆగస్టు 10 నుంచి ఇప్పటివరకు జరిగిన డీఎల్‌సీ సమావేశాల్లో మంజూరు చేసిన రూ.130 కోట్ల పెట్టుబడి రాయితీ నిధులను ఇంతవరకు చెల్లించలేదు. దాదాపు 2,500 మంది దళిత పారిశ్రామికవేత్తలు ఈ ప్రోత్సాహకాల కోసం ఎదురు చూస్తున్నారు.
- ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సంబంధించి 2016 జనవరి 8 నుంచి ఎస్ఎల్‌సీ సమావేశాల్లో, 2015 ఆగస్టు 31 నుంచి జరిగిన డీఎల్‌సీ సమావేశాల్లో మంజూరు చేసిన రూ.132 కోట్ల నిధులను ఇంకా చెల్లించాల్సి ఉంది. సుమారు 2,500 మంది రాయితీ నిధుల కోసం ఎదురు చూస్తున్నారు.

మూతపడేలా ఉన్నాయి

''ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు టీ-ప్రైడ్ కింద చెల్లించాల్సిన పెట్టుబడి రాయితీలను ఆరు నెలల లోపు విడుదల చేయాలి. పెట్టుబడి రాయితీలు ఆలస్యంగా విడుదల చేస్తుండటంతో బ్యాంకు రుణాలు నిరర్థక ఆస్తులుగా మారుతున్నాయి. పరిశ్రమలు మూతపడే పరిస్థితి తలెత్తుతోంది..''

- రాహుల్ కిరణ్, డిక్కీ



మంగళవారం ఆలేరులో శ్రీవిద్యను ర్యాలీగా తీసుకొస్తున్న విద్యార్థులు

శ్రీవిద్యకు ఘన స్వాగతం

ఆలేరు: రష్యాలోని ఎల్‌బరస్ పర్వతాన్ని అధిరోహించి.. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు వచ్చిన శ్రీవిద్యకు ఘనస్వాగతం లభించింది. బస్టాండ్ నుంచి పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఆమెను పాఠశాల యాజమాన్యం, పలువురు ఘనంగా సన్మానించారు. శ్రీవిద్య ప్రభుత్వ విప్ గొంగిడి సునీతను కలిశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి శ్రీ విద్య నివాళులర్పించారు.

✦ మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 1.25 లక్షలు

'ఒకే ఒక్కటి' కథనానికి స్పందించిన విజయ బ్యాంక్

సాక్షి ఎఫెక్ట్..

వైరా: ఖమ్మం జిల్లా వైరా మండలం గరికపాడు జెడ్పీఎస్ఎస్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి ఖమ్మంలోని విజయ బ్యాంక్ ముందుకు వచ్చింది. 20 ఏళ్ల క్రితం స్థాపించిన ఈ పాఠశాలలో రెండు వందల మంది వరకు విద్యార్థులుండగా, అందులో సుమారు వంద మంది విద్యార్థినులు ఉన్నారు. పాఠశాల మొత్తానికి ఒకే ఒక్క మరుగుదొడ్డి ఉండటం.. విద్యార్థినులు క్యూలో నిలబడాల్సి రావడాన్ని గత నెల 30న 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. 'ఒకే ఒక్కటి' శీర్షికన ప్రచురించిన ఫొటోను హైదరాబాద్‌లోని విజయ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ బీఎస్ రామారావు చూసి స్పందించారు. వెంటనే ఆయన గరికపాడు పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 1.25 లక్షలను మంజూరు చేశారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖమ్మం గాంధీ చౌక్‌లోని విజయబ్యాంక్ శాఖ బ్యాంక్ మేనేజర్ ఎం.శ్రీకాంత్ ఈ మంజూరు పత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతకుమారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' ప్రచురించిన ఫొటో ఆలోచింపజేసిందని అన్నారు. ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో 'సాక్షి' ముందంజలో ఉందన్నారు. విజయ బ్యాంక్ తన సామాజిక బాధ్యతగా మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని చెప్పారు. విజయ బ్యాంక్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక కార్యక్రమాలను ఆయన వివరించారు. హెచ్ఎం శాంతకుమారి మాట్లాడుతూ పాఠశాలలో సౌకర్యాలు, విద్యార్థుల కష్టాలను వెలుగులోకి తెచ్చి.. ఇక్కడి కష్టాలను పది మందికి తెలిసేలా చేసిన 'సాక్షి' యాజమాన్యానికి గ్రామస్తుల తరఫున, ఎస్ఎంసీ కమిటీ తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మంజూరు పత్రాన్ని హెచ్ఎం శాంతకుమారికి అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్

✦ స్కూల్ బ్యాగ్‌లో రక్తపింజర!

కేసముద్రం: ఓ విద్యార్థిని తెచ్చుకున్న పుస్తకాల సంచిలో రక్తపింజర పాము దాగివున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని కోమటిపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం చోటుచేసుకుంది. కోమటిపల్లి శివారు చంద్రుతండాకు చెందిన ఐదో తరగతి విద్యార్థిని అజ్మీరా అఖిల కోమటిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతోంది. బ్యాగ్‌లో నుంచి పుస్తకం తీయడానికి చేయిపెట్టింది. చేతికి మెత్తగా తాకినట్లుగా అనిపించడంతో బ్యాగ్‌ను పూర్తిగా తెరిచేసరికి లోపల పాము కనిపించింది. ఆమె ఒక్కసారిగా అరుస్తూ క్లాస్ టీచర్ క్రిష్ణయ్య వద్దకు పరుగెత్తింది. ఆ క్లాస్‌టీచర్, హెచ్ఎం సోమిరెడ్డి కలసి క్లాసులో ఉన్న పిల్లలందరినీ బయటకు పంపించారు. వెంటనే దాన్ని కర్రతో కొట్టి చంపేయడంతో ప్రమాదం తప్పింది.



బ్యాగులో కనిపించిన రక్తపింజర

✦ బకెట్‌లో పడి చిన్నారి మృతి

మెదక్ మున్సిపాలిటీ: నీటి బకెట్‌లో పడి ఓ చిన్నారి మృతి చెందింది. మెదక్ పట్టణంలోని నవాబుపేట వీధికి చెందిన మేకల వెంకటేశం-వరలక్ష్మి దంపతుల రెండో కూతురు సిరి (18 నెలలు) ఇంటి ఆవరణలో ఆడుకుంటూ పక్కనే ఉన్న బాత్రూమ్‌లోకి వెళ్లింది. బకెట్‌లో ఉన్న నీళ్లతో ఆడుకుంటూ బకెట్‌లో పడిపోయింది. సిరి కనిపించకపోవడంతో తల్లి వరలక్ష్మి వెతకడం ప్రారంభించింది. బాత్రూమ్‌లో నీటి బకెట్‌లో సిరి పడి ఉంది.



మృతి చెందిన చిన్నారి సిరి

టీఆర్ఎస్ నేత కుమారుడి హల్‌చల్

టోల్‌ప్లాజా వద్ద సిబ్బందిపై కత్తితో దాడిచేసిన అతడి మిత్రబృందం



దాడికి పాల్పడిన యువకులు, గాయపడిన టోల్‌ప్లాజా సూపర్‌వైజర్ మహేశ్‌గౌడ్

కడ్తాల్ (కల్వకుర్తి): శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రంగారెడ్డి జిల్లా కడ్తాల్-మైసిగండి మధ్య ఉన్న టోల్‌ప్లాజా వద్ద అధికార పార్టీ టీఆర్ఎస్ నేత కుమారుడు తన మిత్ర బృందంతో కలసి హల్‌చల్ చేశాడు. నిర్ణీత మార్గంలో వెళ్లాలని సూచించిన టోల్‌ప్లాజా సిబ్బందిపై కత్తులతో దాడి చేశారు. హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు చెందిన ఆరుగురు యువకులు అరుణ్‌రెడ్డి, నిషిత్, సాయితేజ్ రెడ్డి, మనీష్‌గౌడ్, సాయికుమార్, అనిరుధ్‌లు సోమవారం కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండిలో సాయితేజ్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరిపారు. వేడుకలకు సాయితేజ్‌రెడ్డితో పాటు, ఎల్‌బీనగర్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జి రామ్మోహన్‌గౌడ్ కొడుకు మనీష్‌గౌడ్, ఐదుగురు మిత్రులతో కలసి జిప్సీ వాహనంలో మైసిగండి వచ్చారు. బర్త్‌డే వేడుకల అనంతరం రాత్రి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో కడ్తాల్ టోల్‌ప్లాజా వద్ద నిర్ణీత మార్గంలో కాకుండా పక్కన ఉన్న బారికేడ్‌లను తొలగించి ముందుకు సాగారు. దీంతో టోల్‌ప్లాజాలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న కడ్తాల్‌కి చెందిన మాదారం మహేశ్ గౌడ్ సరైన దారిలో రావాలని కోరాడు. దీంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహేశ్‌గౌడ్‌పై దాడి చేశారు. వాహనంలో ఉన్న అరుణ్‌రెడ్డి కిందకు దిగి అప్పటికే తన వద్ద ఉన్న కత్తితో మహేశ్‌గౌడ్‌పై దాడి చేశాడు. తప్పించుకునే ప్రయత్నంలో అతనికి రెండు చేతులకు గాయాలయ్యాయి. గమనించిన టోల్‌గేట్ సిబ్బంది ఆ యువకులను పట్టుకోవడానికి ప్రయత్నించగా వారు వాహనంలో పారిపోయారు. వెంటనే టోల్‌ప్లాజా సిబ్బంది కడ్తాల్ ఎస్ఐ శ్రీకాంత్‌కు సమాచారం అందిచారు. దీంతో శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టి పారిపోతున్న యువకులను పట్టుకున్నారు. బాధితుడు మహేశ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు వారిపై సెక్షన్ 307 కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నా కుమారుడి ప్రమేయం లేదు



హైదరాబాద్: కడ్తాల్ టోల్‌ప్లాజా దాడి కేసులో తన కుమారుడు మనీష్‌గౌడ్‌కు ఎలాంటి సంబంధంలేదని ఎల్‌బీనగర్ టీఆర్ఎస్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ అన్నారు. మనీష్‌గౌడ్ కారు డ్రైవింగ్ చేస్తున్నాడని టోల్‌గేటు వద్ద జరిగిన దాడిలో అతని స్నేహితులు సాయి, నితీష్, అరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారని చెప్పారు. కారులో ఉన్నందునే తన కుమారుడిపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు.

సీఎం దృష్టికి ఆటోడ్రైవర్ల సమస్యలు

- తీసుకెళ్తానని రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి హామీ
- హన్మకొండలో ఘనంగా ఆటో డ్రైవర్ల దినోత్సవం



సభలో మాట్లాడుతున్న మంత్రి

హన్మకొండ చౌరస్తా/జనగామ/ఖిలా వరంగల్: తెలంగాణ ఉద్యమంలో ఆటోడ్రైవర్ల పాత్ర మరువలేనిదని.. వారి న్యాయమైన సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హన్మకొండలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. అంతకుముందు మంత్రి జనగామ, మడికొండల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆటోడ్రైవర్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు గుడిమల్ల రవికుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా ఆటోడ్రైవర్లు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి త్వరలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామన్నారు. బస్సు సౌకర్యంలేని ప్రాంతాల్లో ఆటో షెల్టర్లను నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. సభా వేదిక నుంచి యూనియన్ ప్రవేశపెట్టిన 11 తీర్మానాలలో తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించి.. మిగిలినవి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళతానన్నారు. రాష్ట్రంలో రూ.350 కోట్లతో కొత్తగా 1,400 బస్సులను కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రతి జిల్లాలో ఐదు ఎకరాల స్థలంలో డ్రైవర్లకు శిక్షణ ఇచ్చేందుకు రూ.5 కోట్లతో కేంద్రాలను నిర్మించాలని సీఎం నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

తెలంగాణలో మాఫియా రాజ్యం

విరసం నేత వరవరరావు



పెద్దపల్లి రూరల్: తెలంగాణలో మాఫియా రాజ్యం నడుస్తోందని విరసం నేత వరవరరావు అన్నారు. పెద్దపల్లి జిల్లా అప్పన్నపేటలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ సమయంలో 'నక్సల్స్ ఎజెండా యే నా ఎజెండా' అన్న కేసీఆర్ కుర్చీ ఎక్కిన తర్వాత దొరల పోకడకు తెర తీశారన్నారు. నేరెళ్ల ఘటనలో బాధిత కుటుంబాలకు ఇసుక మాఫియా నిందితుల ఆస్తులను పంచాలన్నారు. కరీంనగర్ జైలులో ఉన్న నేరెళ్ల బాధితులను వరవరరావు పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇక్కడి ఇసుక మాఫియా మామూలుది కాదని.. సింగపూర్, మలేషియాలకు ఇసుక రవాణా చేస్తున్న గోల్డ్ స్టోన్ కంపెనీకి చెందిందని, దీనికి కేటీఆర్‌తో సంబంధాలున్నాయన్నారు.

'నేరెళ్ల' నిందితులకు బెయిల్..

కరీంనగర్ క్రైం/లీగల్: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల నిందితులకు మంగళవారం కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసులు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. వీరిలో గ్రామానికి చెందిన పెంట బానయ్య, గంధం గోపాల్, చెప్యాల బాలరాజు, కోల హరీశ్, పూసల ఈశ్వర్ కుమార్, జిల్లెల్లకు చెందిన చీకోటి శ్రీనివాస్, కోరుకంటి గణేశ్, రామచంద్రాపూర్‌కు చెందిన బత్తుల మహేశ్‌లు ఉన్నారు. బాధితుల తరఫున ప్రజా సంఘాలు, పార్టీలు కోర్టును ఆశ్రయించాయి. వీరు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను విచారించి మొదటి అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. నిందితులు బెయిల్ పొందిన నాటినుంచి నెల రోజులపాటు వేములవాడలోనే ఉండాలని, ప్రతీ ఆదివారం, బుధవారం వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని షరతులు విధిస్తూ బెయిల్ మంజూరు చేసింది. కాగా, వీరు బుధవారం విడుదల అయ్యే అవకాశం ఉంది.

'అడ్మిషన్లలో సమస్యలను పరిష్కరించండి'

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని ప్రైవేటు బీఈడీ, డీఈడీ కళాశాలల అడ్మిషన్లలో కేంద్ర మార్గదర్శకాల అమలుపై తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని బీఈడీ, డీఈడీ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు మంగళవారం ఇక్కడ ఎంపీ చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌ను కలిశారు. అడ్మిషన్ల విధివిధానాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న అంతరాల కారణంగా విద్యార్థులు ఏడాది నష్టపోనున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుక్కోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రైవేటు బీఈడీ, డీఈడీ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు సూరం ప్రభాకర్‌రెడ్డి, కె.రాందాస్, జి.రాజేశ్, జె.నారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పోస్టుల భర్తీకి సర్కారు నో

- 402 పోస్టుల భర్తీ ప్రతిపాదనలను తిరస్కరించిన ఆర్థికశాఖ
- వ్యవసాయశాఖ పంపిన ఫైల్ వెనక్కి
- పోస్టుల భర్తీ కోసం నెల రోజులుగా ఉద్యాన విద్యార్థుల సమ్మె



సాక్షి, హైదరాబాద్: ఉద్యానాధికారుల పోస్టుల భర్తీకి సర్కారు అంగీకరించలేదు. 46 ఉద్యానాధికారులు (హెచ్‌వో), 356 ఉద్యాన విస్తరణాధికారుల (హెచ్ఈవో) పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ వ్యవసాయ శాఖ గతనెల 25న పంపిన ఫైలును ఆర్థికశాఖ మంగళవారం తిరస్కరించినట్టు ఉద్యానశాఖ వర్గాలు తెలిపాయి. మొత్తం 402 పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపించగా.. అందులో 46 హెచ్‌వో పోస్టులను కొత్తగా మంజూరు చేయాల్సి ఉంది. 356 హెచ్ఈవో పోస్టుల్లో 249 పోస్టులను కొత్తగా మంజూరు చేయాల్సి ఉండగా... మిగిలిన 107 పోస్టులను ఉద్యానశాఖలో పనిచేస్తున్న సబ్ అసిస్టెంట్ క్యాడర్‌కు పదోన్నతులు ఇచ్చి భర్తీ చేయాల్సి ఉంది. ఇటీవల సీఎం అనుమతితోనే ఈ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపించామని, కానీ ఆర్థికశాఖ తిరస్కరించిందని అధికారులు పేర్కొన్నారు. అత్యవసరమని భావిస్తే ప్రత్యేకంగా సీఎం కార్యాలయానికి విన్నవించాలని ఆర్థికశాఖ సూచించినట్లు తెలిసింది. దీంతో ఏం చేయాలో అర్థంగాక వ్యవసాయాధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

విద్యార్థుల నిరసన మరింత తీవ్రతరం!

ఉద్యానశాఖలో పోస్టుల భర్తీ కోసం కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీ విద్యార్థులు నెల రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో వర్సిటీలో తరగతులకు బ్రేక్ పడింది. సమ్మె కారణంగా క్షేత్రస్థాయిలో జరగాల్సిన పరిశోధనలు నిలిచిపోయాయి. తరగతులను బహిష్కరించి సమ్మె చేస్తుండటంతో వర్సిటీ అధికారులు సెలవులు ప్రకటించారు. హాస్టల్‌ను, మెస్‌నూ మూసివేయడంతో విద్యార్థులే స్వయంగా వంట చేసుకుంటూ నిరసన కొనసాగిస్తున్నారు. హాస్టళ్లకు కరెంటు, నీటి సరఫరా నిలిపివేశారని విద్యార్థులు చెబుతున్నారు. వ్యవసాయశాఖలో వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈవో) పోస్టులను భర్తీ చేసినట్లుగానే ఉద్యానశాఖలోనూ మండలానికి ఇద్దరు హెచ్ఈవో, ఒక హెచ్‌వో పోస్టులను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఉద్యాన డిప్లొమా కోర్సులు పూర్తి చేసి ఇంతవరకు 900 మంది విద్యార్థులు బయటకు వచ్చారని చెబుతున్నారు. కానీ ఇంతవరకు ప్రభుత్వం హెచ్ఈవో పోస్టులను సృష్టించలేదని విమర్శిస్తున్నారు. హెచ్ఈవో పోస్టులపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేదాకా సమ్మె కొనసాగిస్తామని విద్యార్థులు హెచ్చరిస్తున్నారు. తాజాగా పోస్టుల భర్తీని తిరస్కరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో విద్యార్థులు మరింత ఆందోళన వ్యక్తం చేసే అవకాశాలున్నాయి.

పోస్టుల తిరస్కరణతో కార్యకలాపాలకు అడ్డంకులు

ఉద్యానాభివృద్ధి సంస్థ కార్యకలాపాలు గతేడాది నుంచే ప్రారంభమయ్యాయి. మరోవైపు రాష్ట్ర అవసరాలకు తగినట్లుగా కూరగాయలు, పండ్లు తదితర ఉత్పత్తులను పండించాలని అందుకోసం పంట కాలనీలను ఏర్పాటు చేయాలని సీఎం వ్యవసాయ, ఉద్యానశాఖలను కోరారు. పోస్టుల తిరస్కరణతో ఈ కార్యకలాపాలకు అడ్డంకులు ఏర్పడతాయని అధికారులు అంటున్నారు.

బోధన్ స్కాంలో ఇద్దరికి బెయిల్

నిజామాబాద్ లీగల్: బోధన్ వాణిజ్య పన్నుల కుంభకోణంలో మరో ఇద్దరికి బెయిల్ మంజూరు చేస్తూ మంగళవారం మొదటి అదనపు కోర్టు మేజిస్ట్రేట్ మేరి సారా దానమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. కాగా, రిమాండ్‌లో ఉన్న చివరి ఇద్దరికీ బెయిల్ మంజూరుతో ఈ కేసుతో సంబంధం ఉన్న మొత్తం 9 మంది నిందితులకు బెయిల్ వచ్చినట్లు అయ్యింది. ఏ8 నిందితుడు, రిటైర్డ్ సీటీవో నారాయణ దాస్ వెంకట కృష్ణమాచారి, ఏ-9 నిందితుడు డిప్యూటీ కమిషనర్ ధరణి శ్రీనివాస రావులకు మంగళవారం బెయిల్ వచ్చింది. వీరి రిమాండ్ 90 రోజులు పూర్తి అయిన నేపథ్యంలో మెజిస్ట్రేట్ రూ. 10 వేల చొప్పున రెండు పూచీ కత్తులతో బెయిల్ జారీ చేశారు.



మహిళల సూపర్ లీగ్‌కు హర్మన్‌ప్రీత్ దూరం

భారత మహిళల క్రికెట్ స్టార్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఇంగ్లండ్‌లో జరిగే టి20 సూపర్ లీగ్‌కు దూరం కానుంది. ఇటీవలి ప్రపంచకప్‌లో తన అద్భుత బ్యాటింగ్‌తో అందరినీ ఆకట్టుకున్న హర్మన్‌ప్రీత్ ప్రస్తుతం భుజం నొప్పితో బాధపడుతోంది. దీంతో నెల రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో సర్రే స్టార్స్ జట్టు తరఫున ఆడలేకపోతోంది. 'ప్రపంచకప్ చివరి దశలో నొప్పితోనే ఆడాను. తాజాగా ఎడమ భుజంలో చీలిక ఏర్పడడంతో మహిళల సూపర్ లీగ్‌లో ఆడలేకపోతున్నాను' అని హర్మన్‌ప్రీత్ పేర్కొంది. గత డిసెంబర్‌లో ఆస్ట్రేలియాలో జరిగిన మహిళల టి20 బిగ్‌బాష్ లీగ్ లోనూ ఆడిన ఆమె అక్కడా విశేషంగా రాణించి అత్యధిక పరుగులు చేసిన రెండో క్రికెటర్‌గా నిలిచింది.



హైదరాబాద్‌లో టి20, వైజాగ్‌లో వన్డే



నాలుగు నెలల్లో స్వదేశంలో 23 అంతర్జాతీయ మ్యాచ్‌లు ● షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ

కోల్‌కతా: సొంతగడ్డపై కొత్త సీజన్‌లో భారత క్రికెట్ జట్టు ఫుల్ బిజీ బిజీ! ప్రస్తుతం కొనసాగుతున్న శ్రీలంక పర్యటన ముగిసిన వెంటనే సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు భారత్‌లో విరామం లేకుండా క్రికెట్ హోరెత్తించనుంది. ఈ నాలుగు నెలల కాలంలో భారత్‌లో ఏకంగా 23 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగనున్నాయి. ముందుగా ఆస్ట్రేలియా, ఆ తర్వాత న్యూజిలాండ్ పరిమిత ఓవర్ల సిరీస్‌లలో పాల్గొనేందుకు మన వద్దకు రానుండగా... ఆ తర్వాత వన్డేలు, టి20లతో పాటు టెస్టులు ఆడేందుకు శ్రీలంక ఇక్కడ అడుగు పెడుతుంది. దీనికి సంబంధించి పూర్తి షెడ్యూల్‌ను మంగళవారం బీసీసీఐ టూర్స్ అండ్ ఫిక్చర్స్ కమిటీ ప్రకటించింది. ఇందులో భాగంగా భారత్, ఆస్ట్రేలియాల మధ్య ఒక టి20 మ్యాచ్‌కు హైదరాబాద్ నగరం వేదిక కానుండగా... భారత్, శ్రీలంక మధ్య వన్డే మ్యాచ్‌కు విశాఖపట్నం ఆతిథ్యం ఇస్తుంది. కొత్తగా నిర్మించిన బర్సపర (గువాహటి), తిరువనంతపురం స్టేడియాలకు కూడా ఒక్కో మ్యాచ్‌ను కేటాయించారు. ఈ మ్యాచ్‌లకు సంబంధించిన తేదీలపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. దేశ వ్యాప్తంగా వేర్వేరు నగరాల్లో మ్యాచ్‌లు ఉన్నాయని... స్థానిక పండుగలు, సెలవు దినాలువంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని తర్వాత తేదీలు ఖరారు చేస్తామని బోర్డు తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి వెల్లడించారు.

రంజీ ట్రోఫీ ఫార్మాట్‌లో మార్పులు

భారత దేశవాళీ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీ నిర్వహణకు సంబంధించి బీసీసీఐ కొన్ని కీలక మార్పులు చేసింది. సౌరవ్ గంగూలీ నేతృత్వంలోని సాంకేతిక కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. గత ఏడాది నిర్వహించిన తటస్థ వేదికల పద్ధతిపై తీవ్ర విమర్శలు రావడంతో దానికి స్వస్తి చెప్పారు. గతంలోలాగే కొన్ని హోం మ్యాచ్‌లు, కొన్ని బయటి మ్యాచ్‌ల పద్ధతితో టోర్నీని నిర్వహిస్తారు. అయితే నాకౌట్ మ్యాచ్‌లు మాత్రం తటస్థ వేదికల్లోనే జరుగుతాయి. అక్టోబర్ 6న రంజీ ట్రోఫీ ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు 28 జట్లతో మూడు గ్రూప్‌లలో మ్యాచ్‌లు నిర్వహించారు. ఈసారి దీనిని మారుస్తూ మొత్తం జట్లను నాలుగు గ్రూప్‌లు ఎ, బి, సి, డి లుగా విభజిస్తున్నారు. ఒక్కో గ్రూప్‌లో 7 జట్లు ఉండగా, ప్రతీ జట్టు లీగ్ దశలో ఆరు మ్యాచ్‌లు ఆడుతుంది. ప్రతీ గ్రూప్‌లో టాప్-2 టీమ్‌లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఈ ఫార్మాట్ వల్ల రంజీ ట్రోఫీ మొత్తం మ్యాచ్‌ల సంఖ్య తగ్గనుంది. మరోవైపు ఈ సారి కూడా దులీప్ ట్రోఫీ మ్యాచ్‌ను గులాబీ బంతితోనే నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది.

షెడ్యూల్ వివరాలు

ఆస్ట్రేలియా (సెప్టెంబర్ 11-అక్టోబర్ 11): చెన్నై, బెంగళూరు, నాగపూర్, ఇండోర్, కోల్‌కతా (5 వన్డేలు), హైదరాబాద్, రాంచీ, బర్సపర (3 టి20లు).

న్యూజిలాండ్ (అక్టోబర్ 22-నవంబర్ 7): పుణే, ముంబై, కాన్పూర్ (3 వన్డేలు), న్యూఢిల్లీ, కటక్, రాజ్‌కోట్ (3 టి20లు).

శ్రీలంక (నవంబర్ 15- డిసెంబర్ 24): కోల్‌కతా, నాగపూర్, న్యూఢిల్లీ (3 టెస్టులు), ధర్మశాల, మొహాలి, వైజాగ్ (3 వన్డేలు), తిరువనంతపురం, ఇండోర్, ముంబై (3 టి20లు)



రాహుల్‌ను పట్టేసిన యూపీ యోధ ఆటగాళ్లు

టైటాన్స్‌కు మళ్లీ నిరాశ

సొంతగడ్డపై వరుసగా మూడో ఓటమి

సాక్షి, హైదరాబాద్: తెలుగు టైటాన్స్ ఈ సీజన్‌లో మళ్లీ నిరాశపరిచింది. సొంత ప్రేక్షకుల మధ్య వరుసగా మూడోసారీ ఓడింది. మంగళవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాహుల్ సేన 18-31 స్కోరు తేడాతో కొత్త జట్టు యూపీ యోధ చేతిలో కంగుతింది. తొలి అర్ధభాగంలో ఇరు జట్ల ఆటగాళ్లు నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. దీంతో 11-12తో టైటాన్స్ ఒక్క పాయింట్ తేడాతో వెనుకబడింది. కానీ ద్వితీయార్ధంలో పేలవమైన ఆటతీరుతో మూల్యం చెల్లించుకుంది. మ్యాచ్ జరిగే కొద్దీ ప్రత్యర్థి జోరు పెరిగింది. టైటాన్స్ మాత్రం చేష్టలుడిగింది. తెలుగు టైటాన్స్ కెప్టెన్ రాహుల్ చౌదరి 7 పాయింట్లతో రాణించగా, వికాస్, విశాల్ చెరో 3, రాకేశ్ 2 పాయింట్లు చేశారు. యూపీ ఆటగాళ్లు సమష్టిగా కదంతొక్కారు. నితిన్ తోమర్ (6) సహా... రిషాంక్ దేవాడిగా, నితీశ్ కుమార్ చెరో 5 పాయింట్లు సాధించారు. మహేశ్ గౌడ్ (4), సురీందర్ సింగ్ (3), రాజేశ్ నర్వాల్ (2), జీవ కుమార్ (2) రాణించారు. మరో మ్యాచ్‌లో కొత్త జట్టు గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ 26-20తో దబాంగ్ ఢిల్లీ జట్టుపై విజయం సాధించింది.

నేడు జరిగే మ్యాచ్‌ల్లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌తో హర్యానా స్టీలర్స్ (రాత్రి గం. 8.00 నుంచి); బెంగాల్ వారియర్స్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి గం. 9.00 నుంచి) తలపడతాయి. మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

రవీంద్ర జడేజా టాప్ ర్యాంక్ పదిలం

దుబాయ్: భారత స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజా అంతర్జాతీయ క్రికెట్ మండలి టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మంగళవారం వెల్లడించిన ఈ జాబితాలో శ్రీలంక స్పిన్నర్ రంగన హెరాత్‌ను వెనక్కి నెట్టి అశ్విన్ తిరిగి రెండో స్థానానికి చేరాడు. హెరాత్ మూడో స్థానంలో ఉన్నాడు. ఆల్‌రౌండర్స్ జాబితాలో జడేజా, అశ్విన్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. షకీబ్ టాప్‌లో ఉన్నాడు. బ్యాటింగ్ విభాగంలో కెప్టెన్ కోహ్లి తన ఐదో స్థానాన్ని నిలబెట్టుకోగా, పుజారా నాలుగో స్థానం.. ధావన్ 39 నుంచి 21వ స్థానానికి ఎగబాకాడు.

బ'ధీర'కు సాయం కరవు!

బధిరుల ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన షేక్ జాఫ్రీన్

- కర్నూలు నుంచి ఒలింపిక్స్ వరకు ఎదిగిన వైనం
- పట్టించుకోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: ఆ అమ్మాయి బధిరురాలు. అయితేనేం... ఆమె పట్టుదల ముందు టెన్నిస్ ఆట కూడా చిన్నదిగా మారిపోయింది. కఠోర శ్రమతో ఆమె బధిరుల టెన్నిస్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చింది. గత నాలుగేళ్లలో అంతర్జాతీయ స్థాయిలో అనేక విజయాలు సాధించిన ఈ అమ్మాయి తాజాగా ఒలింపిక్ పతకంతో సత్తా చాటింది. టర్కీలో జరిగిన బధిరుల (డెఫ్) ఒలింపిక్స్‌లో ఆమె మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం గెలుచుకుంది. ఆ అమ్మాయి పేరు షేక్ జాఫ్రీన్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు ఆమె స్వస్థలం. ఆటలో ఎదిగేందుకు ఆర్థికపరంగా ఎన్నో కష్టాలు అనుభవించిన జాఫ్రీన్... ఇప్పుడు ఒలింపిక్ పతకం తర్వాతనైనా తనను గుర్తించాలని కోరుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తోంది.

నిలకడగా రాణింపు...

జాఫ్రీన్ తండ్రి షేక్ జాకీర్ తన కూతురికి టెన్నిస్‌పై ఉన్న ఆసక్తిని చూసి ప్రోత్సహించారు. బధిరురాలే అయినా ఆమెను ఎక్కడా నిరుత్సాహ పరచకుండా తగిన శిక్షణ ఇప్పించేందుకు సిద్ధమయ్యారు. కర్నూలులో ప్రాథమిక శిక్షణ అనంతరం మెరుగైన సౌకర్యాల కోసం ఆమె హైదరాబాద్‌కు వచ్చింది. ఆర్థిక పరిస్థితి గొప్పగా లేకపోయినా పెద్ద మొత్తంలో అందు కోసం ఆయన ఖర్చు చేశారు. జాతీయ స్థాయిలో రాణించిన అనంతరం 2013 డెఫ్ ఒలింపిక్స్ (బల్గేరియా)లో ఐదో స్థానంలో నిలవడంతో జాఫ్రీన్‌కు గుర్తింపు లభించింది. దాంతో టాప్ క్రీడాకారిణి సానియా మీర్జా తన సొంత అకాడమీలో ఆమెకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. దీనిని ఉపయోగించుకున్న జాఫ్రీన్... ఆ తర్వాత నేషనల్, ఆసియా-పసిఫిక్, వరల్డ్ డెఫ్ గేమ్స్‌లలో వరుస విజయాలు సాధించింది. అయితే కూతురికి అత్యుత్తమ శిక్షణ ఇప్పించే క్రమంలో జాకీర్ సొంత ఇల్లు, ఆస్తులు, బంగారం కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. కొన్నాళ్ల క్రితం ఒలింపిక్స్ సన్నాహాల కోసం ఆయన రూ. 7 లక్షలతో చైనాలోని షాంఘైలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. తల్లిదండ్రుల కష్టాన్ని వృథా పోనివ్వని జాఫ్రీన్...



ఇప్పుడు డెఫ్ ఒలింపిక్స్‌లో పతకంతో తన ఘనతను ప్రదర్శించింది. జాఫ్రీన్ ప్రస్తుతం కర్నూలులోని ఉస్మానియా కళాశాలలో మూడో సంవత్సరం డిగ్రీ చదువుతోంది. వివిధ అంతర్జాతీయ టోర్నీలలో విజేతలుగా నిలుస్తున్న క్రీడాకారులకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నజరానాలు అందించింది. అదే కోవలో తనను కూడా ఆదుకోవాలని ఆమె ఆశిస్తోంది.



"నా కుమార్తెకు శిక్షణ ఇప్పించేందుకు ఆస్తులు అమ్ముకున్నా. ఆర్థికపరంగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటికి ఎదురీది ఒలింపిక్స్‌లో పతకం సాధించే వరకు ఆగలేదు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మాకు ఏ రకంగానూ సహాయం అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం నా కుమార్తెకు నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి. ఇక ముందు మరింత మెరుగైన శిక్షణా సౌకర్యాలు కల్పిస్తే 2021లో జరిగే ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించే సామర్థ్యం జాఫ్రీన్‌కు ఉంది."

– షేక్ జాకీర్, జాఫ్రీన్ తండ్రి

విజేతలకు విమానాశ్రయంలో చేదు అనుభవం

ఆహ్వానించడానికి రాని 'సాయ్' అధికారులు

టర్కీలో బధిరుల ఒలింపిక్స్‌లో పాల్గొని మంగళవారం ఢిల్లీ విమానాశ్రయం చేరుకున్న విజేతలకు చేదు అనుభవం ఎదురైంది. తమను ఆహ్వానించడానికి కేంద్ర క్రీడల మంత్రి గానీ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) అధికారులు గానీ ఎవరూ విమానాశ్రయానికి రాకపోవడంపై వారు తీవ్ర నిరాశ చెందారు. ఇతర క్రీడల్లో విజేతలైన క్రీడాకారులను ఆహ్వానించడానికి క్యూ కట్టే మంత్రులు, అధికారులు ఇప్పుడు ఎక్కడని వారు ప్రశ్నించారు. విమానాశ్రయంలోనే వారు తమ నిరసనను ప్రదర్శించారు. అధికారులు వచ్చే వరకు అక్కడి నుంచి కదలమని పట్టు పట్టారు. దాంతో 'సాయ్' ప్రతినిధులు వెంటనే విమానాశ్రయానికి చేరుకొని క్రీడాకారులకు నచ్చ చెప్పారు. కేంద్ర క్రీడల మంత్రి విజయ్ గోయల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటం వల్ల రాలేకపోయారని, ఆయనతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేయిస్తామని వారు హామీ ఇచ్చారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియానికి తీసుకెళ్లి వసతి కల్పించారు. టర్కీలోని సామ్‌సన్‌లో ఆదివారం ముగిసిన డెఫ్ ఒలింపిక్స్‌లో భారత్ ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్య పతకాలు (మొత్తం 5) సాధించింది. మరో వైపు పారాలింపిక్స్ విజేతలకు ఇచ్చినట్లుగానే తమకు కూడా రూ. 75 లక్షల నగదు ప్రోత్సాహకం ఇవ్వాలని కూడా బధిర క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు.

కశ్యప్ శుభారంభం



ఆక్లాండ్: న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్‌లో పారుపల్లి కశ్యప్, ప్రణయ్, సిరిల్ వర్మ, సౌరభ్ వర్మ శుభారంభం చేయగా... రెండో సీడ్ అజయ్ జయరామ్ పరాజయం చవిచూశాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో కశ్యప్ కేవలం 22 నిమిషాల్లో 21-5, 21-10తో రుంబాకా (ఇండోనేసియా)ను చిత్తుగా ఓడించాడు. ఇతర మ్యాచ్‌ల్లో ప్రణయ్ 21-14, 21-16తో రుస్తావితో (ఇండోనేసియా)పై, సౌరభ్ వర్మ 21-17, 21-15తో నాథన్ (ఆస్ట్రేలియా)పై, సిరిల్ వర్మ 21-13, 21-12తో రియాంతో సుబగ్జా (ఇండోనేసియా)పై గెలిచారు. అజయ్ జయరామ్ 19-21, 13-21తో చియా హుంగ్ లూ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు.

సిరాజ్‌కు మూడు వికెట్లు



ప్రిటోరియా: ముక్కోణపు సిరీస్‌లో భారత్ 'ఎ' జట్టు రెండో విజయాన్ని సాధించింది. అఫ్గానిస్తాన్ 'ఎ'తో జరిగిన వన్డేలో భారత్ 'ఎ' 113 పరుగుల తేడాతో నెగ్గింది. ముందుగా భారత్ 'ఎ'.. మనీశ్ పాండే (86 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్), రిషభ్ పంత్ (59 బంతుల్లో 60; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో చెలరేగడంతో 50 ఓవర్లలో 5 వికెట్లకు 322 పరుగుల భారీ స్కోరు సాధించింది. చివర్లో కృనాల్ పాండ్యా (27 బంతుల్లో 48; 7 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఆటతో విరుచుకుపడ్డాడు. ఆ తర్వాత అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 209 పరుగులు చేసి ఓడింది. హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్ (3/49) అఫ్గానిస్తాన్‌ను కట్టడి చేశాడు. విజయ్ శంకర్, సిద్ధార్థ్ కౌల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

37 ఏళ్ల అనుభవం పనికొస్తుంది!

కోచ్‌గా కొత్తగా చేయాల్సిందేమీ లేదు

- ఆడే వాతావరణం కల్పిస్తే చాలు
- రవిశాస్త్రి వ్యాఖ్యలు

కొలంబో: భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ ఎంపిక విషయంలో ఇటీవలి కాలంలో ఎంతో చర్చ జరిగింది. విభేదాలు, వివాదాలు అన్నీ వార్తల్లో నిలిచాయి. ఇలాంటి స్థితిలో రవిశాస్త్రి ఆ బాధ్యతలు చేపట్టారు. అయితే భారత క్రికెట్ జట్టుకు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లు ప్రత్యేకంగా ఉన్న సమయంలో శాస్త్రి బాధ్యతలు ఏమిటనేది అస్పష్టం. దీనికి ఆయన తనదైన రీతిలో సమాధానం ఇచ్చారు. 'నేను సహాయక సిబ్బంది మొత్తానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నాను. మన జట్టు సభ్యులు మనసులో ఎలాంటి ఆందోళన, ఒత్తిడి లేకుండా మైదానంలోకి వెళ్లి స్వేచ్ఛగా, భయం లేకుండా, సానుకూల దృక్పథంతో తమ ఆటను ప్రదర్శించేలా సిద్ధం చేయడమే నా పని. అదో రకమైన కళ. అది నాకు తెలుసు కాబట్టే ఈ పదవిలో ఉన్నాను' అని ఆయన జవాబిచ్చారు. తాను గతంలో టీమ్ డైరెక్టర్‌గా ఎక్కడ పనిని ముగించానో, ప్రస్తుతం అక్కడి నుంచే దానిని కొనసాగిస్తున్నానని రవిశాస్త్రి వ్యాఖ్యానించారు. 'నేను అదనపు బాధ్యతలతో ఇక్కడికి రాలేదని నా అభిప్రాయం. జట్టు కూడా అదే కాబట్టి మరో ఆలోచన లేకుండా అలా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోతే సరి. అంతా అలవోకగా సాగిపోతుంది. కొత్తగా నేను చేయాల్సిందేమీ లేదు. ఆట ఆడమని చెప్పి నేను పక్కకు తప్పుకుంటే సరిపోతుంది' అని శాస్త్రి అన్నారు. కుంబ్లే కోచ్‌గా ఉన్న సమయంలో తమపై అజమాయిషీ చలాయించారని, ఒక రకంగా నియంతలా వ్యవహరించారని కూడా ఆటగాళ్లు ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. మరి ఇలాంటి అంశాలను చక్కబెట్టడంలో శాస్త్రి శైలి ఏమిటనే దానికి కూడా ఆయన పంచ్ డైలాగ్ చెప్పారు. 'నేను 37 ఏళ్లుగా క్రికెట్‌లో కొనసాగుతున్నాను. ఆటగాడిగా, కామెంటేటర్‌గా అనుభవం ఉంది. కాబట్టి ఆటగాళ్లతో ఎలా వ్యవహరించాలో నాకు బాగా తెలుసు.



ప్రాక్టీస్ సెషన్‌లో రోహిత్ శర్మకు కోచ్ రవిశాస్త్రి సూచనలు

ఇన్నేళ్ల పాటు నిరంతరాయంగా క్రికెట్‌తో అనుబంధం ఉంది. అందువల్ల ఈతరం క్రికెటర్లను కూడా అర్థం చేసుకోగలను. అసలు ఈ దశలో వారికి కోచింగే అవసరం లేదు. చక్కటి వాతావరణం కల్పించి వారు ఆడేలా ప్రోత్సహిస్తే చాలు' అని రవిశాస్త్రి స్పష్టం చేశారు.

వారు కూడా సాధించలేనిది...

భారత క్రికెట్‌లో గొప్ప పేరున్న అనేక మంది క్రికెటర్లకు కూడా సాధ్యం కాని ఘనతను ప్రస్తుత జట్టు సాధించిందని రవిశాస్త్రి ప్రశంసలు కురిపించారు. 'ఉదాహరణకు శ్రీలంక గడ్డపై 20 ఏళ్ల తర్వాత టెస్టు సిరీస్ గెలవడం అలాంటిదే. ఎంతో మంది క్రికెటర్లు 20 ఏళ్ల పాటు భారత్‌కు ఆడారు. అనేక సార్లు లంకలో పర్యటించారు కానీ సిరీస్ గెలవలేకపోయారు. గత జట్లకు సాధ్యం కాని విధంగా ఈ కుర్రాళ్లు వన్డే సిరీస్ కూడా గెలిచారు' అని ఆయన అన్నారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లలో సిరీస్‌ల గురించి ఇప్పుడే ఆలోచించడం లేదని, దానిని కూడా సవాల్‌గా భావించి గెలవగల సామర్థ్యం ఈ జట్టుకు ఉందని శాస్త్రి చెప్పారు. నాయకుడిగా ఇప్పటికే అనేక విజయాలు సాధించిన కోహ్లి, భారత అత్యుత్తమ కెప్టెన్‌గా ఎదిగే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

హరికృష్ణకు మరో విజయం



న్యూఢిల్లీ: బీల్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ మూడో విజయాన్ని సాధించాడు. పనోమరియోవ్ (ఉక్రెయిన్)తో మంగళవారం జరిగిన ఎనిమిదో రౌండ్‌లో నల్లపావులతో ఆడిన హరికృష్ణ 58 ఎత్తుల్లో గెలుపొందాడు. ఎనిమిదో రౌండ్ తర్వాత హరికృష్ణ 5.5 పాయింట్లతో హూ ఇఫాన్ (చైనా)తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. బుధవారం జరిగే చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో ఎటెన్ని బాక్రోట్ (ఫ్రాన్స్)తో హరికృష్ణ తలపడతాడు.

ప్రోత్సాహానికి చాలా సంతోషం!

మిథాలీ రాజ్ వ్యాఖ్య ● కారు బహుమతిగా అందుకున్న కెప్టెన్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ కప్‌లో ఫైనల్ చేరిన అనంతరం అన్ని వైపుల నుంచి తమకు అందుకున్న ప్రోత్సాహకాలపై భారత జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ సంతోషం వ్యక్తం చేసింది. ఈ విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు కూడా ముందుకు రావడం మంచి పరిణామమని ఆమె చెప్పింది. భారత క్రికెట్ జూనియర్ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్, తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు వి.చాముండేశ్వరీనాథ్, మిథాలీ రాజ్‌కు మంగళవారం ప్రత్యేకంగా బీఎండబ్ల్యూ 320డి సిరీస్ కారును బహుమతిగా అందజేశారు. వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన క్రికెటర్‌గా నిలిచినందుకు ఆమెకు ఈ కానుక ఇస్తున్నట్లు చాముండి చెప్పారు. మిథాలీ కెరీర్ ఆరంభంలో కూడా ఆయన ఇదే తరహాలో కారును బహుమతిగా ఇచ్చి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మిథాలీ మాట్లాడుతూ 'ఆటగాళ్లకు ఈ తరహా ప్రోత్సాహకాలు ఉత్ప్రేరకంగా పని చేస్తాయి. క్రీడాకారులకు చాముండి ఇస్తున్న మద్దతు అమూల్యం. గతంలో కూడా అనేక సార్లు ఆయన గిఫ్ట్‌గా ఇచ్చిన బ్యాట్‌లతో భారీగా పరుగులు సాధించాను' అని గుర్తు చేసుకుంది. మరోవైపు మ్యాక్సీ విజన్ సంస్థ జీవితకాలం మిథాలీ కుటుంబానికి ఉచిత చికిత్స అందించేందుకు సిద్ధమైంది. ఈ కార్యక్రమంలో మ్యాక్సీ సంస్థ ప్రతినిధి డాక్టర్ వెల్లా, బయోలాజికల్ ఇవాన్స్ ఎండీ మహిమా దత్తా తదితరులు పాల్గొన్నారు.



ఫేస్‌బుక్ చాట్‌బోట్.. కిలికిలి భాష!



అనుకున్నంత పనీ అయింది..
తృటిలో ప్రమాదం తప్పిపోయింది.. లేదంటేనా
మనమంతా రోబోల చెప్పు చేతల్లో మెలగాల్సిన పరిస్థితి వచ్చేసేది!
మానవజాతికి ఇంత పెద్ద విపత్తు వచ్చిపడితే.. ఎక్కడా హాడావుడే లేదే..!
ఏమా విపత్తు.. ఎలా వచ్చింది.. ఎలా తప్పిపోయింది..

- సొంత భాష అభివృద్ధి చేసుకున్న చాట్‌బోట్‌లు
- ఉలిక్కిపడ్డ శాస్త్రవేత్తలు.. వెంటనే వ్యవస్థల నిలిపివేత
- ఎప్పటికైనా చిక్కులు తప్పవని హెచ్చరిస్తున్న నిపుణులు..

మీరెప్పుడైనా వెబ్‌సైట్‌లోని చాట్‌బోట్‌తో మాట్లాడారా? నిన్న మొన్నటివరకూ ఇలాంటి చాట్‌బోట్‌లతో చెడ్డ చిక్కుండేది.. మనం ఒకటి అడిగితే.. అది తనకు తోచిన రీతిలో.. లేదంటే సాఫ్ట్‌వేర్‌లో ఏది ఉంటే అదే చెప్పేది. కానీ కృత్రిమ మేధస్సు పుణ్యమా అని ఈ మధ్య అవీ తెలివి మీరాయి. అచ్చం మనుషుల్లాగే సందర్భానికి తగ్గట్లు మాట్లాడుతున్నాయి. దాదాపు ఇలాంటి చాట్‌బోట్ ప్రోగ్రామే ఫేస్‌బుక్‌లోనూ ఉంది. ఫేస్‌బుక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రీసెర్చ్ పేరుతో నడుస్తున్న ప్రాజెక్టులో గత నెల ఓ విచిత్రమైన 'ప్రమాదం' చోటు చేసుకుంది. కొన్ని చాట్‌బోట్‌లు తమ కోసం ఓ భాషను సృష్టించుకున్నాయి. పదాలు ఇంగ్లిషులోనే ఉన్నప్పటికీ.. ఆ వాక్యాలు చూస్తే మనకు ఏమీ అర్థం కాదు. కానీ మిగిలిన చాట్‌బోట్లు మాత్రం అదే భాషలో స్పందిస్తున్నాయి. తామిచ్చిన కోడ్‌లను ధిక్కరించాయని శాస్త్రవేత్తలు అర్థం చేసుకున్నారు. ఈ పరిణామంతో ఉలిక్కిపడ్డ శాస్త్రవేత్తలు వెంటనే ఆ చాట్‌బోట్ తాలూకు సర్వర్‌ను ఆఫ్ చేశారు.

అంత సీరియస్ వ్యవహారమా..

చాలా సీరియస్. ఎందుకంటే ఆ చాట్‌బోట్లు ఏం మాట్లాడుతున్నాయో మనకు తెలియదు. తెలిసో తెలియకో మనుషులకు హాని కలిగించే చర్యలకు పాల్పడితే..? ఇంటర్నెట్‌కు అనుసంధానమైన వ్యవస్థలను తనకిష్టమొచ్చినట్లు నడిపించడం మొదలుపెడితే...? తలుచుకుంటునే ఒళ్లు గగుర్పొడిచే భవిష్యత్ అది. కాకపోతే ఫేస్‌బుక్ నిపుణులు సర్వర్‌ను సకాలంలో ఆపేశారు కాబట్టి ప్రస్తుతానికి సమస్య లేనట్లే.

చాట్‌బోట్‌కు అంత అవసరమేమొచ్చింది

చాట్‌బోట్‌లు సొంత భాష సృష్టించుకోవడం వెనుక మన అజాగ్రత్త కూడా కొంత ఉంది. ఈ చాట్‌బోట్లను సంప్రదింపులు (లావాదేవీలు జరపడం.. మీతో ఏదైనా వస్తువు/సేవ కొనేలా చేయడం) జరిపేందుకు ఉద్దేశించారు. వెబ్‌సైట్ల ద్వారా ఇతరులతో మాట్లాడిన ప్రతిసారి ఇవి కొన్ని కొత్త విషయాలను నేర్చుకుని తర్వాతి సంప్రదింపుల్లో వాటిని ఉపయోగిస్తుంటాయి. తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరచుకోవడం ఈ చాట్‌బోట్ల ముఖ్య లక్ష్యం. ఈ వ్యవస్థను అభివృద్ధి చేసే క్రమంలో శాస్త్రవేత్తలు అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకున్నారు కానీ ఒక్క భాష విషయాన్ని మాత్రం మర్చిపోయారు. మొదట్లో ఈ చాట్‌బోట్లు మనకు అర్థమయ్యే ఇంగ్లిష్‌లోనే సంప్రదింపులు జరిపేవి. అయితే ఈ చర్యకు బహుమతుల్లాంటివేవీ లేకపోవడంతో చాట్‌బోట్లు ఈ భాషకు తాము కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదన్న అంచనాకు వచ్చాయి. మంచి చాట్‌బోట్‌గా మారాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇంగ్లిష్ భాష ద్వారా వచ్చే లాభమేమీ లేదనుకున్నాయో ఏమో కానీ కొంత కాలం తర్వాత తమదైన భాషలో మాట్లాడటం మొదలుపెట్టాయి. 'మనుషులతో చక్కగా మాట్లాడగలిగే బోట్లను సృష్టించాలనుకున్నాం గానీ.. ఇవి తమదైన భాషను అభివృద్ధి చేసుకోవడంతో సమస్య మొదలైంది. వాటి భాషను మన భాషలోకి అనువదించగలిగాం కానీ అది ఎంత వరకు సరైనదో మాకే తెలియదు. ఎందుకంటే చాట్‌బోట్ల భాష తెలిసిన వారెవరూ లేరు కదా' అని ప్రాజెక్టులో పనిచేస్తున్న మైక్ లూయిస్ పేర్కొన్నారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

భవిష్యత్తు ఏంటి?

ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్ వంటి పేర్లు తరచూ వినిపిస్తున్న ఈ తరుణంలో ఫేస్‌బుక్ చాట్‌బోట్ల వ్యవహారం కాస్త ఇబ్బంది పెట్టేదే. కృత్రిమ మేధస్సు గురించి మనకు తెలిసింది తక్కువే నని ఈ రంగంపై మరింత లోతైన చర్చ జరగాల్సిన అవసరముందనే విషయాన్ని ఈ ఘటన నుంచి నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. శాస్త్ర ప్రపంచం కూడా కృత్రిమ మేధస్సుపై రెండుగా చీలిపోయింది. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్, ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్, టెస్లా సీఈవో ఎలన్ మస్క్ వంటి వారు ఈ టెక్నాలజీతో ఎప్పటికైనా చిక్కులు తప్పవని హెచ్చరిస్తున్నారు. అయితే ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్‌తో పాటు మరికొందరు కృత్రిమ మేధస్సుకు మద్దతుగా నిలుస్తున్నారు. 'కృత్రిమ మేధస్సుపై జుకర్‌బర్గ్‌తో మాట్లాడా. దీనిపై అతడికి ఉన్నది చాలా పరిమితమైన జ్ఞానమని నాకు అర్థమైంది' అని ఎలన్ మస్క్ విమర్శించిన కొద్ది రోజులకే ఇలా జరగడం గమనార్హం.



✦ రాములోరి తలంబ్రాలకు వరి నాట్లు

గోకవరం (జగ్గంపేట): భద్రాద్రి రాముని కల్యాణంలో వినియోగించే కోటి తలంబ్రాల కోసం కోరుకొండ శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణం అప్పారావు ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో మంగళవారం వరినాట్లు వేశాడు. ఈ కార్యక్రమంలో భాగంగా హనుమంతుడి వేషంలోని ఓ రామభక్తుడు శ్రీరామ నామం జపిస్తూ ఆకుమడి కట్టలు కట్టి నాట్లు వేశాడు.

✦ భద్రాద్రి అభివృద్ధి తుది నమూనా సిద్ధం



చినజీయర్‌స్వామికి నమూనా చూపుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి ఆలయ అభివృద్ధి తుది నమూనా సిద్ధమైంది. గతంలోనే ఆర్కిటెక్ట్ ఆనంద్‌సాయి ఆధ్వర్యంలో ఓ నమూనాను దాదాపు ఖరారు చేసినా.. అందులో కొన్ని అంశాలు ఆగమశాస్త్ర విరుద్ధంగా ఉన్నాయని ఆలయ పండితులు, అర్చకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం వాటిలో మార్పుచేర్పులకు ఆదేశించింది. వాటిని మార్చిన తర్వాత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ఆర్కిటెక్ట్, ఆలయ అధికారులతో కలసి వెళ్లి చిన జీయర్ స్వామికి నమూనాలను చూపించారు. వాటిపట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేయటంతో తుది నమూనా ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

✦ పారిశ్రామిక పార్కులకు మినహాయింపు

భూసేకరణ చట్టంలోని నిబంధనలు సడలిస్తూ ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏర్పాటు చేయ నున్న మూడు పారిశ్రామిక పార్కుల అవసరాల కోసం జరిపే భూసేకరణకు 2013 భూసేకరణ చట్టంలోని చాప్టర్–2,3 నిబంధనలను సడలిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జహీరాబాద్‌లో నిర్మించనున్న నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్(నిమ్జ్), దండుమల్కాపురంలో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక పార్కు, వరంగల్‌లో నిర్మిస్తున్న కాకతీయ టెక్స్‌టైల్స్ పార్కులకు ఈ మినహాయింపులనిచ్చింది. 2013 భూసేకరణలోని చాప్టర్–2, 3లను అమలు చేస్తే భూసేకరణతో జరిగే సామాజిక మార్పులపై మదింపుతోపాటు బహిరంగ విచారణ, బాధితులకు పునరావాసం, పునఃనిర్మాణం లాంటి కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూసేకరణ చట్టం 2017 ద్వారా ఈ కార్యక్రమాలేవీ చేపట్టకుండానే బాధితులకు పరిహారం చెల్లిస్తారు.


✦ విద్యుత్ సంస్థలకు హైకోర్టు నోటీసులు

రైతుల భూముల్లో విద్యుత్ లైన్లపై స్పందించిన ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: రైతుల భూముల్లో విద్యుత్ లైన్లు వేస్తున్న విద్యుత్ సంస్థలు వారికి ఎటువంటి పరిహారం ఇవ్వడంలేదని, ఈ విషయంలో తగిన ఆదేశాలు జారీ చేయాలంటూ కన్సార్షియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్స్ (సీఐఎఫ్ఎ) ప్రధాన సలహాదారు పి.చంగల్‌రెడ్డి చేసిన అభ్యర్థనపై ఉమ్మడి హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలను తమ ముందుంచాలంటూ ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ఉభయ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విద్యుత్ సంస్థలు, విద్యుత్ నియంత్రణ మండళ్లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిల ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. రైతుల పొలాల్లో వేస్తున్న విద్యుత్ లైన్ల విషయంలో ఉభయ రాష్ట్రాల విద్యుత్ సంస్థలు 2003 విద్యుత్ చట్టం, వర్క్స్ ఆఫ్ లైసెన్సీస్ రూల్స్ 2006కు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని, రైతులకు పరిహారం చెల్లించడంలేదని చెంగల్‌రెడ్డి హైకోర్టుకు లేఖ రాశారు. దీన్ని హైకోర్టు పిల్‌గా పరిగణించి, ఇదే వ్యవహారంపై అంతకు ముందు దాఖలైన వ్యాజ్యంతో దీనిని జత చేసింది.

✦ కన్నడ సినీ నటుడు ధ్రువ్ ఆత్మహత్య!



యలహంక (బెంగళూరు): కన్నడ సినీ నటుడు, సెలబ్రిటీ క్రికెట్ లీగ్(సీసీఎల్) ద్వారా తెలుగు ప్రేక్షకులకు చిరపరిచితుడైన ధ్రువ్‌శర్మ(35) అనుమానాస్పదరీతిలో మృతి చెందారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు బెంగళూరు రాజన్నకుంట్టె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సొంత కంపెనీలో నష్టాలు రావడం, అప్పుల బాధ తట్టుకోలేక తన కుమారుడు ధ్రువ్ శర్మ విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన తండ్రి సురేష్‌శర్మ మంగళవారం పోలీసులకు తెలిపారు. ధ్రువ్ శనివారం పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు ఆయన్ను సమీపంలోని కొలంబియా ఏషియా ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి మంగళవారం వేకువ జామున ఆయన మరణించారు. ధ్రువ్ పుట్టుకతోనే మూగ, చెవిటి. అయినప్పటికీ పట్టుదలతో నటనలో శిక్షణ పొంది పలు కన్నడ సినిమాల్లో హీరోగా నటించి పేరు తెచ్చుకున్నారు. ధ్రువ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు.

జర్నలిస్ట్‌పై 'ఫత్వా'

- డార్క్‌నెట్‌పై వార్త రాసిన ఆంగ్ల పత్రిక విలేకరి
- అతడిని అంతం చేసేందుకు బిట్‌కాయిన్ల ఆఫర్ ఇచ్చిన డ్రగ్ పెడ్లర్
- సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన విలేకరి



సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ కేసు దర్యాప్తు చేస్తున్న ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్‌కు డ్రగ్ మాఫియా నుంచి వచ్చిన బెదిరింపు కాల్స్ వ్యవహారం ఓ కొలిక్కి రాకముందే... మాదకద్రవ్యాల వ్యాపారంపై కథనం రాసిన ఓ విలేకరికి హెచ్చరికలు అందాయి. డార్క్‌నెట్‌లో డ్రగ్స్ వ్యాపారంపై ఓ ఆంగ్ల పత్రికలో కథనం రాసినందుకు ఓ డ్రగ్ పెడ్లర్ ఆన్‌లైన్ 'ఫత్వా'జారీ చేశాడు. సదరు జర్నలిస్ట్, అతడి కుటుంబాన్ని అంతం చేస్తే బిట్‌కాయిన్స్ రూపంలో నజరానా ఇస్తానంటూ ఇంటర్‌నెట్‌లో ప్రకటించాడు. దీనిపై ఆ విలేకరి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కేసు నమోదైంది.

అంతం చేస్తే రూ.7.2 లక్షలు..!

డ్రగ్ కేసు దర్యాప్తు చేపట్టిన ఎక్సైజ్, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనేక మంది మాదకద్రవ్య విక్రేతల్ని అరెస్టు చేశారు. వీరిలో అత్యధికులు ఇంటర్‌నెట్‌లో అథోజగత్తుగా పరిగణించే డార్క్ నెట్ ద్వారా ఆర్డర్ చేసి, విదేశాల నుంచి మాదకద్రవ్యాలు ఖరీదు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో ఓ ఆంగ్ల పత్రిక విలేకరి డార్క్‌నెట్‌లో డ్రగ్స్ దందాపై కథనం రాశారు. అందులోని భారత పెడ్లర్ల కోసం శోధించిన ఆయన... మ్యాడ్లీబూటెడ్ ఐడీతో ఉన్న వ్యక్తి భారీగా మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు సాగిస్తున్నా డని గుర్తించారు. దీన్ని పేర్కొంటూ ఆయన రాసిన కథనం సదరు పత్రికలో విలేకరి పేరుతో సహా ప్రచురి తమైంది. ఈ కథనాన్ని చూసిన సదరు డ్రగ్ పెడ్లర్ ఫేస్‌బుక్ ద్వారా జర్నలిస్ట్, ఆయన కుటుంబ వివరాలు సేకరించాడు. వీటిని పొందుపరుస్తూ ఇంటర్‌నెట్‌లో 'ఫత్వా'జారీ చేశాడు. జర్నలిస్ట్‌ను అంతం చేస్తే నాలుగు బిట్‌కాయిన్లు (రూ.7.2 లక్షలు), కుటుంబ సభ్యుల్ని చంపితే ఆరు బిట్‌కాయిన్లు (రూ.10.8 లక్షలు) నజరానాగా ఇస్తానంటూ వారి ఫొటోలతో సహా ఓ పోస్టర్ రూపొందించి ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశారు.

ఐపీ అడ్రస్ గుర్తించే ప్రయత్నం...

జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలపై ఇష్టాగోష్టి చర్చలు జరిగే రెడిట్.కామ్ ఫోరమ్‌లో ఈ 'ఫత్వా' వివరాలు కనిపించాయి. అందులో 10 బిట్‌కాయిన్ల నజరానాపై పెద్ద ఎత్తున చర్చలు జరిగాయి. ఈ విషయం తన స్నేహితుడి ద్వారా తెలుసుకున్న సదరు జర్నలిస్ట్ హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఆధీనంలోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ కేసీఎస్ రఘువీర్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ చాంద్‌పాషా దర్యాప్తు చేపట్టారు. అధికారులు ప్రాథమికంగా సేకరించిన సమాచారం ప్రకారం ఆ డ్రగ్ పెడ్లర్ మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. ప్రత్యేక బ్రౌజర్ల ద్వారా డార్క్‌నెట్ వినియోగించే వారి ఐపీ అడ్రస్ గుర్తించడం కష్టసాధ్యం. ఆయా వెబ్‌సైట్లు హోస్ట్ అయ్యే సర్వర్లు రష్యా, పోలెండ్ తదితర దేశాల్లో ఉండమే దీనికి కారణమని అధికారులు చెప్తున్నారు. దీంతో ఆ డ్రగ్ పెడ్లర్‌కు చెందిన ఐపీ అడ్రస్ తెలపాల్సిందిగా ఆయా సంస్థలకు లేఖలు రాశారు. ఆ వివరాలు అందిన తర్వాత దర్యాప్తు ముమ్మరం చేస్తామని సైబర్ క్రైమ్ అధికారులు తెలిపారు.

సోలార్ విద్యుత్ నిల్వల మార్గాలు అన్వేషించాలి

మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: సౌర విద్యుత్ నిల్వ చేసేందుకు నూతన మార్గాలు అన్వేషించాల్సిన అవసరముందని మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. రెన్యువబుల్ ఎనర్జీపై నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలో జరిగిన అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో ఉన్న ఆటంకాలను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై ప్రధానంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. ఒక్క సోలార్ విద్యుత్‌నే కాకుండా గాలి, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి విధానాలను కూడా రెన్యువబుల్ ఎనర్జీ జాబితాలో చేర్చి రాష్ట్రాలకు లక్ష్యాలను నిర్దేశించాలని సూచించినట్లు చెప్పారు. తెలంగాణలో 2వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, 2022 నాటికి 6,500 మెగావాట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

'విద్యుత్' పనుల్లో వేగం పెంచండి

వచ్చే జూన్ నాటికి కాళేశ్వరం ద్వారా నీరివ్వాల్సిందే: హరీశ్



మంగళవారం జలసౌధలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి హరీశ్

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది జూన్ నాటికి కాళేశ్వరం పంపింగ్ స్టేషన్లు పనిచేయనున్నందున విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ట్రాన్స్‌కోను ఆదేశించారు. డెడ్‌లైన్ లోపే విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం, పంపిణీ లైన్ల ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం జలసౌధలో నీటి పారుదల, విద్యుత్‌శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. కాళేశ్వరం సహా ఇతర ప్రాజెక్టుల కోసం 2018 జూన్ నాటికి 12,500 మెగావాట్ల విద్యుత్ అవసరమని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం పంపుహౌస్‌ల పనులను వచ్చే మార్చి నాటికే పూర్తి చేసేలా విద్యుత్ సంస్థలు పనులను మరింత వేగవంతం చేయాలని కోరారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పంపుహౌజ్‌ల పనులు పుంజుకున్నాయని, అవన్నీ మార్చి నాటికి పూర్తవుతాయన్నారు. వచ్చే ఏడాది ఖరీఫ్‌లో సాగునీరు అందించాలన్నారు. డెడ్‌లైన్ లోపు అన్ని పనులు పూర్తి చేస్తామని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు తెలిపారు.

లైన్లను మార్చండి...

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంపుహౌస్‌లతో పాటు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులోనూ రిజర్వాయర్ల మీదుగా వెళ్తున్న 220 కేవీ, 132 కేవీ, 33 కేవీ విద్యుత్ లైన్లను తరలించాలని... ప్రాజెక్టుల నిర్మాణాలకు హెచ్‌టీ లైన్లు అడ్డంకిగా మారకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు హరీశ్ సూచించారు. దాంతోపాటు పంపుహౌజ్‌లకు విద్యుత్ సరఫరా కోసం మార్చి నాటికి 10 సబ్‌స్టేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో సాగునీటి శాఖ, విద్యుత్ సంస్థలు మరింత సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని.. రెండు శాఖల్లో ఉత్సాహవంతులైన ఇంజనీర్లతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఈఎన్‌సీ మురళీధర్‌రావు, ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాష్, జెన్‌కో డైరెక్టర్ వెంకటరాజం, ఎత్తిపోతల పథకాల ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి, ట్రాన్స్‌కో సీఈ ప్రభాకర్, కాళేశ్వరం సీఈలు నల్లా వెంకటేశ్వర్లు, హరిరామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి

జోగు రామన్న



సాక్షి, హైదరాబాద్: బీసీ వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం సచివాలయంలో శాలివాహన (కుమ్మరి) సంఘ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. బీసీలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా పథకాలను రూపొందిస్తున్నామని చెప్పారు. పాత పద్ధతులను ఆచరించడం మానుకోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. రాజకీయంగా, సామాజికంగా బీసీలు ఎదగాలని ఆకాంక్షించారు. కుల వృత్తుల్లో అత్యాధునిక యంత్రాల వినియోగానికి ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి రాజస్తాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్‌లో అమలవుతోన్న పలు కార్యక్రమాలను పరిశీలించేందుకు త్వరలో అక్కడికి ప్రత్యేక బృందాలను పంపుతామన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలనే నియమించడం తప్పేం కాదు

మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో పోస్టులపై ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో 546 బోధన, బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీ ప్రక్రియపై స్టే విధిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలును ధర్మాసనం నిలిపేసింది. మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో పోస్టులను మహిళలకే పరిమితం చేయడం రాజ్యాంగ విరుద్ధమేమీ కాదని స్పష్టం చేసింది. అయితే పోస్టుల భర్తీ ప్రక్రియ కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, జస్టిస్ శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. రాష్ట్రంలోని మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లోని 546 అధ్యాపక పోస్టులను కేవలం మహిళలతో భర్తీ చేసేందుకు వీలుగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ మెదక్ జిల్లా సదాశివపేటకు చెందిన వెంకటనరసింహగౌడ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. పోస్టులన్నింటినీ మహిళలకే కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు.

పట్టిసీమ, పోలవరం వాటాలపై ఏం చేద్దాం?

నేడు ఢిల్లీలో ఏకే బజాజ్ కమిటీతో కృష్ణా, గోదావరి బోర్డు చైర్మన్ల భేటీ

సాక్షి, హైదరాబాద్: పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టుల్లో ఎగువ రాష్ట్రాలకు దక్కే నీటి వాటాలపై తెలంగాణ, ఏపీ మధ్య వివాదం నేపథ్యంలో.. ఏకే బజాజ్ కమిటీతో కృష్ణా, గోదావరి బోర్డుల చైర్మన్‌లు శ్రీవాత్సవ, హెచ్‌కే సాహా బుధవారం ఢిల్లీలో భేటీ కానున్నారు. మళ్లింపు జలాల వాటాలను ఎలా తేల్చాలి, ఇప్పటికే ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులను మార్చే అధికారాలపై బోర్డు చైర్మన్‌లు బజాజ్ కమిటీతో చర్చించనున్నారు. పోలవరం ప్రాజెక్టుకు అధికారిక అనుమతులు వచ్చిన వెంటనే నాగార్జునసాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలకు నీటి హక్కులు దక్కుతాయని, ఇందులో భాగంగా 45 టీఎంసీలు తమకు వస్తాయని తెలంగాణ అంటోంది. గతేడాది ఏపీ ఏకంగా 53 టీఎంసీల మేర నీటిని పట్టిసీమ ద్వారా కృష్ణా బేసిన్‌కు తరలించుకున్నా రాష్ట్రానికి చుక్క నీటి వాటా ఇవ్వలేదు. ఈ ఏడాది సైతం మరో 28 టీఎంసీల మేర వినియోగించింది. ఈ నేపథ్యంలో బోర్డు సభ్యకార్యదర్శి సమీర్ ఛటర్జీ బుధవారం ఇరు రాష్ట్రాల ఇంజనీర్లతో భేటీ కానున్నారు.

అక్కను స్కూలుకు పంపేందుకు వచ్చి..

- స్కూలు బస్సు కింద పడి మరణించిన రెండేళ్ల చిన్నారి
- మీర్‌పేట్‌లో విషాదం



చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి. ఇన్‌సెట్‌లో మనీశ్ (ఫైల్)

హైదరాబాద్: అమ్మతో కలసి అక్కను స్కూలు బస్సు ఎక్కించేందుకు బయటకు వచ్చిన రెండేళ్ల చిన్నారి... అదే బస్సు చక్రాల కింద పడి నలిగిపోయాడు. అప్పటివరకూ ఆడుతూ... ముద్దు లొలికించిన బుడతడు అంతా చూస్తుండగానే... క్షణాల్లో ప్రాణాలు కోల్పోయాడు. కళ్లముందే జరిగిన ఈ ఘోరం చూసి ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. హైదరాబాద్ మీర్‌పేట్‌లో మంగళవారం జరిగిన ఈ విషాదం అక్కడున్నవారిని కలచివేసింది. సూర్యాపేట జిల్లా ఎలకారం గ్రామానికి చెందిన రమేశ్ యాదవ్ చంపాపేట్‌లోని నారాయణ కళాశాలలో వైస్‌ప్రిన్స్‌పాల్‌గా పనిచేస్తున్నారు. భార్య లలిత, కూతురు మోక్ష(4), కుమారుడు మనీశ్(2)తో కలసి మీర్‌పేట్ ఠాణా పరిధిలోని శివాహిల్స్‌లో నివాసం ఉంటున్నారు. మోక్ష సమీపంలోని భారతీయ మహావిద్యాలయలో ఎల్‌కేజీ చదువుతోంది. రోజూ మాదిరిగానే మంగళవారం కూడా లలిత తన కుమార్తె మోక్షను పాఠశాలకు పంపే క్రమంలో ఇంటి ముందుకు వచ్చిన బస్సు ఎక్కించేందుకు బయటకు వచ్చింది. ఎప్పటిలానే తల్లి, అక్కను అనుసరిస్తూ మనీశ్ బయటకు వచ్చాడు. అయితే ఊహించని విధంగా బస్సు ముందు టైర్ కిందకు వెళ్లాడు. ఇది గమనించని డ్రైవర్ బస్సును కదిలించడంతో మనీశ్ తల మీద నుంచి ముందు టైర్ వెళ్లింది. దీంతో చిన్నారి అక్కడిక్కడే మృతి చెందాడు. రక్తపు మడుగులో తమ బిడ్డను చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు భోరున విలపించారు. దీనిపై కేసు నమోదు చేశామని, బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని సీఐ రంగస్వామి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఎంపీపీ విక్రంరెడ్డి తదితరులు ఘటనా స్థలికి వచ్చి చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.